జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967, 7989694528

రంగారెడ్డి మంగళవారం 31 డిసెంబర్ 2024 సంపుటి : 15 సంచిక : 279 వెల: రూ.5 పేజీలు: 08 RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్నిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com



## పూజారులకు నెలకు రూ.18 వేల జీతం

- ఎన్నికల హామీ ప్రకటించిన అరవింద్ కేజ్రీవాల్
- గురుద్వారాల గ్రంథిలకు కూడా నెలకు రూ.18,000 వేతనం
- పూజారులు నిస్వార్థంగా సమాజానికి సేవ చేస్తున్నారు
- వారి ఆర్థిక శ్రేయస్సును ఎవరూ పట్టించుకోవడం లేదు
- రేపటి నుంచే రిజిస్ట్రేషన్ ప్రక్రియను నేనే ప్రారంభిస్తాను
- మీడియా సమావేశంలో ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రకటన

# జగన్‌కు క్రెడిబులిటీ లేదు

- సీఎం చంద్రబాబు విసుర్లు
- ఐదేళ్లలో ఏం జరిగింది...ఇప్పుడు ఏం జరిగింది అని ప్రజలు చూస్తున్నారు
- జగన్ ఎప్పుడు ఏం చేస్తారనేది అతనికే తెలియదు
- క్రెడిబిలిటీ లేని నాయకులు, హిడెన్ ఏజెండాతో మాట్లాడతారు
- తెలుగుతల్లికి జలహారతి'... భారీ ప్రాజెక్టు పేరు ప్రకటించిన సీఎం చంద్రబాబు
- ఏపీ ప్రభుత్వం భారీ ఎత్తున తీసుకువస్తున్న గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు
- ఏపీకి గేమ్ చేంజర్ అవుతుందన్న చంద్రబాబు
- నదుల అనుసంధానంతో ప్రతి ఎకరాకు నీళ్లు ఇస్తామని వెల్లడి



**అమరావతి**

వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికు క్రెడిబులిటీ లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విమర్శించారు. ఐదేళ్లలో ఏం జరిగింది...ఇప్పుడు ఏం జరిగింది అని ప్రజలు చూస్తున్నారన్నారు. జగన్ ఎప్పుడు ఏం చేస్తారనేది అతనికే తెలియదని ఎద్దేవా చేశారు. క్రెడిబిలిటీ లేని నాయకులు, హిడెన్ ఏజెండాతో మాట్లాడతారని సెటైర్లు గుప్పించారు. వాస్తవాలు లేకుండా జగన్ మాట్లాడతారని మండిపడ్డారు. అబద్ధాలతో రాజకీయం చేశారని.. ఇప్పుడు అలాకాదని అన్నారు. రాష్ట్ర ప్రజలకు సీఎం చంద్రబాబు నాయుడు 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇవాళ(సోమవారం) ఏపీ సచివాలయంలో సాగునీటి ప్రాజెక్ట్‌లపై సీఎం చంద్రబాబు పవర్ ప్రజెంటెషన్ ఇచ్చారు. మీడియా, ఫైనాన్స్, వ్యవస్థలు, వ్యక్తులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని చెప్పారు. వాటర్ సెక్యూరిటీకి ఎంతో - మిగతా3లో

## పింఛనులలో స్పౌజ్ విధానం అమలు




- పింఛన్ల పంపిణీలో ప్రభుత్వం కీలక నిర్ణయం
- స్పౌజ్ కేటగిరి కింద కొత్తగా 5,402 మందికి పింఛన్లు
- ఎన్టీఆర్ భరోసా పథకం కింద అందించే సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ ఎక్కువ మందికి లబ్ధి
- ఆరేడు నెలలకు ఒకసారి కొత్తగా పింఛన్లు మంజూరు చేసే ధోరణికి స్వస్తి
- ఇప్పటికే పింఛను తీసుకుంటున్న భర్త చనిపోతే వెంటనే భార్యకు ఏ నెలకు ఆ నెలే పింఛను ఇచ్చే విధానాన్ని అమల్లోకి తెచ్చాం

**అమరావతి**

సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కీలక ప్రకటన చేశారు. స్పౌజ్ కేటగిరి కింద కొత్తగా 5,402 మందికి పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేస్తుంది. ఎన్టీఆర్ భరోసా పథకం కింద అందించే సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సరళీకృతం చేసిందని అన్నారు. ఆరేడు నెలలకు ఒకసారి కొత్తగా - మిగతా3లో

## అల్లు అర్జున్ బెయిల్ పిటీషన్ వాయిదా



- ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు జనవరి 3కు తీర్పు వాయిదా
- రెగ్యూలర్ బెయిల్ కోసం అల్లు అర్జున్ లాయర్లు ప్రయత్నం
- అల్లు అర్జున్ తరపున లాయర్ నిరంజన్ వాదనలు
- రెగ్యూలర్ బెయిల్ వస్తే అల్లు అర్జున్ పోలీసుల విచారణకు సహకరించదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన వాదనలు

## తెలంగాణ సీఎం రేవంత్ పాలన భేష్

- అనవసర రాద్ధాంతం చేయవద్దు
- అభిమాని రేవతి చనిపోయిన విషయం తెలిసిన వెంటనే బాధితులను పరామర్శించాలి కానీ, గోటితో పోయే దాన్ని గొడ్డలి దాకా తెచ్చుకున్నారు
- అల్లు అర్జున్ మాత్రమే కాదు, వాళ్ల టీమ్ అయినా వెంటనే మృతిచెందిన వారి కుటుంబసభ్యులను కలిసి పరామర్శిస్తే సరిపోయేది
- చట్టం ఎవరికీ చుట్టం కాదని, ఐన్నీ స్థానంలో రేవంత్ రెడ్డి ఉన్నా అరెస్ట్ చేస్తారు
- పవన్ కళ్యాణ్ సంచలన వ్యాఖ్యలు



### మరో రూ.1,82,162 కోట్ల

# పెట్టుబడులు

- 2.63 లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు
- క్లీన్ ఎనర్జీ పాలసీతో క్యూ కడుతున్న సంస్థలు
- శ్రీ సత్యసాయి జిల్లా గుడిపల్లిలో ఎలక్ట్రిక్ త్రీ వీలర్ ట్రక్కులు, బస్సులు, బ్యాటరీ ప్యాక్‌ల గ్రీన్ ప్రాజెక్టు
- ఎస్ఐపీబీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం



**అమరావతి**

రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు పెద్దఎత్తున వస్తున్న సంస్థలకు భూకేటాయింపులతో సహా మౌలిక వసతులను శరవేగంగా కల్పించాలని, అదేవిధంగా ఒప్పందం ప్రకారం నిర్దిష్ట సమయంలోనే ప్రాజెక్టులు పూర్తయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక రంగానికి - మిగతా3లో



## మహిళల రక్షణకు చర్యలు తీసుకోవాలి

- తమిళనాడు గవర్నర్‌కు నటుడు విజయ్ వినతి
- రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని తాము ప్రభుత్వాన్ని కోరుతున్నాం
- తమిళనాడులో శాంతిభద్రతలకు విఘాతం కలిగింది
- రాష్ట్ర ప్రభుత్వం కోరిన మేరకు కేంద్ర ప్రభుత్వం వెంటనే రిలీఫ్ ఫండ్‌ను రిలీజ్ చేసేలా చర్యలు తీసుకోవాలి

## పోలీస్ శాఖ అభివృద్ధికి

# బాటలు వేస్తాం

- గ్రేహౌండ్స్, ఆక్టోపస్, సైబర్ సెక్యూరిటీ సంస్థలను నెలకొల్పుతాం
- పోలీస్ అకాడమీ(అప్పా) శాశ్వత భవనాల నిర్మాణానికి భూసేకరణ పూర్తి అయింది
- నేర నియంత్రణే లక్ష్యం..పోలీసుల వసతులకు ప్రాధాన్యం ఇసాం
- హోంమంత్రి వంగలపూడి అనిత



**అమరావతి:**

కేంద్ర ప్రభుత్వం నిధులు రాబట్టి పోలీస్ శాఖ అభివృద్ధికి బాటలు వేస్తామని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్, సైబర్ సెక్యూరిటీ సంస్థలను నెలకొల్పుతామని చెప్పారు. పోలీస్ అకాడమీ(అప్పా) శాశ్వత భవనాల నిర్మాణానికి భూసేకరణ పూర్తి అయిందని అన్నారు. నేర నియంత్రణే లక్ష్యం..పోలీసుల వసతులకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. జనవరి మొదటి వారంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అవుతామని చెప్పారు. పోలీసులకు అత్యాధునిక శిక్షణ కేంద్రాల - మిగతా3లో

# తెలంగాణ సీఎం రేవంత్ పాలన భేష్

**హైదరాబాద్ :** టాలీవుడ్ నటుడు అల్లు అర్జున్ అరెస్టుపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎట్టకేలకు స్పందించారు. అభిమాని రేవతి చనిపోయిన విషయం తెలిసిన వెంటనే బాధితులను పరామర్శించాలి కానీ, గోటితో పోయే దాన్ని గొడ్డలి దాకా తెచ్చుకున్నారంటూ చిట్ చాట్ లో పవన్ కళ్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అల్లు అర్జున్ మాత్రమే కాదు, వాళ్ల టీమ్ అయినా వెంటనే మృతిచెందిన వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శిస్తే సరిపోయేదన్నారు. మానవతా ధృక్పథం లోపించినట్లు కనిపిస్తుందననారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పరిపాలపై పవన్ కళ్యాణ్ ప్రశంసలు కురిపించారు. రేవంత్ రెడ్డి కాబట్టే హీరో అయిన అల్లు అర్జెన్‌ను అరెస్టు చేయగలిగారు. చట్టం ఎవరికీ చుట్టం కాదని, బన్నీ స్థానంలో రేవంత్ రెడ్డి ఉన్నా అరెస్ట్ చేస్తారని కామెంట్ చేశారు. తన పేరు చెప్పలేదని అల్లు అర్జున్ ను రేవంత్ రెడ్డి అరెస్టు చేశారని అనడం పెద్ద తప్పు అన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ ఆ స్థాయి దాటిన బలమైన నేత అన్నారు. తెలుగు పరిశ్రమకు రేవంత్ ప్రభుత్వం అన్ని రకాలుగా సహకారం అందిస్తోంది. పుష్ప 2 బెనిఫిట్ షోలు ఇవ్వడం, టికెట్ రేట్లు పెంపు నిర్ణయం సినిమాలను ప్రోత్సహించడమే అన్నారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన, అల్లు అర్జున్ అరెస్టుపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖలు వైరల్ అవుతున్నాయి.



అసలే మెగా వర్సెస్ అల్లు ఫ్యామిలీ అని ఎప్పటి నుంచో ప్రచారంలో ఉంది. తామంతా ఒకటేనని వారు పలు ఈవెంట్లలో స్టేజీ మీద చెప్పేశారు. అల్లు అర్జున్ సినిమాల ప్రిరిలీజ్ ఈవెంట్లలో పవర్ స్టార్ పవర్ స్టార్ అని, లేక పవన్ కళ్యాణ్ పవన్ కళ్యాణ్ అని మెగా ఫ్యాన్స్ అరవడం తెలిసిందే. కెరీర్ మొదట్లో మెగాస్టార్ చిరంజీవి గురించి మాట్లాడిన అల్లు అర్జున్ గత కొన్ని సినిమాల నుంచి మెగా అనే ప్రభావం తగ్గిస్తూ వస్తున్నారు. పుష్ప సినిమాకు అల్లు అర్జున్‌కు జాతీయ ఉత్తమ నటుడు వచ్చిన తరువాత పవన్ కళ్యాణ్ ను స్పందన అడిగితే గంజాయి స్మగ్లింగ్ చేసే సినిమాకు జాతీయ అవార్డులు రావడం ఏంటోనని చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి.

ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో నంద్యాల ప్రచారంపై వివాదం

ఏపీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో పవన్ కళ్యాణ్ కోసం మెగాస్టార్ చిరంజీవి కుటుంబసభ్యులు తమ వీలు చూసుకుని ప్రచారంలో పాల్గొన్నారు. లేకపోతే నేరుగా పిఠాపురం వెళ్లి పవన్ కళ్యాణ్‌ను కలుసుకుని మద్దతు తెలిపారు. అందుకు భిన్నంగా పుష్ప 2 హీరో అల్లు అర్జున్ నంద్యాలకు వెళ్లి వైసీపీ అభ్యర్థికి మద్దతు తెలపడం వివాదాన్ని రాజేసింది. నంద్యాల సిట్టింగ్ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డికి మద్దతు తెలిపేందుకు అల్లు అర్జున్ నంద్యాలకు వెళ్లిన సమయంలో మెగా వర్సెస్ అల్లు ఫ్యామిలీగా సమీకరణాలు మారిపోయాయి. మరోవైపు పవన్ కళ్యాణ్ పార్టీ జనసేనకు మద్దతు తెలపలేదు కానీ, నంద్యాలకు వెళ్లి మరీ వైసీపీ వారిని కలవడం రాజకీయంగానూ దుమారం రేపింది. తెలంగాణ ప్రభుత్వం పుష్ప 2 సినిమాకు బెనిఫిట్ షోలు, టికెట్ల ధరల పెంపుపై ముందుగానే నిర్ణయం తీసుకోగా, ఏపీలో మాత్రం కాస్త ఆలస్యమైంది. పుష్ప 2 ప్రి రీలీజ్ జరుగుతున్న సమయంలో ఏపీ ప్రభుత్వం టికెట్ రేట్ల పెంపుతో పాటు బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వడం తెలిసిందే. ఇటీవల జరిగిన పుష్ప 2 ప్రీ రిలీజ్ ఈవెంట్ చూసిన ఎవరికైనా అది నిజం కాదనిపిస్తుంది. ఎందుకంటే ఆ ఈవెంట్ కేవలం అల్లు ఈవెంట్ అని, మెగా ఫ్యామిలీ, మెగా అనే పదానికి సంబంధమే లేదన్నట్లుగా జరిగిందని అంతా గమనించారు. కానీ అల్లు అర్జున్ అరెస్ట్ అని తెలియగానే చిరంజీవి విశ్వంభర షూటింగ్ రద్దుచేసుకుని వెంటనే అల్లు అర్జున్ ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. నాగబాబు సైతం వెళ్లారు. చివరగా జైలు నుంచి వచ్చాక అల్లు అర్జున్ కుటుంబంతో వెళ్లి చిరంజీవిని కలవడం చూసిన వారు ఆఫ్యామిలీ అంతా ఒకటేనని చూపిస్తున్నారు. ఈ క్రమంలో పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు టార్గెట్ చేసి చేసినవి కాకపోయినా, అదే అర్థం వస్తుందని నెటిజన్లు, ఐకాన్ స్టార్ ఫ్యాన్స్ రియాక్ట్ అవుతున్నారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో అరెస్టైన అల్లు అర్జున్ రెగ్యూలర్ బెయిల్ పిటిషన్ డిసెంబర్ 27న దాఖలు చేశారు. నాంపల్లి కోర్టు విధించిన 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ గడువు ముగియడంతో వర్చువల్‌గా కోర్టు విచారణకు నటుడు హాజరయ్యారు. హైకోర్టు అల్లు అర్జున్‌కు మధ్యంతర బెయిల్ మంజూరుచేసిందని, రెగ్యూలర్ ఇవ్వాలని ఆయన తరపు లాయర్ నిరంజన్ రెడ్డి నాంపల్లి కోర్టును కోరారు. నేడు పోలీసులు దాఖలు చేసిన బెయిల్ కౌంటర్ పిటిషన్ ను విచారించిన నాంపల్లి కోర్టు తీర్పును జనవరి 3కి వాయిదా వేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న నాంపల్లి కోర్టు తీర్పును రిజర్వ్ చేయడంతో అల్లు అర్జున్ అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. నాంపల్లి కోర్టు ఆయనకు బెయిల్ ఇస్తుందా లేదా అనే చర్చ మొదలైంది.

## అల్లు అర్జున్ బెయిల్ పిటీషన్ వాయిదా



**హైదరాబాద్ :** టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్ విచారణ వాయిదా పడింది. నేడు అల్లు అర్జున్ రెగ్యూలర్ బెయిల్ పిటిషన్ పై విచారణ చేపట్టిన నాంపల్లి కోర్టు, బెయిల్ పై పోలీసులు దాఖలు చేసిన కౌంటర్ ను పరిశీలించింది. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు జనవరి 3కు తీర్పు వాయిదా వేసింది. అల్లు అర్జున్ కు నాంపల్లి కోర్టు 14 రోజుల జ్యుడిషీయల్ కస్టడీ విధించగా పోలీసులు ఆయనను చంచల్ గూడ జైలుకు తరలించారు. అదేరోజు హైకోర్టులో వేసిన పిటిషన్ విచారించిన హైకోర్టు నాలుగు వారాల మధ్యంతర బెయిల్ ఇవ్వడం తెలిసిందే. దాంతో రెగ్యూలర్ బెయిల్ కోసం అల్లు అర్జున్ లాయర్లు ప్రయత్నిస్తున్నారు. అల్లు అర్జున్ తరపున లాయర్ నిరంజన్ వాదనలు వినిపించారు. సంధ్యా థియేటర్ వద్ద జరిగిన ఘటనకు అల్లు అర్జున్ కు ఏం సంబంధం లేదు. రేవతి మృతికి నటుడు కారణమంటూ పోలీసులు నమోదు చేసిన కేసు చెల్లదు. బీఎన్ఎస్ సెక్షన్ 105 అల్లు అర్జున్ కు వర్తించదు. హైకోర్టు ఈ కేసులో ఇదివరకే అల్లు అర్జున్‌కు మధ్యంతర ఇచ్చింది. దాంతో రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయాలని నిరంజన్ రెడ్డి నాంపల్లి కోర్టులో వాదనలు వినిపించారు.

**పబ్లిక్ ప్రాసుక్యూటర్ వాదనలు ఇవీ..**

మహిళా అభిమానికి రేవతి మృతికి నటుడు అల్లు అర్జున్ ప్రధాన కారణం. థియేటర్ కు ఆయన ర్యాలీ, రోడ్ షోగా రావడంతోనే థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగింది. నటుడికి బెయిల్ ఇస్తే తన పలుకుబడితో సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉంది. రెగ్యూలర్ బెయిల్ వస్తే అల్లు అర్జున్ పోలీసుల విచారణకు సహకరించడని పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన వాదనలు వినిపించారు. అందుకే అల్లు అర్జున్ దాఖలు చేసిన రెగ్యూలర్ బెయిల్ పిటిషన్ ని కొట్టివేయాలని న్యాయమూర్తిని కోరారు. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన పుష్ప 2 మూవీ డిసెంబర్ 5న ప్రపంచ వ్యాప్తంగా రికార్డు స్థాయిలో 12 వేల స్క్రీన్లలో రిలీజ్ అయింది. అయితే డిసెంబర్ 4న హీరో అల్లు అర్జున్, రష్మిక మందన్నా ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని సంధ్య 70 ఎంఎం థియేటర్‌కు వెళ్లి పెయిడ్ ప్రీమియర్ షో చూశారు. అయితే అల్లు అర్జున్ రాక సందర్భంగా థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగి రేవతి అనే మహిళా అభిమాని చనిపోగా, ఆమె కుమారుడు తీవ్ర అస్వస్థతతో సికింద్రాబాద్ లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. చిక్కడపల్లి పోలీసులు సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటపై కేసు నమోదు చేసి 18 మందిని నిందితులుగా చేర్చారు. ఏ 11గా అల్లు అర్జున్ ఉండగా, ఏ18గా పుష్ప 2 నిర్మాత ఉన్నారు. ఈ క్రమంలో డిసెంబర్ 13న చిక్కడపల్లి పోలీసులు అల్లు అర్జున్ నివాసానికి వెళ్లి అరెస్ట్ చేశారు. అనంతరం నాంపల్లి కోర్టులో ప్రవేశపెట్టగా రెండు వారాల రిమాండ్ విధించింది కోర్టు. అదే రోజు హైకోర్టులో దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్ విచారించిన హైకోర్టు నాలుగు వారాలపాటు మధ్యంతర బెయిల్ ఇచ్చింది.

# పూజారులకు నెలకు రూ.18 వేల జీతం

త్వరలో జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ తిరిగి విజయం సాధిస్తే దేవాలయాల పూజారులు, గురుద్వారాల గ్రంథి లకు నెలకు రూ.18 వేల వేతనాన్ని చెల్లిస్తామని ఆ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. ఈమేరకు సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన మరో ఎన్నికల హామీని ఆయన వెల్లడించారు. "పురోహితులు, గ్రంథిలు మన మతపరమైన ఆచారాలకు సంరక్షకులుగా కొనసాగుతున్నారు. సమాజానికి నిస్వార్థంగా సేవ చేస్తున్నారు. దురదృష్టవశాత్తు వారి ఆర్థిక శ్రేయస్సును ఎవరూ పట్టించుకోలేదు. అందుకే మేము మళ్లీ అధికారంలోకి వస్తే నెలనెలా రూ.18,000 జీతం చెల్లిస్తాం. ఈ పథకానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ రేపటి (మంగళవారం) నుంచి ప్రారంభమవుతుంది. హనుమాన్ ఆలయంలో నేనే స్వయంగా ఈ ప్రక్రియను



ప్రారంభిస్తాను" అని కేజ్రీవాల్ తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎలాంటి అడ్డంకులు సృష్టించవద్దని బీజేపీని తాను అభ్యర్థిస్తున్నానని, ఈ ప్రక్రియను అడ్డగిస్తే పాపం చేసినట్లే అవుతుందని కేజ్రీవాల్ హెచ్చరించారు. పూజారులు, గ్రంథిలు మన దేవుళ్లకు వారధిగా ఉంటున్నారని కొనియాడారు. కాగా, వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో ఆప్ పార్టీ వరుసగా ఎన్నికల హామీలను ప్రకటిస్తోంది. ముందుగా సీనియర్ సిటిజన్ల కోసం 'సంజీవని' పథకం, ఆ తర్వాత 'మహిళా సమ్మాన్ యోజన', తాజాగా అర్చకులకు నెలవారీ వేతన పథకాన్ని మాజీ ముఖ్యమంత్రి ప్రకటించారు. సంజీవని యోజన కింద 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఉచిత ఆరోగ్య సంరక్షణ ఉంటుంది. మహిళా సమ్మాన్ యోజన పథకం కింద మహిళలకు నెలకు రూ.2,100 ఆర్థిక సాయం అందజేస్తామని ఆప్ పార్టీ ప్రకటించింది.

## మహిళల రక్షణకు చర్యలు తీసుకోవాలి



తమిళనాడులో శాంతిభద్రతలకు విఘాతం కలిగిందని, శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్నదని టీవీకే పార్టీ అధ్యక్షుడు, నటుడు విజయ్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని తాము ప్రభుత్వాన్ని కోరుతున్నామని ఆయన చెప్పారు. ఈ మేరకు తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవికి విజయ్ ఒక వినతి పత్రం ఇచ్చారు. అదేవిధంగా తమిళనాడులో ఇటీవల తీవ్ర ప్రభావం చూపిన ఫెంగాల్ తుఫాను అంశాన్ని కూడా నటుడు విజయ్ తన పిటిషన్‌లో ప్రస్తావించారు. ఫెంగాల్ తుఫాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా తీవ్రంగా ప్రభావితమైన వారికి ఇప్పటికీ సరైన రిలీఫ్ అందలేదని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం కోరిన మేరకు కేంద్ర ప్రభుత్వం వెంటనే రిలీఫ్ ఫండ్‌ను రిలీజ్ చేసేలా చర్యలు తీసుకోవాలని నటుడు గవర్నర్‌ను కోరారు.

# కల్తీ నెయ్యి విషయం మర్చిపోకముందే...

**తెరపైకి పరకామణి వ్యవహారం**

**200 కోట్ల స్కామ్..**

**తిరుమల :** తిరుమల పరకామణిలో వందల కోట్ల దోపిడీ జరిగిందనే ఆరోపణలు.. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారాయి. దీని వెనుక.. గత ప్రభుత్వ పెద్దల పాత్ర ఉందని ప్రస్తుత టీటీడీ బోర్డ్ మెంబర్ చెబుతుండటమే.. కొత్త చర్చకు దారితీసింది. రవి కుమార్ అనే వ్యక్తి.. పరకామణిలో నుంచి డాలర్లను దొంగిలించాడని.. తద్వారా వందల కోట్లు కూడబెట్టాడని ఆరోపిస్తున్నారు. అతను కేసుల పాలవకుండా కొందరు పెద్దలు రక్షించారనేదే.. ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.. ఈ కేసు మొత్తం.. సీవీ రవికుమార్ అనే వ్యక్తి చుట్టే తిరుగుతోంది. అతను తిరుమల పెద్ద జియ్యంగార్ మఠంలో క్లర్క్‌గా పనిచేస్తున్నారు. అంతేకాదు.. అధికారికంగా పరకామణి కార్యకలాపాల్ని పర్యవేక్షించే ప్రతినిధిగానూ ఉన్నారు. ఏప్రిల్ 29 2023న.. ఎప్పటిలాగే పరకామణిలో స్వామివారి హుండీ కానుకల లెక్కింపునకు హాజరయ్యారు. ఈ క్రమంలో తిరుమలేశునికి కానుకగా వచ్చిన అమెరికన్ డాలర్లను రవి కుమార్ దొంగిలించారు. తనలో దాచుకొని డాలర్లను బయటకు తీసుకెళ్తుండగా టీటీడీ విజిలెన్స్ ఓఎూ సతీష్ కుమార్‌కు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయారు. అతని దగ్గర్నుంచి.. 72 వేల విలువైన అమెరికన్ డాలర్లను స్వాధీనం చేసుకున్నారు. తర్వాత తిరుమల వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో రవికుమార్‌పై.. ఓఎూ సతీశ్ కుమార్ ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా.. అతనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తర్వాత విచారణలో భాగంగా రవి కుమార్ దగ్గర్నుంచి దొంగిలించిన కరెన్సీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. 2023 మే 30వ తేదీని.. అతనిపై ఛార్జ్ షీట్ కూడా ఫైల్ చేశారు. ఇక్కడిదాకా అంతా బాగానే ఉంది. ఇక్కడే.. కథ మరో మలుపు తీసుకుంది. రవికుమార్ విచారణ తర్వాత.. కొందరు పెద్దలు సీన్‌లోకి ఎంటరయ్యారనే చర్చ నడుస్తోంది. రవి కుమార్ నిరంతరం స్వామి వారి పరకామణి లెక్కింపునకు వెళ్లే వాడని, పెద్దజియ్యర్ మఠం ఉద్యోగి కాబట్టి.. అతనికి పెద్దగా తనిఖీలు ఉండకపోవడంతో.. భారీ మొత్తంలో చోరీకి పాల్పడ్డాడనే ఆరోపణలు ఉన్నాయి. అలా తిరుమల వేంకటేశునికి కానుకల రూపంలో అందిన కరెన్సీని దొంగిలించి.. దాని ద్వారా తిరుపతి, చెన్నై, బెంగళూరు, మహాబలిపురం, మైసూరులో.. వందల కోట్ల విలువైన ఆస్తులు కూడబెట్టాడని సమాచారం. ఈ వ్యవహారం బయటకొస్తే.. తిరుమల పెద్ద జియ్యర్ మఠానికి చెడ్డపేరు వస్తుందని.. ఈ విషయం బయటకు రాకుండా చేశారనే ప్రచారం జరుగుతోంది. కానీ.. అసలు విషయం వేరే ఉంది. రవికుమార్ ఆస్తులపై కన్నేసిన కొందరు బడా బాబులు.. అతని ఆస్తుల్ని బలవంతంగా అమ్మించి.. క్యాష్ చేసుకున్నారనే ఆరోపణలున్నాయ్. కొన్ని కొసరు ఆస్తుల్ని మాత్రం స్వామి వారి పేరుతో రాయించారని అంటున్నారు. టీటీడీ విజిలెన్స్ రిపోర్ట్‌లోనూ కొన్ని కీలక విషయాల్ని ప్రస్తావించారు. తిరుపతి, చెన్నైలో తమ పేరిట ఉన్న కోట్లు విలువైన ఆస్తుల్ని.. రవి కుమార్, అతని భార్య.. 2023 మే 19వ తేదీన తిరుమల తిరుపతి దేవస్థానానికి రాసిచ్చేశారు. శ్రీనివాసుడి మీద ఉన్న అపారమైన భక్తిశ్రద్ధలతోనే తమ ఆస్తుల్ని రాసిచ్చేస్తున్నట్లుగా.. రవికుమార్ దంపతులు రాతపూర్వకంగా తెలియజేశారు. ఈ ఎపిసోడ్ తర్వాత.. సెప్టెంబర్‌లో పరకామణిలో కరెన్సీ దొంగతనం కేసుకు సంబంధించి.. లోకాయుక్తలో రాజీకొచ్చారు. చోరీ కేసులో రాజీ పడటం ఏమిటనేదే.. అర్థంకాని విషయం. 2023 ఏప్రిల్ చివర్లో కేసు నమోదైతే.. సరిగ్గా నాలుగు నెలలకు లోకాయుక్తలో రాజీ పడటమేంటి? అనేదే అసలు డౌట్? ఈ నాలుగు నెలల గ్యాప్‌లోనే.. అప్పటి టీటీడీ పెద్దలు, కొందరు ఉన్నతాధికారులు పెద్ద వ్యవహారాన్నే నడిపారనే చర్చ ఉంది. ఈ కేసులో.. వందల కోట్లు చేతులు మారటం వల్లే.. టీటీడీ పెద్దలు, పోలీసు ఉన్నతాధికారులు సహకరించి ఉంటారనే ప్రచారం కూడా నడుస్తోంది. ఇక.. విజిలెన్స్ రిపోర్ట్‌లోనూ ఫిర్యాదుదారు ఓఎూ సతీశ్ కుమార్, నిందితుడు రవికుమార్ రాజీకి వచ్చారని.. తద్వారా కేసు మూసివేస్తున్నట్లుగా ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. పరకామణి వ్యవహారం సున్నితమైన అంశం కావడం, పైగా.. పెద్ద జియ్యంగార్ మఠానికి సంబంధించిన ఉద్యోగి ఇందులో ఇన్వాల్వ్ అయి ఉండటం వల్లే.. లోకాయుక్తలో ఇద్దరి మధ్య రాజీ కుదిరిందని విజిలెన్స్ రిపోర్ట్ ఇచ్చారు. ఇదే విజిలెన్స్ రిపోర్టులో.. మరో విషయాన్ని కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. పోలీసుల నుంచి వచ్చిన తీవ్రమైన ఒత్తిడి వల్లే.. లోకాయుక్తలో.. ఓఎూ సతీశ్ కుమార్ రాజీకి ఒప్పుకున్నారనే విషయాన్ని రిపోర్టులో తెలియజేశారు. అయితే.. పోలీసులు ఎందుకు ఇంతలా ఒత్తిడి చేశారనేది కూడా ఇప్పటికీ మిస్టరీగానే ఉంది. అసలు.. ఎవరి ప్రయోజనాల కోసం, ఎవరికి లబ్ధి చేకూర్చేందుకు.. పోలీసులు ఇంతలా ఒత్తిడి తెచ్చారనేది సస్పెన్స్‌గా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శాసనమండలిలో ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి ఈ విషయాన్ని ప్రస్తావించారు. దాంతో.. దేవాదాయశాఖ మంత్రి మాట్లాడుతూ.. పరకామణి ఇష్యూలో వంద కోట్లకు పైగా చేతులు మారాయన్నారు. టీటీడీ విజిలెన్స్ రిపోర్ట్ ప్రకారం.. పోలీసుల ఒత్తిడి వల్లే లోకాయుక్తలో రాజీ పడాల్సి వచ్చిందంటున్నారు. అంతేకాదు.. పరకామణిలో చోరీ కేసులో.. పోలీసులు బలహీనమైన సెక్షన్లు పెట్టారనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయ్యేవలం.. నిందితుడు రవికుమార్‌ని తప్పించేందుకే.. ప్రీ ప్లాన్డ్‌గా ఇలా చేశారనే ప్రచారం కూడా ఉంది. అందువల్ల.. ఈ వ్యహారంపై హైకోర్ట్ జడ్జితో విచారణ జరిపించి.. లబ్ధి పొందిన వాళ్లందరినీ జైలుకు పంపాలని ప్రస్తుత టీటీడీ బోర్డ్ మెంబర్ భాను ప్రకాశ్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. ఇక పోలీసుల ఒత్తిడి మేరకే.. లోకాయుక్తలో రాజీకి ఒప్పుకున్నామని విజిలెన్స్ ఇచ్చిన రిపోర్టే.. పరకామణి వ్యవహారంలో లబ్ధి పొందిన వారి మెడకు చుట్టుకుంటుందనే చర్చ జరుగుతోంది. తిరుమల పరకామణిలో 72 వేల విలువ చేసే అమెరికన్ డాలర్లు దొంగిలించి.. రవికుమార్ పట్టుబడ్డాడు. కానీ.. ఈ కేసు కేవలం ఆ 72 వేలకు సంబంధించింది మాత్రమే కాదు. దీని వెనుక.. వందల కోట్ల వ్యవహారం దాగుంది. అందుకోసమే.. ఈ రవికుమార్ కేసు ఎపిసోడ్‌పై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయ్. జియ్యర్ మఠానికి చెందిన ఉద్యోగిగా ఉన్న రవికుమార్.. కొన్నేళ్లుగా పరకామణిలో నుంచి డాలర్లు దొంగిలిస్తున్నాడనే విషయం క్లియర్‌గా అర్థమవుతోంది. అతనికి మిగతా వాళ్లలా తనిఖీలు ఉండకపోవడం.. అతనికి కలిసొచ్చింది. పైగా.. డాలర్లని చాలా తెలివిగా కొట్టేసేవాడు. ఆపరేషన్ ద్వారా తన కడుపుకే కోత పెట్టించుకొని.. అందులో విదేశీ కరెన్సీ తరలించారనే ప్రచారం కూడా ఉంది. అలా.. డాలర్లను మార్చి.. కోట్ల రూపాయలు వెనకేసినట్లు తెలుస్తోంది. ఇక్కడ సందేహం తలెత్తుతున్న మరో పాయింట్ ఏమిటంటే.. కేవలం 72 వేల విలువైన అమెరికన్ డాలర్ల కోసమైతే.. అతను తన ఆస్తుల్ని టీటీడీకి రాసి ఇవ్వడు. కేసును ఎదుర్కొంటాడు. నెల రోజుల్లో బెయిల్ కూడా వచ్చేస్తుంది. అయినా.. కోట్లు విలువైన ఆస్తుల్ని టీటీడీకి రాసిచ్చేశాడంటే.. కచ్చితంగా లోపాయికారిగా కొందరు పెద్దలకు డబ్బులు, ఆస్తులు ముట్టజెప్పాడనే ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా రవికుమార్, అతని భార్య రమ్య పేరుపై తిరుపతి పరిధిలో ఉన్న ఐదు ఆస్తుల్ని, చెన్నైలోని రెండు ఆస్తుల్ని టీటీడీకి రాయించేశారు కొందరు పెద్దలు. తిరుపతిలోని మంగళం సమీపంలో ఉన్న పసుపర్తి పనోరమ అపార్ట్‌మెంట్‌లోని 13 ఫ్లాట్స్, పీకే లే అవుట్‌లోని అశోక్ అపార్ట్‌మెంటులో ఓ ఫ్లాట్ టీటీడీకి రిజిస్టర్ చేయించేశారు. ఒకే అపార్ట్‌మెంట్‌లో 14 ఫ్లాట్‌లో కొన్నాడంటే.. రవికుమార్ ఏ స్థాయిలో పరకామణి నుంచి విదేశీ కరెన్సీ నొక్కేశాడో అర్థం చేసుకోవచ్చు. పరకామణిలో చోరీకి పాల్పడిన వ్యక్తికి సంబంధించిన ఆస్తుల్ని.. టీటీడీకి రాయించేశాం కాబట్టి.. అతని మీద కేసులవీ వద్దని.. లోక్ అదాలత్‌లో రాజీ చేశారు. అసలు.. ఓ నిందితుడు విరాళం ఇస్తే అప్పటి టీటీడీ పెద్దలు ఎలా తీసుకున్నారు? శ్రీనివాసుడి పరకామణిలో కొట్టేసిన విదేశీ కరెన్సీతో సంపాదించిన కోట్లు విలువ చేసే ఆస్తుల్ని.. మళ్లీ శ్రీవారికే విరాళం ఇవ్వడమేంటి? ఇవన్నీ కాదు.. పెద్ద జియ్యంగార్ మఠంలో క్లర్క్ స్థాయి ఉద్యోగి.. 40 కోట్లు విలువ చేసే ఆస్తుల్ని టీటీడీకి రాసిచ్చాడంటే.. అతనెలా సంపాదించి ఉంటాడు? ఈ విధంగా వచ్చే విరాళాల్ని ఎవరైనా ఒప్పుకుంటారా? అసలు.. టీటీడీ విజిలెన్స్ అధికారులపై పోలీసులు ఎందుకు ఒత్తిడి తీసుకొచ్చారు? ఈ మొత్తం వ్యవహారాన్ని వెనకుండి నడిపించిందెవరు? ఇప్పుడు ఇవే ప్రశ్నలు.. అన్ని వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయ్. పైగా.. ఇందులో ట్విస్ట్ ఏమిటంటే.. కేవలం కొన్ని ఆస్తుల్ని విరాళంగా ఇప్పించేసి.. రవికుమార్‌కు చెందిన మిగతా ఆస్తుల్ని.. కొందరు పెద్దలు కాజేశారనే ప్రచారం కూడా సాగుతోంది.

## 160,000 టెంట్లు, 150,000 టాయిలెట్లు, 1,250 కిలోమీ పైప్‌లైన్.. మహాకుంభ్‌కు అంతా సిద్ధం



**మహాకుంభ్‌నగర్:** జనవరి 13వ తేదీ నుంచి ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభ మేళా జరగనున్నది. ఈ నేపథ్యంలో యూపీ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. గంగా, యమునా, సరస్వతీ నదీ సంగమ ప్రదేశంలో జరిగే మహాకుంభ్‌కు లక్షల సంఖ్యలో జనం హాజరుకానున్నారు. పుణ్య స్నానాల కోసం వచ్చే భక్తులకు భారీ ఏర్పాట్లు చేశారు. రోడ్లు వెడల్పు చేసి, ఘాట్లను సమం చేసి, నది వద్ద టెంట్లు ఏర్పాటు చేసే అంశంలో కార్మికులు ఓ సైన్యంలా పనిచేస్తున్నారు. ప్రధాని మోదీ మన్‌కీ బాత్ ప్రోగ్రామ్‌లో దీనిపై మాట్లాడారు. ఐకమత్యానికి మహాకుంభ్ అని మోదీ ఆ ఈవెంట్‌ను వర్ణించారు. మహాకుంభ్ నుంచి తిరిగి వెళ్తూ.. ద్వేష, విభజన భావాన్ని వీడాలని సందేశం ఇచ్చారు. మహాకుంభ్ కా సందేశ్.. ఏక్ హెూ పూరా దేశ్ అని మోదీ అన్నారు. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే మహాకుంభ్.. వచ్చే ఏడాది జనవరి 13వ తేదీన పౌశ పున్నమి రోజున ప్రారంభంకానున్నది. ఫిబ్రవరి 26వ తేదీన మహాశివరాత్రితో మహాకుంభ్ ముగుస్తుంది.

ఆ పవిత్ర సమయంలో నదీ స్నానం చేసేందుకు దేశం నలుమూలల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు ప్రయాగ సంగమం వద్దకు చేరుకుంటారు. ఈ ఏడాది మహాకుంభ్ సమయంలో సుమారు 40 కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరిస్తారని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. కోట్లాది మందికి తగిన రీతిలో ఏర్పాటు చేస్తున్నారు. సుమారు లక్షా 60 వేల టెంట్లను ఏర్పాటు చేశారు. సుమారు లక్షా 50 వేల టెయిలెట్లను నిర్మించారు. దాదాపు 15వేల మంది శానిటేసన్ వర్కర్లు పనిచేయనున్నారు. 1250 కిలోమీటర్ల దూరం పైప్‌లైన్ వేశారు. 67 వేల ఎల్ఈడీ లైట్లు, రెండు వేల సోలార్ లైట్లు, మూడు లక్షల వృక్షాలను ఏర్పాటు చేశారు. సులభ స్నానాల కోసం తొమ్మిది పేమ్మెంట్ ఘాట్లు, ఏడు రివర్‌ఫ్రెంట్ రోడ్డు, 12 కిలోమీటర్ల తాత్కాలిక ఘాట్లను నిర్మిస్తున్నారు. ఏడు బస్టాండ్లను నిర్మిస్తున్నారు. ఆ ప్రాంతాన్ని సర్వాంగసుందరంగా తీర్చేందుకు స్ట్రీట్ పెయింటింగ్స్ చేస్తున్నారు. గత కొన్నేళ్ల నుంచి ప్రయాగ్‌రాజ్‌లో నదీ పరివాహక ప్రాంతం తగ్గిపోయింది. సుమారు 3200 ఎకరాల నదీ స్థలం ఆక్రమణకు గురైంది. కానీ ఆ స్థలాన్ని తిరిగి చేజిక్కించుకున్న ప్రభుత్వం దాదాపు 4 వేల హెక్టార్లలో ఏర్పాట్లు చేస్తున్నది. ఆర్థిక లావాదేవీలు స్మూత్‌గా సాగేందుకు అనేక ప్రాంతాల్లో బ్యాంకులు, ఏటీఎంలను ఏర్పాటు చేస్తున్నారు. హెల్త్‌కేర్‌కు అది ప్రాధాన్యత ఇస్తున్నారు. వంద బెడ్లతో సెంట్రల్ ఆస్పత్రిని సెటప్ చేస్తున్నారు. రెండు 20 పడకల సబ్ సెంటర్ ఆస్పత్రులను, 25 ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. 125 అంబులెన్సులు అందుబాటో ఉంటాయి. రాయ్‌బరేలీలోని ఎయిమ్స్ వైద్యులు నిత్యం అందుబాటులో ఉంటారు. మతపరమైన అకాడాలకు కూడా ప్రత్యేక టెంట్లను కేటాయించారు.

# జగన్‌కు క్రెడిబులిటీ లేదు..

-మొదటిపేజీ తరువాయి

ప్రాధాన్యం ఇచ్చామని సీఎం చంద్రబాబు తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తెలుగు గంగా ప్రాజెక్టు చేపట్టిన తర్వాత ఇందిరా గాంధీ సమక్షంలో అగ్రిమెంట్ జరిగిందని గుర్తుచేశారు. గండికోట, సోమశిల విస్తరణ, కండలేరు వంటి ప్రాజెక్టులు ముందుకు తీసుకువెళ్లామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 7 మండలాలు తెలంగాణలో ఉన్న వాటిని ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి చెప్పి వాటిని ఏపీలో విలీనం చేశామని గుర్తుచేశారు. దీనికోసం రాష్ట్రపతితో సంతకం చేశాక పార్లమెంట్ సమావేశంలో బిల్లు పెట్టారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**ఎన్టీఆర్ ముందు చూపు..**

"ఎన్టీఆర్ నీళ్ల విషయంలో ఎంతో ముందు చూపుతో వ్యవహరించారు. వెలుగొండను నేనే ప్రారంభించి పూర్తిచేశా. అనంతపురం తలసరి ఆదాయంలో ముందు వరుసకు వచ్చింది. రాయలసీమకు నీరు వస్తే డెల్టాతో పోటీపడుతుంది. కృష్ణానదిలో పై నుంచి నీరురావడం లేదు, పట్టిసీమ వచ్చాక సరైన సమయంలో పంట వేయగలుగుతున్నాం. గోదావరి, కృష్ణాలో నీళ్లుతగ్గినా గోదావరిలో నీరు వస్తోంది. రాష్ట్రంలో కరవును సమర్థంగా ఎదుర్కొంటే తప్ప అభివృద్ధి సాధ్యం కాదు. 2 టీఎంసీల నీటిని బనకచర్లకు తీసుకువెళ్లేలా చర్యలు తీసుకుంటాం. ఓవరాల్‌గా చూస్తే 50 ఏళ్ల సరాసరిలో 3000 టీఎంసీలు గోదావరి నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయి. ఈసారి నీళ్లు రిజర్వాయర్‌లకు పంపాం. ఈరోజు టోటల్ రిజర్వాయర్ కెపాసిటీతో ఉంది. సమర్థంగా నదులు అనుసంధానం చేసి రిజర్వాయర్‌లు కట్టుకుంటే నీటి సమస్య పరిష్కారమవుతుంది. ఏపీకి కరవు, తుఫాను వల్ల ఇబ్బందులు ఉన్నాయి. వంశధార-నాగావళి-గోదావరి-కృష్ణ వరకూ కలిపే అవకాశం ఉంటుంది. తుంగభద్ర- శ్రీశైలం - నాగార్జునసాగర్ - ప్రకాశం బ్యారేజి, చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ వస్తే నాగార్జున సాగర్ లెఫ్ట్ మెయిన్ కెనాల్ పూర్తి అవుతుంది" అని సీఎం చంద్రబాబు తెలిపారు.

**రిజర్వాయర్ల అనుసంధానం..**

"నాగార్జన సాగర్ నుంచి వెలుగొండ ఆయకట్టును కవర్ చేసి బనకచర్ల నుంచి నల్లమల టన్నల్ ద్వారా నీరు తీసుకెళ్లవచ్చు. దీనికి నదులు, రిజర్వాయర్‌లు అనుసంధానం చేయొచ్చు.ఈ ప్రాజెక్టు వల్ల 80 లక్షల మందికి తాగునీరు, 7.5 లక్షల ఎకరాలు కొత్త ఆయకట్టు వస్తుంది. ఏపీ అంతా అనుసంధానం అవుతుంది. అందుకే ఈ ప్రాజెక్టును తెలుగుతల్లికి జలహారతి అంటున్నాం. గోదావరి నుంచి కృష్ణ నాగార్జున సాగర్ రైట్ మెయిన్ కెనాల్ బోల్లాపల్లి అక్కడి నుంచి బనకచర్ల పోలవరం డ్యాం నుంచి ప్రకాశం బ్యారేజ్ రైట్ మెయిన్ కెనాల్, తాటిపూడి లిఫ్ట్ ఇరిగేషన్ వరుకు తీసుకెళ్తాం. 4వేల నుంచి 10 వేల క్యూసెక్కులు పేరలల్ కెనాల్‌గా ఇస్తాం అది కాస్ట్ ఎఫెక్టివ్‌తో ఉంటుంది. ఇది చేస్తే కృష్ణా తూర్పు, పశ్చిమ డెల్టాలతో అనుసంధానమై 2 టీఎంసీలు తీసుకెళ్లగలుగుతాం" అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

ప్రాజెక్టు గురించి చెబుతూ, రాయలసీమకు నీళ్లు ఇవ్వగలిగితే రతనాల సీమ అవుతుందని అన్నారు. రాయలసీమ జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో తరచుగా కరవు బారినపడుతున్నాయని వివరించారు. పరీవాహక ప్రాంతాల్లోని రాష్ట్రాల నీటి వినియోగం కారణంగా... కృష్ణా నదిలో తగినంత నీటి లభ్యత ఉండడం లేదని వివరించారు. ఒక్క గోదావరి నదిలో మాత్రమే ఆశించిన మేర జలాలు అందుబాటులో ఉంటున్నాయని చంద్రబాబు తెలిపారు. గోదావరి నీటిని మళ్లించగలిగితే రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు నీరు అందించవచ్చని పేర్కొన్నారు. నదులు అనుసంధానం చేయగలిగితే రాష్ట్ర వ్యవసాయ రంగానికి నీటి కొరత అనే మాట వినిపించదని స్పష్టం చేశారు. గోదావరి నుంచి కనీసం 300 టీఎంసీల నీటిని కృష్ణా నదికి తీసుకురావడం... కృష్ణా పశ్చిమ, తూర్పు డెల్టాలకు నీళ్లు ఇచ్చిన తర్వాత ఇక్కడ్నుంచి బనకచర్లకు నీటిని తీసుకువెళ్లడం ఈ ప్రాజెక్టులో ప్రధానమైన అంశం. ఇది మూడు దశల్లో ఉంటుంది. దీనిద్వారా వెలుగొండ ఆయకట్టు కూడా కవర్ అవుతుంది. నాగార్జునసాగర్ కుడి కాలువపై బొల్లాపల్లి ప్రాజెక్టు వస్తుంది... ఆ తర్వాత వెలుగొండ ప్రాజెక్టు... అక్కడ్నుంచి బనకచర్ల ప్రాజెక్టుకు నీళ్లు వెళతాయి. నల్లమల అడవులను కొంతమేర నరికి టన్నెల్ ఏర్పాటు చేసిన బనకచర్లకు నీళ్లు తీసుకువెళతాం. ఇదంతా జరిగితే నదుల అనుసంధానం పూర్తవుతుంది. ఈ నదుల అనుసంధానం ప్రక్రియలో ఇవే కాకుండా మరికొన్ని ప్రాజెక్టులు కూడా ఉన్నాయి.

**జలహారతి ప్రాజెక్టు ఏపీకి గేమ్ చేంజర్..**

"తెలుగు తల్లికి జలహారతి ప్రాజెక్టు రూపకల్పన చేశాం. విజన్ 2047 డాక్యుమెంట్‌లో బాగంగా వాటర్ ప్రాజెక్టు ప్రొవిజన్ ఉంచాం. ఇది దాదాపు ప్రస్తుతానికి రూ.80.112 కోట్లు వ్యయం అవుతుంది. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే రాష్ట్రానికి గేమ్ చేంజర్ లాంటిది. రాష్ట్రానికి సాగునీరు... తాగునీరు.. రాయలసీమ ప్రాంతాలకు పరిశ్రమలకు నీరు అందుతుంది. పవర్ పాయింట్ ద్వారా ప్రాజెక్ట్ గురించి సీఎం చంద్రబాబు వివరించారు. బావి తరాల కోసం ఈ ప్రాజెక్ట్ రూప కల్పన చేశాం. 5 కోట్ల ప్రజలు కూడా ఈ ప్రాజెక్ట్ గురించి ఆలోచించాలి. బనకచర్ల రాయల సీమకు గేట్ వే అవుతుంది... అక్కడి నుంచి అన్ని ప్రాంతాలు కనెక్టు చేయొచ్చు. ప్రతి ఐదేళ్లకు 40శాతం కాస్ట్ ఈ ప్రాజెక్టుకు ఖర్చు అవుతుంది. ఈ ప్రాజెక్టు ఇప్పుడు పూర్తిచేస్తే అనుకున్న ఆదాయం వస్తుంది ఆలస్యం అయితే ఖర్చు పెరుగుతుంది. ఈప్రాజెక్టులో లిఫ్టులు, టన్నల్, గ్రావిటీ ద్వారా నీటిని తరలిస్తాం. 3 టీఎంసీల నీటిని పోలవరం నుంచి తీసుకుని ఒక టీఎంసీల వాడి రెండు టీఎంసీలు రాయలసీమకు పుష్ చేస్తాం. ఈ ప్రాజెక్టు చేయగలిగితే ఇండియాలోనే గొప్ప ఇరిగేషన్ ఇన్‌ఫ్రాస్టక్చర్ వస్తుంది. రాయలసీమతో పాటు అన్నిప్రాంతాలు అభివృద్ధి జరుగుతుంది" అని సీఎం చంద్రబాబు తెలిపారు.

**గోదావరిలో 10శాతం మాత్రమే వినియోగం..**

"సముద్రంలో కలిసే మొత్తం గోదావరిలో 10శాతం నీటిని మాత్రమే తీసుకుంటున్నాం. ఇది చరిత్ర తిరగ రాయబోయే ప్రాజెక్టు అందుకే దీనికి తెలుగుతల్లికి జలహారతి అన్నాం. ఇదిచేయడం ద్వారా రాబోయే తరాలకు నీటి సమస్య లేకుండా చేయొచ్చు. ఆర్థిక మంత్రిను కూడా కలిసి ఇంట్రా లింకింగ్ అని చెప్పాము వారు వర్కవుట్ చేస్తామన్నారు. హైబ్రిడ్ మాడల్‌లో పెట్టుకోవాలి... కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, ప్రైవేటు నుంచి కూడా భాగస్వామ్యం చేస్తే మంచింది. ఈ ప్రాజెక్టును డబ్బులు ఉంటే మూడేళ్లలో పూర్తిచేయొచ్చు. ఇప్పుడు 50శాతం లిఫ్ట్ ఇరిగేషన్లు పనిచేయడం లేదు. రాజస్థాన్‌లో ప్రైవేటు మాడల్‌లో ఇలాంటి ప్రాజెక్టులు చేశారు. నిర్మాణం వాళ్లే చేస్తారు.. ప్రాజెక్టు మన పరిధిలో ఉంటుంది..వారికి డబ్బు చెల్లిస్తాం. దీనిలో కన్స్యూమర్‌పై ఎలాంటి భారం వేయం. అంతిమంగా నీటిని ఎలా వాడుకోవాలో ఇప్పుడు చూస్తున్నాం. నాలుగు వేల మెగావాట్లు మనం వాడితే పంప్ ఎనర్జీ ద్వారా పీక్ టైంలో విద్యుత్ వస్తుంది. విద్యుత్ విషయంలో యూనిట్ కాస్టును తగ్గించే ప్రయత్నం చేస్తున్నాం. లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూములు ఎన్సీఎల్టీకి వెళ్లింది. దేశంలో ఒక్క రాజస్థాన్‌లో మాత్రమే రూ.25వేల కోట్లతో ఇంట్రాలింకింగ్ చేశారు. దేశంలో ఇంత లార్జ్ స్కేల్‌లో ఇంట్రాలింకింగ్ ఎక్కడా లేదు.ఇండియాలోనే రైతులకు అత్యధికంగా అప్పులు ఉన్న రాష్ట్రం ఏపీ. తెలుగు తల్లికి జలహారతి నా జీవితాశయం దాన్ని పూర్తిచేసి రాష్ట్రానికి అంకితం చేస్తున్నాం" అని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

# వైసీపీకి భారీ ఎదురుదెబ్బ




**విశాఖపట్టణం :** ప్రతి ఐదేళ్లకు ఒక సారి సార్వత్రిక ఎన్నికలు. ఈ ఎన్నికలలో అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు, ఇండిపెండెంట్ అభ్యర్థులు గెలవడం, ఓడటం జరుగుతుంది. అయితే 2024 ఎన్నికలలో మాత్రం తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీలు కలసి సీట్లను పంచుకుని అభ్యర్థులను ఎంపిక చేసుకున్నారు. అంతా సమన్వయంతో పనిచేసి నూతన చరిత్రను లిఖించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని జిల్లాలో పూర్తిగా ఓడించారు. వార్ వన్ సైడ్ అన్న రీతిలో జిల్లాలోని ఉన్న పార్లమెంట్ స్థానంతో పాటు 8 అసెంబ్లీ నియోజకవర్గాలను సైతం కూటమి గెలుచుకుని వైసీపీకి కూటమి పార్టీలు గట్టి షాక్ ఇచ్చాయి. రాజకీయంగా శ్రీకాకుళం జిల్లాను అవలోకనం చేసుకుంటే 2024 ఎన్నో మైలురాళ్లు గుర్తుండిపోతాయి.శ్రీకాకుళం జిల్లాలో ప్రధానంగా శ్రీకాకుళం, పాతపట్నం, ఎచ్చెర్ల శాసనసభ నియోజకవర్గాల అభ్యర్థుల ఎంపిక విషయంలో తర్జనభర్జనలు చోటు చేసుకున్నాయి. అధికార వైసీపీ ముందుగానే తమ అభ్యర్థులను ప్రకటించింది. తెలుగుదేశం పార్టీ మాత్రం చివరి వరకూ కొన్ని స్థానాలకి అభ్యర్థులను ప్రకటించకుండా టెన్షన్ పెట్టింది. జనసేన, బిజెపిలతో సీట్లు పంచాయతీ తేలేందుకు సమయం పట్టడంతో 3 పార్టీలలోని ఆశావహులు ఆందోళనకి గురయ్యారు. విడతల వారీగా తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు అభ్యర్థులు ప్రకటించగా మొదటి, రెండవ జాబితాలలో పేర్లు లేని వారు టిక్కెట్ దక్కుతుందో లేదోనని టెన్షన్ కి గురయ్యారు. చివరి వరకూ ఎవరికి వారే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. చంద్రబాబు టిక్కెట్లు ప్రకటించిన తర్వాత కూడా దక్కని వారు నిరసనలకి దిగి వారి పేర్లు ఖరారు చేసుకునేందుకు కూడా యత్నించడం అయోమయానికి గురిచేసింది. ఎవరికి టిక్కెట్ ఖరారవుతుందోనని పార్టీ వర్గాలు, ప్రజలలో కూడా గందరగోళం నెలకొంది. చివరికి కొత్త వారికి అవకాశం ఇస్తూ సీనియర్లను సైతం చంద్రబాబు ప్రక్కన పెట్టిన తీరు ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపిస్తుందన్నంతగా రాజకీయ నాటకాలు సాగాయి. అనూహ్య పరిణామాల మధ్య పలాస నుంచి గౌతు శిరీష, శ్రీకాకుళం నుంచి గొండు శంకర్, పాతపట్నం నుంచి మామిడి గోవిందరావుల పేర్లను తెదేపా అధిష్టానం ఖరారు చేసింది. ఎచ్చెర్ల కోసం అటు కళా ఇటు కలిశెట్టిలు పోటీపడగా సీట్ల పంపకాలలో అదికాస్తా బిజెపీకి కేటాయించడంతో తెలుగుతమ్ముళ్ళు షాక్ కి గురయ్యారు. ఇదే సందర్భంగా ఎచ్చెర్ల శాసనసభ టిక్కెట్ ఆశించిన కలిశెట్టి అప్పలనాయుడును విజయనగరం పార్లమెంట్ స్థానానికి కళా వెంకటరావును చీపురుపల్లి ఎమ్మెల్యే స్థానానికి ఎంపిక చేసి ప్రకటించడం కూడా చర్చణీయాంశమైంది. అలాగే ఎచ్చెర్ల శాసనసభ నియోజకవర్గం నుంచి బిజెపి అభ్యర్థి ఎన్ ఈశ్వరరావు కి టిక్కెట్ ఇచ్చి బరిలో నిలిపారు. ఈ సీట్ల పంచాయతీ చివరి వరకూ సాగడం రాజకీయ వర్గాలలో తర్జనభర్జనలకి గురిచేసింది.కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బిజెపి నాయకులు అంతా ఉన్నత స్థాయి నుంచి దిగువ స్థాయి వరకూ సమన్వయ సమావేశాలు నిర్వహించాయి. అభ్యర్థుల గెలుపుకోసం పనిచేయాలని పార్టీ అధినేతలు అభ్యర్థులకు, నేతలకు దిశా నిర్దేశం చేశారు. అంతా కలసి పనిచేయడంతో కూటమి అభ్యర్థులు అంతా కూడా భారీ మెజార్టీలతో విజయం సాధించారు. శ్రీకాకుళం ఎంపిగా కింజరాపు రామ్మోహన్ నాయుడు హ్యాట్రిక్ విజయం నమోదు చేసుకోగా కింజరాపు అచ్చెన్నాయుడు టెక్కలి నుంచి విజయదుందుభి మోగించి చరిత్ర సృష్టించారు. అలాగే పలాస నుంచి గౌతు శిరీష గెలిచి శివంగి అని నిరూపించుకున్నారు. ఇచ్ఛాపురం నుంచి బెందాళం అశోక్ హ్యాట్రిక్ సాధించి తన సత్తాను మరోసారి చాటుకున్నారు. అలాగే నరసన్నపేట నుంచి బగ్గ రమణమూర్తి రెండవ సారి ఎమ్మెల్యే అయ్యారు. పాతపట్నం, శ్రీకాకుళం, ఎచ్చెర్లల నుంచి తొలిసారి బరిలోకిదిగిన మామిడి గోవిందరావు, గొండు శంకర్, ఎన్.ఈశ్వరరావులు భారీ మెజార్టీలతో గెలిచి రికార్డ్ నెలకొల్పారు. ఆమదాలవలస కోటలో కూన రవికుమార్ మరోసారి పాగా వేసారు. విజయనగరం పార్లమెంట్ స్థానం నుంచి శ్రీకాకుళం జిల్లాకి చెందిన టీడీపీ యువనేత కలిశెట్టి అప్పలనాయుడు భారీ విజయంతో గెలుపొంది చరిత్ర నమోదుచేశారు. ఊహించని విధంగా కూటమి అభ్యర్థులు అంతా భారీ స్థాయిలో మెజార్టీలు సాధించడం ద్వారా సంచలనం సృష్టించారు.శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ సాధించిన కింజరాపు రామ్మోహన్ నాయుడుకి కేంద్ర మంత్రి పదవి దక్కింది. టెక్కలి నుంచి మరోసారి గెలిచిన అచ్చెన్నాయుడుకి రాష్ట్ర మంత్రిగా అవకాశం లభించింది. ఒకే కుటుంబానికి చెందిన బాబాయ్ అబ్బాయ్ లకి అటు కేంద్రంలోను ఇటు రాష్ట్రంలోను మంత్రి పదవులు దక్కడం శుభపరిణామం. ఇక ఇచ్ఛాపురం నుంచి వరుసగా మూడవ సారి గెలిచి రికార్డ్ సృష్టించిన బెందాళం అశోక్ కి శాసనసభ విప్ పదవి దక్కింది. అంతేకాదు కూటమి పార్టీలో అభ్యర్థుల గెలుపుకోసం కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపునిస్తూ నామినేటెడ్ పదవులను కట్టబెట్టారు. కార్పొరేషన్ చైర్మన్లుగా, డైరెక్టర్లుగా పనిచేసే నాయకులకి అవకాశం కల్పించారు.వైసీపీకి 2024లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ ఆవిర్భవించిన తర్వాత జిల్లాలో ఊహించని ఫలితాలను చవిచూసింది. 2014లో ఏజెన్సీ ప్రాంతాలలో ఆ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. వైసీపీ అప్పట్లో అధికారంలోకి రాకపోయినా ప్రతిపక్ష శాసనసభ్యులుగా పార్టీకి చెందిన నేతలు ఉండేవారు. 2019లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 8 స్థానాలలో వైకాపా శాసనసభ్యులు గెలవగా శ్రీకాకుళం పార్లమెంట్ స్థానంతో పాటు రెండు అసెంబ్లీ స్థానాలను టీడీపీ అప్పుడు గెలుచుకుంది. ఈ ఏడాది ఎన్నికలలో మాత్రం వైసీపీ ఒక్కశాసనసభ స్థానంలో కూడా విజయం సాధించలేకపోయింది. ఆ పార్టీ అభ్యర్థులు ఒక్క చోట కూడా విజయం సాధించకపోవడం వారికి గొప్ప షాక్. కూటమి పార్టీ అభ్యర్థుల జోరు ముందు వైకాపా అభ్యర్థులు నిలవలేక ఓటమి చవిచూసారు. ఊహించని ఈ ఫలితాలు వైకాపా శ్రేణులతో పాటు రాజకీయ విశ్లేషకులను సైతంగ్భ్రాంతికి గురిచేశాయి.

## పింఛనులలో స్పౌజ్ విధానం అమలు

-మొదటిపేజీ తరువాయి

పింఛన్లు మంజూరు చేసే ధోరణికి స్వస్తి పలికామని తెలిపారు. ఇప్పటికే పింఛను తీసుకుంటున్న భర్త చనిపోతే వెంటనే భార్యకు ఏ నెలకు ఆ నెలే పింఛను ఇచ్చే విధానాన్ని అమల్లోకి తెచ్చామని చెప్పారు. దీన్నే స్పౌజ్ క్యాటగిరీగా గుర్తిస్తూ పింఛను మంజూరు చేస్తున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గత నెల నవంబర్ 1వ తేదీన శ్రీకాకుళం జిల్లా పర్యటన సందర్భంగా స్పౌజ్ క్యాటగిరీ కింద ఎప్పటికప్పుడు వితంతువులకు పింఛన్లు మంజూరు చేస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. ఈ నెల నుంచి ఇదే విధానంలో పంపిణీ చేస్తున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రకటించారు. అందులో భాగంగా 5,402 మందికి కొత్తగా ఫించన్లు ఇస్తున్నామని తెలిపారు. నవంబరు 1వ తేదీ నుంచి డిసెంబరు 15వ తేదీ వరకు కొత్తగా 5,402 మందికి వితంతువు (ఇప్పటికే పింఛను తీసుకుంటున్న భర్త చనిపోయిన వారికి) కేటగిరీలో పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. వీరికి డిసెంబర్ 31వ తేదీన రూ.4 వేల చొప్పున పింఛను పంపిణీ చేయనున్నామని పేర్కొన్నారు. అలాగే గత మూడు నెలల వ్యవధిలో వివిధ రకాల కారణాలతో పింఛన్లు తీసుకోని 50.94,412 మందికి సైతం బకాయిలతో సహా అందించనున్నామని చెప్పారు. వీరికి రెండు, మూడు నెలల మొత్తాన్ని కలిపి ఒకేసారి డిసెంబర్ 31వ తేదీన పింఛన్లు పంపిణీ చేస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

## పోలీస్ శాఖ అభివృద్ధికి బాటలు వేస్తాం

-మొదటిపేజీ తరువాయి

ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హెూంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. ఇవాళ(సోమవారం) హెూంమంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన ఏపీ సచివాలయంలో సమీక్ష సమావేశం జరిగింది. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్‌తో కలిసి హెూంమంత్రి సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు, నిధుల గురించి ఈ సమావేశంలో చర్చించారు. పోలీస్, అగ్నిమాపక సేవలు, జైళ్లు, విపత్తునిర్వహణ, జిల్లా సైనిక సంక్షేమానికి సంబంధించిన కేంద్ర పథకాల నిధులు రాబట్టడంపైనా మాట్లాడారు. టెక్నాలజీ పెరుగుతూ నేర స్వరూపం మార్చుకుంటున్న నేపథ్యంలో పోలీసులకు తగిన శిక్షణ కేంద్రాల ఏర్పాటుపై సమాలోచనలు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర హెూం శాఖకు చెందిన పార్లమెంటరీ కమిటీలో సభ్యుడిగా ఎంపీ కేశినేని శివనాథ్ ఉన్నారు. పోలీస్, ఫైర్ సర్వీస్, జైళ్లు, డిజాస్టర్ మేనేజ్మెంట్, జిల్లా సైనిక్ వెల్ఫేర్‌కి రావాల్సిన పెండింగ్ నిధులపై చర్చించారు. ఈ సమీక్షకు హెూంశాఖ ప్రత్యేక కార్యదర్శి , ఐజీ విజయకుమార్, 'ఈగల్' చీఫ్ ఆకే రవికృష్ణ, ఎస్పీ ఎస్ఐబీ, గీతాదేవి, జైళ్ల శాఖ అడిషనల్ ఎస్పీ రఘు, డీజీ ఫైర్ మాదిరెడ్డి ప్రతాప్, విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్, రాష్ట్ర సైనిక్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్ బ్రిగేడైర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

## మరో రూ.1,82,162 కోట్ల పెట్టుబడులు

-మొదటిపేజీ తరువాయి

ఇస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాల ద్వారా మరింతగా పెట్టుబడులను ఆకర్షించాలని సూచించారు. సోమవారం సచివాలయంలో జరిగిన ఎస్ఐపీబీ సమావేశంలో రాష్ట్రంలో వివిధ సంస్థలు ఏర్పాటు చేయదలిచిన ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. మొత్తం 9 ప్రాజెక్టులు రాష్ట్రానికి కొత్తగా వస్తున్నాయని, వీటి ద్వారా రూ. 1,82,162 కోట్ల పెట్టుబడులు రావడంతో పాటు రూ. 2,63,411 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలుగుతాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) నెల్లూరు జిల్లా రామయ్యపట్నంలో 6 వేల ఎకరాల్లో రూ. 96,862 కోట్ల పెట్టుబడితో భారీ రిఫైనరీ ఏర్పాటు చేయనుందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. దీంతో 2,400 మందికి ఉపాధి కలుగనుందని చెప్పారు. మొత్తం 9 మిలియన్ మెట్రిక్ టన్నులు సామర్థ్యంతో ఐదు బ్లాకుల్లో రానున్న ఈ ప్రాజెక్టులో టౌన్‌షిప్, లెర్నింగ్ సెంటర్, రిఫైనరీ, పెట్రోకెమికల్స్ యూనిట్స్, క్రూడ్ ఆయిల్ టెర్మినల్, గ్రీన్ హెచ్2, అడ్మినిస్ట్రేషన్ బ్లాకులు నిర్మిస్తారని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వచ్చే 20 ఏళ్లలో ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రానికి రూ. 88,747 కోట్ల ఆదాయం రానుందని తెలిపారు. అయితే 2029లోగా మొత్తం ప్రాజెక్టు పూర్తయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులకు నిర్దేశించారు. విశాఖపట్నంలోని మిలీనియం టవర్స్‌లో 2,08,280 చదరపు అడుగుల విస్తీర్ణంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) రూ. 80 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. దీంతో 2 వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. శ్రీ సత్యసాయి జిల్లా గుడిపల్లిలో ఆజాద్ మొబిలిటీ ఇండియా లిమిటెడ్ 70.71 ఎకరాల్లో మూడు దశల్లో వచ్చే ఆరేళ్లలో పూర్తయ్యేలా ఎలక్ట్రిక్ త్రీ వీలర్ ట్రక్కులు, బస్సులు, బ్యాటరీ ప్యాక్‌ల గ్రీన్ ప్రాజెక్టు ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం ఈ సంస్థ రూ. 1,046 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. 2,381 మందికి ఉపాధి కలుగుతుంది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలోని 106 ఎకరాల్లో రూ.1,174 కోట్లతో 1,500 మందికి ఉపాధి కలిగేలా బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండీఎఫ్/పర్టికల్ బోర్డు ప్లాంట్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ నెలకొల్పనుంది.

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన క్లీన్ ఎనర్జీ పాలసీతో పలు సంస్థలు భారీ పెట్టుబడులతో రాష్ట్రానికి వస్తున్నాయి. కొత్తగా ఐదు సంస్థలు రూ. 83 వేల కోట్ల పెట్టుబడితో వివిధ ప్రాజెక్టులను రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్నాయి. దీంతో కేవలం క్లీన్ ఎనర్జీ రంగంలోనే రెండున్నల లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలుగుతున్నాయి.

## అందుబాటులోకి హై అలెర్ట్ అప్లికేషన్...

**అనంతపురం :** సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి " హై అలెర్ట్ అప్లికేషన్ ను అనంతపురం జిల్లా ఎస్పీ రూపొందించారు. అనంత జిల్లాలో ఎక్కడైనా చోరీలు, దోపిడీ, హత్య, చైన్ స్నాచింగు, కిడ్నాప్, తదితర ఏదైనా అత్యవసర పరిస్థితులలో అదుపు చేయడం కోసం సమాచారం ఈ యాప్ లో పంపితే చాలు. జిల్లాలోని ఉన్నతాధికారులు, సిబ్బందికి సమాచారం క్షణాల్లో చేరుతుంది. దీనిపై స్పందించి వెంటనే సిబ్బంది, అధికారులు శాంతి భద్రతల సమస్య తలెత్తిన ప్రాంతాలకు వెళ్లి పరిస్థితులను సద్దుమణిదేలా చేస్తారు. పోలీసు స్టేషన్ల పరిధుల పట్టింపు లేకుండా అందరూ ఏకకాలంలో అప్రమత్తమై జరిగిన ఘటనను సద్దుమణిగేలా చేస్తారు. అన్ని విభాగాల వారు ఒకేసారి సంసిద్ధులు అయ్యేలా హై అలర్ట్ అప్లికేషన్ రూపొందించారు. అత్యవసర పరిస్థితులు, కొన్ని కీలక సందర్భాలలో జిల్లా ఎస్పీ ఈ యాప్ లో ఒక క్లిక్ చేస్తే చాలు సిబ్బంది సెల్ ఫోన్లలో సైరన్ మోగుతూ ఆదేశాలు వెళ్తాయి. దీంతో జిల్లా పోలీసు సిబ్బంది ఏకకాలంలో అప్రమత్తమై సులువుగా సమస్యలను, కేసులను ఛేదించే అవకాశముంది. ఈ యాప్ ప్రస్తుత పరిస్థితుల్లో జిల్లాలో చాలా ఉపయోగపడుతోంది.అనంతపురం జిల్లాతో పాటు తాడిపత్రి, గుంతకల్లు, గుత్తి తదితర మున్సిపాలిటీ పట్టణంలోని శివారు ప్రదేశాల్లో అసాంఘిక కార్యకలాపాల అడ్డుకట్టు కోసం జిల్లా ఎస్పీ గారు ప్రత్యేకించి డ్రోన్లను రంగంలోకి దింపారు. బహిరంగంగా మద్యం సేవించి న్యూసెన్స్ క్రియేట్ చేసి వారిని, గంజాయి సివించే వారిని, ఈవ్ టీజర్స్ ను డ్రోన్ల ద్వారా పసిగట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా పోలీసులు కృషి చేస్తున్నారు. పోలీసులు వెళ్లలేని పొదలలోకి, అటవీ ప్రాంతంలోకి డ్రోన్లు వెళ్లడం వల్ల ఆయా ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలకు తావు లేకుండా పూర్తిస్థాయిలో అడ్డుకట్టపడునుంది. 17 మంది పిల్లలకు విముక్తి... తల్లిదండ్రులకు అప్పగించి మైనర్లను పనిలో పెట్టుకోవడం చట్ట విరుద్ధమని అలాంటి మైనర్లకు పని చేసే చోటు నుండీ విముక్తి. పోలీసులు, లేబర్, చైల్డ్ ప్రొటెక్షన్ విభాగపు అధికారులు ఆపరేషన్ స్వేచ్ఛ ను ఈ ఏడాది 4 సార్లు నిర్వహించారు. వివిధ పరిశ్రమలు, దుకాణాలలో పని చేస్తున్న 17 మంది మైనర్లకు విముక్తి కల్పించి ఆయా తల్లిదండ్రులకు అప్పగించారు. 2023లో హత్యలు, హత్యాయత్నం, కిడ్నాప్ కేసులు 956 నమోదు కాగా, 2024లో 1051 కేసులు నమోదయ్యాయి. ప్రాపర్టీ క్రైం రికవరీ 51 శాతం కేసుల్లో పూర్తయింది. జిల్లాలో పోక్సో కేసులో ఈ ఏడాది 8 శాతం తగ్గాయి. లోక్ అదాలత్ లలో 10,933 చిన్న కేసులు పరిష్కారం కోసం యత్నించారు. 15 ఔఆఖా కేసులలో 63 మంది అరెస్ట్ అయ్యారు. గ్యాబింగ్, పేకాట కేసులలో రూ. 1,98,37,629 స్వాధీనం చేసుకున్నారు. డయల్ 100/112 కు వచ్చిన కాల్స్ ద్వారా వేల కేసుల్లో ఘటనా స్థలానికి వెళ్లి చర్యలు తీసుకున్నారు. 10,501 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించారు.

## సంపాదకీయం

# మళ్లీ కవ్విస్తున్న చైనా

భారత్ అభివృద్ధి చెందుతున్న విషయాన్ని చైనా జీర్ణించుకోలేకపోతోంది భారత్‌ను ఇబ్బందులు పెట్టే చర్యలకు చైనా సిద్ధమవుతోంది. ఒకవైపు భారత్ సరిహద్దు దేశాలను చంకనెత్తుకొని, రెచ్చ గొడుతూనే.. మరోవైపు, భారత్‌ను పరోక్షంగా ఇబ్బందులు పెట్టే చర్యలు చేస్తోంది. భారత సరిహద్దుకు సమీపంలో బ్రహ్మపుత్ర నదిపై ప్రపంచంలోనే అతి పెద్ద హైడ్రోపవర్ డ్యామ్‌ను నిర్మిస్తోంది. దీనితో, భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలైన అసోం, అరుణాచల్‌ప్రదేశ్‌లు ప్రమాదంలో పడే అవకాశం ఉంది. చైనా వంకర బుద్ధి ఎప్పటికీ మారదేమో అన్నట్లే ఉంది. స్నేహం నటిస్తూనే గోతులు తీయడంలో చైనా చాకచక్యంగా వ్యవహరిస్తోంది. ఇటీవల, భారత్, చైనా బోర్డర్‌లో ఉన్న ఉద్రిక్తతలపై శాంతి ఒప్పందానికి ఓకే చెప్పిన చైనా.. ఆ తర్వాత, తన అసలు రూపాన్ని బయటపెట్టింది. ఇప్పటికే పాకిస్తాన్‌తో సన్నిహిత సంబంధాలను కొనసాగిస్తున్న చైనా.. భారత్‌ను ఇబ్బంది పెట్టే విధంగా పాకిస్తాన్ నడుచుకోడానికి ఉసిగొల్పుతుంది. తాజాగా బంగ్లాదేశ్‌లో నెలకొన్న అంతర్గత సమస్య వెనుక కూడా చైనా కుట్ర దాగి ఉందనీ.. భారత్‌తో ఉన్న సత్సంబంధాలు క్షీణించేలా చైనా పావులు కదిపిందనే ప్రచారం జరుగుతోంది. మాల్దీవుల్ని, శ్రీలంకను కూడా కంట్రోల్ చేసే దిశగా చర్యలు చేపట్టింది.ఒకవైపు భారతదేశం చుట్టూ ఉన్న దేశాలతో వ్యాపార, వాణిజ్య, దౌత్యపరమైన సత్సంబంధాలను కొనసాగిస్తూ ఇబ్బందులు పెట్టే ప్రయత్నం చేస్తూనే.. మరోవైపు యుద్ధం వస్తే భారత్‌ను ఇక్కట్లకు గురి చేసే కీలక నిర్ణయాన్ని చైనా తీసుకుంటోంది. అరుణాచల్ ప్రదేశ్‌కు దగ్గరగా బ్రహ్మపుత్ర నదిపై అతిపెద్ద డ్యామ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ప్రపంచంలోనే అతిపెద్ద జల విద్యుత్తు డ్యామ్‌గా పేరున్న ఈ డ్యామ్.. త్రీ గోర్జెస్ డ్యామ్ కంటే మూడు రెట్లు పెద్దదిగా నిర్మించనుంది. తాజాగా, ఈ డ్యామ్ నిర్మాణానికి చైనా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. టిబెట్ ప్రాంతంలో భారత సరిహద్దుకు సమీపంలో ఈ డ్యామ్ నిర్మించేందుకు చైనా సిద్ధమవుతోంది.టిబెట్ తూర్పు అంచులో ఉన్న యార్లగు జాంగ్బో నది దిగువ భాగంలో ఈ జలాశయాన్ని నిర్మించనున్నట్లు చైనా మీడియాలో కథనాలు వెలువడ్డాయి. 137 బిలియన్ డాలర్ల వ్యయంతో ప్రపంచంలోనే అతిపెద్దన్నా ప్రాజెక్టుగా ఈ డ్యామ్ నిలుస్తుందని పేర్కొంటున్నారు. ఈ ప్రాజెక్టు విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం 300 బిలియన్ కిలోవాట్ అవర్స్ అని.. 2020లో చైనా పవర్ కన్స్ట్రక్షన్ కార్పొరేషన్ అంచనా వేసింది. ప్రస్తుతం చైనాలో ఉన్న అతిపెద్దదైన త్రీ గోర్జెస్ డ్యామ్ సామర్థ్యం 88.2 విలియం కిలోవాట్ అవర్స్. అంటే కొత్త డ్యామ్ సామర్థ్యం దానికి మూడు రెట్లు అధికం. హిమాలయాల్లో పుట్టిన బ్రహ్మపుత్ర నది భారత్‌లోకి ప్రవేశించే ముందు అర్ధచంద్రాకారంలో వంగి ప్రవహిస్తుంది.నది పెద్ద యూటర్న్ తీసుకొని ఆరుణాచల్ ప్రదేశ్, అసోం గుండా బంగ్లాదేశ్‌లోకి ప్రవేశిస్తుంది. యూటర్న్ తీసుకునే ప్రాంతంలో భారీ లోయ దగ్గర ఈ డ్యామ్ నిర్మించాలని చైనా నిర్ణయించింది. 137 బిలియన్ డాలర్ల ఖర్చుతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టు ప్రపంచంలోనే అతి ఖరీదైన, భారీ ప్రాజెక్టుగా నిలుస్తుంది. అలాగే, బ్రహ్మపుత్ర నది అరుణాచల్‌ప్రదేశ్‌లో ప్రవేశించడానికి ముందు సుమారు 3 వేల మీటర్ల దిగువకు ప్రవహిస్తుంది. ఇక్కడ ప్రాజెక్టు నిర్మిస్తే భౌగోళికంగానూ చైనాకు అనుకూలంగా ఉంటుంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ విద్యుత్‌ను ఉత్పత్తి చేసే వీలుండటం వల్ల ఇక్కడే ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని చైనా భావిస్తున్నట్లు తెలుస్తోంది.యార్లాంగ్ జాంబ్బో నదిపై ప్రాజెక్టు నిర్మించాలని అనుకుంటున్న ప్రాంతం ప్రపంచంలోనే అత్యధిక జల విద్యుత్తును ఉత్పత్తి చేయగలిగే అవకాశం ఉన్నవాటిలో ఒకటి అని చైనా పవర్ కన్స్ట్రక్షన్ అంచనా వేసినట్లు తెలుస్తోంది. అయితే, జల విద్యుత్ ఉత్పత్తి కోసం బ్రహ్మపుత్ర నదిలోని సగం నీటిని దారి మళ్లించేందుకు 20 కిలోమీటర్ల పొడవైన సొరంగాలు? నాలుగు నుంచి ఆరు వరకు తవ్వాలని చైనా ప్లాన్ వేస్తోంది. నమ్ చా బార్వా కొండల్లో తవ్వే ఈ సొరంగాలు ద్వారా సెకనుకు 2000 క్యూబిక్ మీటర్ల నీరు ప్రవహిస్తుంది.రక్షణ పరంగానూ భారత్‌కు సమస్యలు పొంచి ఉన్నాయి. ఒకవేళ యుద్ధ పరిస్థితులు తలెత్తితే ప్రాజెక్టులో నిలువ చేసిన నీటిని ఒకేసారి విడుదల చేసి చైనా వాటర్ బాంబుగా ఉపయోగించే ప్రమాదం కూడా ఉందని నిపుణులు అంటున్నారు. అంత ఎత్తు నుంచి నీటిని విడుదల చేస్తే, భారత్‌లో ఈశాన్య ప్రాంతం అల్ల కల్లోలం అవుతుంది. అసోం, అరుణాచల్ వంటి రాష్ట్రాలు పూర్తిగా జల సమాధి అయ్యే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలోనే ఈ ప్రాజెక్టు నిర్మాణంపై ఆందోళన వ్యక్తం అవుతోంది.ప్రధాన నదుల్లో ఒకటైన బ్రహ్మపుత్ర నదిపై భారీ జల విద్యుత్ డ్యామ్ నిర్మాణంపై జిన్‌పింగ్ చాలా కాలంగా ప్లాన్లు గీస్తున్నారు. భారత్‌కు నష్టమని తెలిసినప్పటికీ సూపర్ డ్యామ్ నిర్మాణానికి తయారయ్యారు. గత కొన్నాళ్లుగా ఈ వ్యవహారంలో స్తబ్దుగాఉన్న చైనా ఇప్పుడు ఆ దిశగా చర్యలు వేగవంతం చేసింది. ఈ మేరకు ఆస్ట్రేలియన్ స్ట్రాటజిక్ పాలసీ ఇన్‌స్టిట్యూట్ ఓ నివేదికను విడుదల చేసింది. చైనా ఎత్తుగడలకు సంబంధించిన కీలక అంశాలను ఈ నివేదికలో పొందుపరిచింది. ఈ నిర్మాణంలో సవాళ్లను కూడా ఇందులో పేర్కొన్నారు.బ్రహ్మపుత్ర నదిపై ఇలాంటి భారీ డ్యామ్ నిర్మాణం భూకంపాలకు గురయ్యే టెక్టోనిక్ ప్లేట్ సరిహద్దులో ఉందని తెలుస్తోంది. టిబెటన్ పీఠభూమి టెక్టోనిక్ ప్లేట్‌ల పైన దాని స్థానం కారణంగా తరచుగా భూకంప కార్యకలాపాలకు లోనయ్యే అవకాశం ఉంది. కాబట్టి, ఈ డ్యామ్ నిర్మాణంలో భారీ ఇంజనీరింగ్ ఇబ్బందులను ఎదుర్కునే అవకాశం కనిపిస్తోంది. ఇక, బ్రహ్మపుత్ర టిబెటన్ పీఠభూమి మీదుగా ప్రవహిస్తుంది. భారతదేశంలోకి ప్రవేశించే ముందు 25 వేల 154 అడుగుల అసాధారణ నిలువుగా ప్రపంచంలోని లోతైన లోయలో ప్రవహిస్తుంది.ఇక, 60 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగే ఈ మెగా ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే దిగువ ప్రాంతాలకు నీటికి కొరత ఏర్పడుతుందనే ఆందోళనలు ఉన్నాయి. అంతే కాకుండా వరదలు వంటివి సంభవించినప్పుడు గేట్లు ఎత్తేస్తే దిగువ ప్రాంతాలు కొట్టుకొని పోయే ప్రమాదం కూడా ఉంది. ఇంత ప్రమాదకర పరిస్థితుల్లో కూడా? ఈ ప్రాజెక్టు గురించి ఇప్పటివరకు భారత్‌కి చైనా ఎలాంటి సమాచారం అందించలేదు.ఇక, చైనా అభివృద్ధి పేరుతో చేపట్టిన మొత్తం 60 ప్రాజెక్టులకు సంబంధించిన ప్రతిపాదనల్లో ఇది కూడా ఒకటి. ఇక, అరుణాచల్ ప్రదేశ్‌లో సియాంగ్ నదిగా పేర్కొనే బ్రహ్మపుత్రా నదిని సజీవంగా ఉంచాలనే డిమాండ్ అరుణాచల్ ప్రభుత్వం ఎప్పటి నుండో చేస్తోంది.చైనా ఈ నది ప్రవాహాన్ని మళ్లిస్తే, సియాంగ్ సైజు తగ్గిపోతుందనీ.. పెద్ద మొత్తంలో విడుదలయ్యే వరద నీటికి సియాంగ్ లోయ తీవ్రంగా ప్రభావితం కానుందనే ఆందోళనలు పెరుగుతున్నాయి. ఇక, అస్సాం, బంగ్లాదేశ్ కూడా వరదల్లో చిక్కుకునే ప్రమాదం ఉంద గనుక.. ఈ ప్రాంతాల్లో భారీ వరదలు సంభవిస్తాయి. అందుకే, అధిక నీటి విడుదలను అడ్డుకోడానికి భారత్ పెద్ద పెద్ద నిర్మాణాలు కూడా చేయాల్సిన అవసరం వస్తోంది, అలాగే, ఎగువ ప్రాంతంలో ఉన్న చైనా, డ్యామ్ నిర్మాణంలో ఏకపక్షంగా వ్యవహరిస్తోంది కాబట్టి?. అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా దూకుడు అడ్డుకట్ట వేయడానికి భారత్ కూడా సాంకేతిక, వనరుల విషయంలో తన సామర్థ్యాన్ని పెంచుకునే ప్రయత్నాలు చేస్తోంది.

# అవును నాగలి కూడా కవిత్వాయుధమే!

కొమ్మవరపు విల్సన్‌రావు రాసిన 'నాగలి కూడా ఆయుధమే' కవిత్వ సంపుటి కోసం రాసి న ముందుమాటలో ఆచార్య కొలకలూరి ఇనాక్ 'కవి తనను తాను గుర్తెరగడమే కవిత్వం' అంటా రు. తనను తాను ప్రేమించుకోలేని వాడు ఎదుటివాళ్లను ప్రేమించలేడన్నట్టు.. కవి అన్నవాడు ఎల్లప్పుడూ ఉంటూ సామాజిక మార్పులను, స్థితిగతులను పరిశీలిస్తూ, అందులో జరిగే సంఘటనలను తన కవిత్వంలో ప్రతిబింబిస్తూ పాఠకులను ఆలోచింపజేయాలి. అలాంటి కవిత్వం రాయాలంటే సదరు కవి ఎంతో నిబద్ధతకలవాడై ఉండాలి. సరిగ్గా అలాంటి నిబద్ధత కలిగి కవిత్వాన్ని శ్వాసిస్తూ కవిత్వమే జీవితంగా %జశీఎఎ్‌ఎవత్%తో జీవిస్తున్న కొద్దిమంది సహృదయ తెలుగు కవుల్లో విల్సన్‌రావు ఒకరని 'న్యాయనిర్ణేతవూ నీవే' నుంచి 'దేవుడు తప్పిపోయాడు', 'నాగలి కూడా ఆయుధమే' వరకు ఆయన కవిత్వాన్ని పరిశీలిస్తే అర్థమవుతుంది. 'నాగలి కూడా ఆయుధమే' కవితల్లోకి వెళ్తే ఒక్కో కవిత ఒక్కో అనుభూతిని పాఠకుని స్థాయిని బట్టి అందిస్తున్నదని చెప్పవచ్చు. ఈ సంపుటిలో కవితలన్నీ దేనికదే అచ్చుపోసినట్టు, ఎక్కడ కూడా అవసరం లేని పదాలను వాడినట్టు అనిపించదు. చిన్న చిన్న కవితల్లోనూ విశ్వజనీన



విషయాలను అలవోకగా కవిత్వం చేశారు రచయిత విల్సన్. కవిత్వం అంటే ఏమిటి? కవిత్వం ఎలా ఉండాలి? కవిత్వమనే సృజన కళ గురించి ఇతర కవులు తమ కవిత్వాన్ని పదును పెట్టుకోవటానికి అవసరమైన కవితా సామగ్రిని తన కవిత్వం ద్వారా అందిస్తారు. కవుల కవిత్వం కష్టజీవుల చెక్కిళ్లమీంచి జారే కన్నీళ్లను తుడిచి నవ్వుల పరిమళం అద్దుతూ సాంత్వన ఇవ్వాలంటూ.. జీవితం పట్ల భరో సానిచ్చే కవిత్వం ఎలా ఉండాలో డిఫైన్ చేస్తాడు. ఇద్దరు కలిసి కలబోసుకున్న కవి సమయాల్ని ఈ కవితలో ఇలా తలపోస్తాడు. 'ఈ నడిరాతిరి నక్షత్ర జలపాత హోరులో/ నువ్వు నా కళ్లముందు రూపు కడుతున్నట్లు/ నాలో స్వచ్ఛ కన్నీటి చెమ్మకోసం/ నువ్వు ఎదురుచూస్తున్నట్లు కలకంటున్నాను' అం టూ.. తన జీవితానికి ఎంతో భరోసానిచ్చి, అతిసున్నితంగా గుండెతడిని తడిమి ధిక్కార వ్యాకరణమైన సైదూ కవితా జలపాతాల్లో మునిగితేలుతూ తమ స్నేహతత్వాన్ని అజరామరం చేసే కవితనొక్కటి రాస్తానని ఆ జ్ఞాపకాల్ని నెమరేసుకుంటాడు.

ఇంత విలక్షణమైన కవిత్వనాగలితో సాహితీ సేద్యం చేస్తూ కవిత్వప్రియుల హృదయాల్లో నిలిచిపోయే కవిత్వాన్ని రాస్తున్న విల్సన్‌రావు ఇంకా తన కవిత్వ సృజనకు పదును పెడుతూ, అద్భుతమైన కవిత్వ సంపుటాలను వెలువరించాలి.


## 2025: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల తేదీలు ఖరారు

# ఆ పార్టీల మధ్యనే పోటీ

**న్యూఢిల్లీ :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు దాదాపు పూర్తి చేసింది ఉన్నతాధికారులతో ఇప్పటికే సమావేశాలు నిర్వహించిన ఈసీ అధికారులు, జనవరి మొదటి వారంలో షెడ్యూల్ విడుదల చేసేందుకు సమాయత్తమవుతున్నారు. 2025 ఫిబ్రవరి 15తో ప్రస్తుత అసెంబ్లీ ఢిల్లీ 7వ అసెంబ్లీ, గడువు ముగుస్తోంది. ఈలోగా ఎన్నికలు ప్రక్రియను పూర్తిచేయాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల సంఘంపై ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల 2020, సమయంలో జనవరి 14న నోటిఫికేషన్ జారీ అవ్వగా, ఫిబ్రవరి 8న పోలింగ్ జరిగింది. ఫిబ్రవరి 11న ఓట్ల లెక్కింపు జరిగింది. ఈసారి కూడా కాస్త అటూ ఇటుగా తేదీలు ఖరారయ్యే అవకాశం కనిపిస్తోంది. ఎన్నికల నిర్వహణలో విద్యాశాఖ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు. కాబట్టి ఈ ఏడాది జరగబోయే సెంట్రల్ బోర్డ్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ సిబి ఎస్ సి, పరీక్షల తేదీలతో ఎన్నికల తేదీలకు ఇబ్బంది కలుగకుండా కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది.

దళిత, మైనారిటీ వర్గాల్లో కోల్పోయిన పట్టును మళ్లీ సాధిస్తూ తమ ఓటు బ్యాంకును మెరుగు పరుచుకుంటున్న కాంగ్రెస్ పార్టీ, ఈ సారి ఎలాగైనా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి తీరాలన్న పట్టుదలతో ఉంది. ఇప్పటికే పొరుగునే ఉన్న హర్యానాలో గెలుపు వాకిట తడబడి ఓడిన కాంగ్రెస్ పార్టీ, ఢిల్లీ విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఆప్ ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధిస్తోంది. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ సాధించిన 53.57 శాతం ఓట్లు సాధించి 70 అసెంబ్లీ స్థానాల్లో 62 గెలుపొందగా, 38.51 శాతం ఓట్లు సాధించిన బీజేపీ 8 సీట్లలో విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ కేవలం 4.26 శాతానికే పరిమితమైంది.

పదేళ్ల పాలనపై సహజంగా ఏర్పడే వ్యతిరేకతకు తోడు ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం, శీష్ మహల్‌గా పేరొందిన విలాస నివాస భవనం సహా 2020 ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలను అమలు చేయలేకపోవడం వంటివి



కేజ్రీవాల్‌కు ప్రతికూలాంశాలుగా మారాయి. ఈ ప్రతికూలతలు కేజ్రీవాల్ గతంలో సాధించిన 53 శాతం ఓట్లలో కోత విధిస్తాయని రాజకీయ పండితులు అభిప్రాయపడుతున్నారు. అయితే అవి ఎటువైపు మళ్లుతాయి అన్నదే ఇక్కడ అసలు ప్రశ్న. ఒకవేళ నేరుగా బీజేపీకి బదిలీ అయితే ఆ పార్టీ విశేషంగా లాభపడుతుంది. అలాకాకుండా కాంగ్రెస్ వైపు మళ్లినా సరే.. పరోక్షంగా బీజేపీకే వరంగా మారుతుంది. తాజా లోక్‌సభ ఎన్నికల తర్వాత ముస్లిం మైనారిటీలు, దళిత ఓట్లలో మళ్లీ కొంతమేర పట్టు సాధించిన కాంగ్రెస్ పార్టీ, ఈ వర్గాలను కేజ్రీవాల్‌కు దూరం చేసినా సరే. కమలదళానికే ఉపయోగం ఎక్కువ. కాంగ్రెస్ పెంచుకునే ఓట్లశాతం ఆ పార్టీని గెలిపించకపోయినా.. దశాబ్దకాలం తర్వాత ఖాతా తెరిచేందుకు ఉపయోగపడుతుంది. అదే సమయంలో ఆమ్ ఆద్మీ పార్టీని బలహీనపరిచి, బీజేపీకి పరోక్ష ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉంది.

మరోవైపు అవినీతి వ్యతిరేక ఉద్యమంలో పురుడు పోసుకున్న ఆమ్ ఆద్మీ పార్టీ ఇతర రాజకీయ పార్టీలకు భిన్నమేమీ కాదని, అనేక రకాల అవినీతి, అక్రమాలకు తెరలేపిందని కమలదళం ప్రజాకోర్టులో బురదజల్లింది. ఇది తనపై సాగుతున్న కక్షసాధింపు రాజకీయమని, ప్రజాకోర్టులోనే తీర్పు అడుగుతానని సీఎం పదవిని వదులుకుని ఎన్నికల ప్రచారం చేపట్టిన కేజ్రీవాల్, కేసులు, అరెస్టు, జైలుపాలవడాన్ని సానుభూతి పవనాలుగా మలచుకునే ప్రయత్నం చేస్తున్నారు. గత ఎన్నికల్లో సాధించిన ఓట్లశాతాన్ని సమీప ప్రత్యర్థి బీజేపీతో పోల్చుకుంటే 15 శాతం తేడా ఉంది. ఇందులో ప్రతికూలతల కారణంగా కొంత మేర ఓట్లు తగ్గినా. ఈ భారీ వ్యత్యాసాన్ని పూడ్చలేవని, సీట్లు కొన్ని తగ్గినా విజయం తమదేనన్న ధీమాలో ఆమ్ ఆద్మీ పార్టీ ఉంది.

# గులాబీని హరీష్ రావే లీడ్ చేస్తారా

**మెదక్ :** ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఈ ఏడాది మార్చి నుంచి ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఆగస్టు నెలలో తీహార్ జైలు నుంచి విడుదలయ్యారు. జైలు నుంచి విడుదలైన తర్వాత కవిత.. ఇంటికే పరిమితమయ్యారు. అయితే కొద్దిరోజులుగా కవిత మళ్లీ రాజకీయం క్షేత్రంలోకి పునరాగమనం చేశారు. జాగృతితో పాటు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు.అధికారం కోల్పోయిన తర్వాత చోటు చేసుకుంటున్న పరిణామాలతో బీఆర్ఎస్ సతమతవుతూ వస్తోంది. ఓవైపు కీలక నేతలపై కేసులు తెరపైకి వస్తున్నాయి. తాజాగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై ఏసీబీ, ఈడీ కేసులు నమోదయ్యాయి. ఫార్ములా ఈరేస్ కేసలో అక్రమాలు చోటు చేసుకున్నాయని? ఇందులో కేటీఆర్ పాత్ర ఉందంటూ ఎఫ్ఐఆర్ రికార్డైంది. ఈ కేసులో దర్యాప్తు సంస్థలు? కేటీఆర్ ను ఏ1గా పేర్కొన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కవిత రీఎంట్రీ? బీఆర్ఎస్ లో కీలకంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఫార్ములా ఈరేస్ కేసులో జనవరి 7వ తేదీన విచారణకు రావాలని కేటీఆర్ కు ఈడీ నోటీసులు జారీ చేసింది. కేటీఆర్ తో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, హెచ్ ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ ఎన్ రెడ్డిలను జనవరి 2, 3 తేదీల్లో హాజరుకావాలని సమన్లు జారీ చేసింది. రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద ఈడీ అధికారులు దర్యాప్తు ప్రారంభించిన సంగతి తెలిసిందేబీఆర్ఎస్ పార్టీని వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో కేటీఆర్ నడిపిస్తున్నారు. అన్ని కార్యక్రమాల్లో ఆయనే కీలకంగా ఉంటూ వస్తున్నారు. ఏడాది కాలంగా రేవంత్ పాలనపై పోరాడుతున్నారు. అయితే ఫార్ములా ఈరేస్ కేసులో కేటీఆర్ ను ఏసీబీ లేదా ఈడీ అరెస్ట్ చేస్తే.. పార్టీని ఎవరు లీడ్ చేస్తారనే చర్చ అప్పుడే మొదలైంది. ఈ క్రమంలోనే ఎమ్మెల్సీ కవిత పేరు తెరపైకి వస్తోంది. పార్టీ పగ్గాలను కవిత చేపడుతారనే టాక్ వినిపిస్తోందిఇక బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్ కు పరిమితమయ్యారు. ఏడాది కాలంగా కేటీఆర్, హరీశ్ రావులు పార్టీ కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ ముందుకు తీసుకెళ్తున్నారు. మూసీ సుందరీకరణ, హైడ్రా కూల్చివేతలు, లగచర్ల ఘటన, రైతుబంధు, దళితబంధు వంటి అంశాలపై ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో పోరాడుతూ వచ్చారు. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ రేవంత్ సర్కార్ ను తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలను సంధిస్తున్నారు.ఫార్ములా ఈరేస్ కేసులో కేటీఆర్ అరెస్ట్ వంటి పరిణామాలు చోటు చేసుకుంటే? పార్టీని హరీశ్ రావు లీడ్ చేసే అవకాశం ఉంటుంది. అయితే హరీశ్ రావుకు బాధ్యతలు ఇస్తారా?? లేదా..? అన్న విషయంలో కేసీఆర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ హరీశ్ రావు పార్టీ కార్యక్రమాలను పర్యవేక్షిస్తే? పార్టీపై పూర్తిస్థాయిలో పట్టు సాధించే అవకాశం లేకపోలేదు.ఈ ఏడాది ఆగస్టులో జైలు నుంచి విడుదలైన కవిత చాలా రోజులుగా ఇంటికే పరిమితమయ్యారు. కానీ కొద్దిరోజులుగా పొలిటికల్ గా మళ్లీ యాక్టివ్ అయ్యారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. రేవంత్ సర్కార్ పై ప్రశ్నలు గుప్పిస్తున్నారు. ఇటీవలే జరిగిన శాసన మండలి సమావేశాల్లో కూడా పార్టీ తరపున కీలకంగా వ్యవహరించారు. ఓ రకంగా పార్టీలో కవిత క్రియాశీలకంగా మారారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.గత నెల రోజులుగా కవిత పలు వేదికలపై కనిపిస్తున్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ల కోటా ఖరారుపై చర్చించాలని నవంబర్ 23న ప్రత్యేక కమిషన్ ను కోరారు. బీసీ కుల గణనలో తీసుకోవాల్సిన చర్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక సంస్థల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు దక్కేలా, విద్య, ఉద్యోగాల్లో బీసీల రిజర్వేషన్లు పెంచేలా సిఫార్సులు చేయాలని కవిత విన్నవించారు. రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రంలో బీసీలు బలమైన సామాజికవర్గాలుగా ఉన్నారు. బీసీల సమస్యలపై పోరాటం ద్వారా? ఆయా వర్గాలతో జతకట్టవచ్చనే భావన కవితలో ఉన్నట్లు పలువురు విశ్లేషకులు చెబుతున్నారు. సుమారు 40 ఓబీసీ సంఘాలతో కవిత సమావేశమయ్యారు. ఇందులో ప్రసంగించిన కవిత? బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై తీర్మానం చేసే వరకు స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా జనవరి 3న ఇందిరాపార్కు వద్ద బీసీ సంఘాల నుంచి మద్దతు కూడగట్టేందుకు సభ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. తెలంగాణ తల్లి విగ్రహం మార్పు విషయంలో కూడా రేవంత్ సర్కార్ పై కవిత విమర్శలు గుప్పించారు. డిసెంబర్ 16వ తేదీన తెలంగాణతల్లి విగ్రహానికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను ధిక్కరిస్తూ? జగిత్యాల పట్టణంలో విగ్రహ ఏర్పా టుకు శంకుస్థాపన చేశారు. ఈ సం దర్భంగా ఆమె చేసిన ప్రసంగంలో? తెలంగాణ సాంస్కృతిక అస్తిత్వంతో తనకున్న అనుబంధాన్ని, రాష్ట్ర ఆత్మగౌరవ చిహ్నాల ను పరిరక్షించడంలో తన నిబద్ధతను నొక్కి చెప్పారు.కవిత పునరాగమనంపై పార్టీలోనూ, రాష్ట్ర రాజకీయవర్గాల్లోనూ కీలక చర్చ జరుగుతోంది. పార్టీని బలపేతం చేయటంలో కీలకంగా ఉండటంతో పాటు రాష్ట్రవ్యాప్తంగానూ తన పలుకుబడిని పునరుద్ధరించే యోచనలో కవిత ఉన్నట్లు ఆమె సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.న్యాయపరమైన చిక్కుల మధ్య కేటీఆర్ రాజకీయ భవిష్యత్తుపై కాస్త అనిశ్చితి నెలకొనే అవకాశం లేకపోలేదు. ఇదే టైంలో పార్టీలో కవిత పాత్ర కీలకంగా మారే అవకాశం ఉంది. కవిత పునరాగమనం? .పార్టీ బలోపేతంతో పాటు పునర్నిర్మాణ ప్రయత్నాలకు తోడ్పా డుటునిస్తుందని ఓ బీఆర్ఎస్ ముఖ్య నేత చెప్పుకొచ్చారుకవిత రాకతో పార్టీకి పెద్దగా ఒరిగేదేమీ ఉండదని టాక్. మద్యం కేసులో ఆమెను అరెస్టు చేసినప్పుడు చెప్పుకోదగ్గ స్పందనలు ఏమీ లేవని గుర్తు చేశారు. సోదరి, సోదరుడిపై అవినీతి ఆరోపణలు ఉధృతం చేయడం ద్వారా బీఆర్ఎస్ పార్టీపై రేవంత్ టీమ్ నిప్పులు చెరగడం ఖాయమని అభిప్రాయపడ్డారు.

# కేంద్ర హెూం మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలి







**గుంతకల్లు డిసెంబర్ 30 ప్రజా జ్యోతి ప్రతినిధి (ఆనందరాజు):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురించి రాజ్యసభలో అనుచిత వక్కలు చేసిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని గుంతకల్లు పట్టణం నందు సిపిఎం, సిపిఐ, సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ.. పార్టీల ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డు గాంధీ విగ్రహం దగ్గర నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలపడం జరిగింది. ఈ నిరసన కార్యక్రమానికి సిపిఎం పార్టీ పట్టణ కార్యవర్గ సభ్యులు జగ్గిలి రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు జిలాన్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపకర్త, నిర్మాత, ప్రపంచ మేధావి.. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురించి రాజ్యసభలో అవమానకర మైన,అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి. బేశరత్తుగా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని దేశ ప్రజలంతా మతోన్మాదా న్ని వ్యతిరేకించాలి,మన రాజ్యాంగాన్ని కాపాడుకోవాల న్నారు. ఇప్పటికైనా అమిత్ షా దేశ ప్రజలకు బేశరత్తుగా క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని లేని పక్షంలో వామపక్ష పార్టీలు, మరియు ప్రజా సంఘాలు, దళిత,గిరిజన,బీసీ,మైనార్టీ, సంఘాలు ప్రజలతో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు సాకె నాగరాజు, కసాపురం రమేష్, రంగమ్మ, సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి గోపీనాథ్, మహేష్, మండల కార్యదర్శి రాయల్ రాము, గౌస్, రామాంజనేయులు, సురేష్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు జిలాన్, మహబూబ్ బాషా, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు జ్యోతి, జాకీర్, ఓబులేసు,షాష,సూరి, లక్ష్మీబాయి, ఖాదర్, ఈరన్న, ఐద్వా మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# హాస్పిటల్లో పనిచేసే శానిటేషన్ కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్న వైద్య అధికారుల పై,కాంట్రాక్టర్ల పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కి ఏఐటీయూసీ వినతి



**అనంతపురం డిసెంబర్ 30 ప్రజా జ్యోతి ప్రతినిధి (ఆనందరాజు):** అనంతపురం నగరంలోని ప్రభుత్వ హాస్పిటల్లో మెడికల్ కళాశాలలో, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో పనిచేసే శానిటేషన్ వర్కర్లకు,సెక్యూరిటీ గార్డులకు పెండింగ్లో ఉన్న ఐదు నెలల వేతనాలు ఇవ్వాలని,కార్మికుల జీవితాలతో చెలగాటమాడు తున్న కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, పిఎఫ్,ఈఎస్ఐ కార్మికులకు చెల్లించాలని,కార్మికులకు పని ఒత్తిడి తగ్గించాలని,జీవో నెంబర్ 549 ప్రకారం కనీస వేతనం 16000 ఇవ్వాలని, కార్మికుల జీతాలపై నిర్లక్ష్యం వహిస్తున్నటువంటి వైద్య అధికారులపై, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని గ్రీవెన్స్ లోని జాయింట్ కలెక్టర్ కి ఏఐటీయూసీ నగర అధ్యక్షులు జి.చిరంజీవి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శులు వికె కృష్ణుడు,ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి వెంకటేష్,జిల్లా నాయకులు భార్గవి,రామాంజనేయులు తదితరులు పాల్గొనడం జరిగింది.

# పోటా పోటీగా టిడిపి పార్టీ సభ్యత్వ నమోదు





**మెలియాపుట్టి ప్రజా జ్యోతి డిసెంబర్ 30:** పాతపట్నం శాసనసభ్యులు మామిడి గోవిందరావు ఆదేశాల మేరకు మెలియాపుట్టి మండలం పట్టుపురం , పాత మారేడు కోట, శేఖరాపురం, పూలసారి, దబ్బగూడ, నడసంద్ర గ్రామంలో గత రెండు రోజులుగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ సలాన మోహనరావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పట్టుపురం ఎంపీటీసీ ప్రతినిధి నంబాల వెంకటరావు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జోరుగా నిర్వహిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ అనుసరిస్తున్న విధానాలకు ఆకర్షితులై అధిక సంఖ్యలో స్వచ్ఛందంగా ప్రజలు తరలివచ్చి సభ్యత్వం నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ" సలాన" మాట్లాడుతూ ప్రజా సంక్షేమం , పేదల అభ్యున్నతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం ఎంపీటీసీ ప్రతినిధి వెంకటరావు మాట్లాడుతూ బడుగు , బలహీన వర్గాలతో పాటు దిగువ , మధ్య తరగతి కుటుంబాలలో ఉన్న వారికి అండగా ఉండేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. సభ్యత్వం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాన్ని వివరించారు. ఈ రెండు రోజులు చేపట్టిన సభ్యత్వ నమోదు లో ఎక్కువ మంది సభ్యత్వం నమోదు చేయించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాధితులను ఆదుకుంటాం

రజాక్ దాతృత్వం అభినందనీయం

ఎమ్మెల్యే గొండు శంకర్

ఫాతిమా బేగం కుటుంబానికి రూ. 10,000 అందజేత



**శ్రీకాకుళం ప్రజా జ్యోతి డిసెంబర్ 30:** అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన ఫాతిమా బేగం కుటుంబ సభ్యులను అన్ని విధాలా ఆదుకుంటామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రజాక్ కుటుంబ సభ్యులు అందజేసిన పదివేల రూపాయలు నగదును ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపికి రజాక్ లాంటి కార్యకర్తలు ఉండడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. ప్రజలకు కష్టం వస్తే పార్టీ తరపున సాయం చేసేందుకు ముందుకు వచ్చిన రజక్ ను ప్రశంసించారు. పార్టీ పట్ల అంకిత భావం, చిత్తశుద్ధితో పనిచేసే వారికి ఉన్నత పదవులు లభిస్తాయని ఈ సందర్భంగా తెలిపారు. సర్వం కోల్పోయి కట్టుబట్టలతో రోడ్డు మీద పడిన ఫాతిమా కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు టిడిపి నాయకులు, కార్యకర్తలు ముందుకు రావాలని ఆయన పిలిచారు. ఈ కార్యక్రమంలో రజాక్ కుటుంబ సభ్యులు ఎండి రఫీ, టిడిపి మైనార్టీ నాయకులు షేక్ నిజాముద్దీన్, బహుదూర్ భాష, మహమ్మద్ రఫీ, రెడ్డి గిరిజ శంకర్, ఎండు చిన్నారావు పంచిరెడ్డి అప్పలనాయుడు, ముద్దాడ రామకృష్ణ తదితరుల

## ఎస్సీ కులగణన జాబితాలోని లోపాలను సవరించాలి..

పాతపట్నం మండల తహసీల్దార్ కి వినతిపత్రం సమర్పిస్తున్న మాలమహానాడు-నాయకులు..



**పాతపట్నం డిసెంబర్30,ప్రజా జ్యోతి న్యూస్..** ఎస్సీ వర్గీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జాబితాలోని వివరాలు పాతపట్నం మండలంలోని ప్రతి గ్రామములో తప్పులుతడకలుగా ఉన్నాయని తెలియజేస్తూ జాబితాలోని లోపాలను సవరించి, కులగణన వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించాలని పాతపట్నం మండల తహసీల్దార్ కి మాలమహానాడు-పాతపట్నం పక్షాన కోరడమైనది. 3ఈ కార్యక్రమంలో పాతపట్నంమాల మహానాడుసభ్యులు తొగిరి లక్ష్మి నారాయణ (అద్యక్షులు), నవగాన రత్నకుమార్ (ప్రధాన కార్యదర్శి), శిర్ల ప్రభాకరరావు ( అధ్యక్షులు), యజ్జల భాస్కరరావు (సలహాదారులు) తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు..

## చిత్రలేఖన ప్రదర్శనలో ఆదర్శ ఉపాధ్యాయుని ప్రతిభ.



**పాతపట్నం డిసెంబర్30, ప్రజా జ్యోతి న్యూస్ ..** స్థానిక ఆదర్శ పాఠశాల పాతపట్నం లో వృక్షశాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న అప్పలరాజు బల్లెడ నిన్న శ్రీకాకుళం శిశు వైద్య బృందం అలాగే జిల్లా పోలీస్ శాఖ నిర్వహించిన మహా సంకల్పం అనే కార్యక్రమంలో జరిగిన ఆర్ట్ ఎగ్జిబిషన్లో అప్పలరాజు ప్రదర్శించిన మహిళలపై జరుగుతున్న దాడులను ఖండించే అంశం కు రెండవ స్థానం లభించింది. బహుమతిగా 3000 రూపాయల చెక్కు, ప్రశంసా పత్రము,బంగారు పథకం శ్రీకాకుళం వైద్య బృందం చేతుల మీదుగా అందుకున్నారు. అయితే ఆయనకు వచ్చిన 3 వేల రూపాయల నగదు బహుమతిని తిరిగి అదే సంస్థకు విరాళంగా అందజేసి పలువురు ప్రశంసలు పొందారు. తమ పాఠశాల ఉపాధ్యాయుడు పొందిన విజయం పట్ల ప్రిన్సిపల్ రత్నకుమారి, ఇతర ఉపాధ్యాయులు,ఉపాధ్యాయ ఇతర సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

## వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ర్యాలీ

అమిత్ షా బేశరత్తుగా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి




**గుంతకల్ టౌన్ ప్రజా జ్యోతి:** ఈరోజు గుంతకల్లు పట్టణం నందు సిపిఎం, సిపిఐ, సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ.. పార్టీల ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డు గాంధీ విగ్రహం దగ్గర నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలపడం జరిగింది ఈ నిరసన కార్యక్రమానికి సిపిఎం పార్టీ పట్టణ కార్యవర్గ సభ్యులు జగ్గిలి రమేష్ అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు జిలాన్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపకర్త, నిర్మాత, ప్రపంచ మేధావి.. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురించి రాజ్యసభలో అవమానకరమైన, అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి. బేశరత్తుగా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని దేశ ప్రజలంతా మతోన్మాదాన్ని వ్యతిరేకించాలి, మన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నారు.. ఇప్పటికైనా అమిత్ షా దేశ ప్రజలకు బేశరత్తుగా క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని లేని పక్షంలో వామపక్ష పార్టీలు, మరియు ప్రజా సంఘాలు, దళిత, గిరిజన, బీసీ, మైనార్టీ, సంఘాలు ప్రజలతో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు.. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు సాకె నాగరాజు, కసాపురం రమేష్, రంగమ్మ, సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి గోపీనాథ్, మహేష్, మండల కార్యదర్శి రాయల్ రాము, గౌస్, రామాంజనేయులు, సురేష్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు జిలాన్, మహబూబ్ బాషా, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు జ్యోతి, జాకీర్, ఓబులేసు,షాష,సూరి, లక్ష్మీబాయి, ఖాదర్, ఈరన్న, ఐద్వా మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన



**పాతపట్నం డిసెంబర్30, ప్రజా జ్యోతి న్యూస్** స్థానిక ఆదర్శ పాఠశాల పాతపట్నంలో మండల విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో మండలంలోని సుమారు 13 ప్రభుత్వ పాఠశాలల నుండి 30 సైన్స్ ప్రాజెక్ట్ లు ప్రదర్శనలో పాల్గొన్నాయి. ఇందులో మూడు విభాగాలు అనగా విద్యార్థి వ్యక్తిగత, విద్యార్థి సమూహ అలాగే ఉపాధ్యాయ వ్యక్తిగత ప్రాజెక్టుల ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమానికి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రత్న కుమారి అధ్యక్షత వహించారు. జిల్లాస్థాయి సైన్స్ అధికారి కుమారు స్వామి జ్యూరీగా వ్యవహరించారు

# కూటమి తోనే సమగ్రాభివృద్ధి

**ప్రతీ ఒక్కరూ టిడిపి సభ్యత్వం నమోదు చేసుకోవాలి**

**మాజీ ఎంపీటీసీ పొన్నాడ అప్పారావు**

**పొందూరు,డిసెంబర్ 30 ,ప్రజా జ్యోతి న్యూస్:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వం లో రాష్ట్ర సమగ్రాభివృద్ధి కూటమి తోనే సాధ్యమని మాజీ ఎంపీటీసీ పొన్నాడ అప్పారావు అన్నారు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశాల మేరకు పొందూరు మండలం తోలాపి గ్రామంలో టిడిపి సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి సభ్యత్వం తీసుకోవడం ద్వారా కుటుంబానికి రూ. 5 లక్షల వరకు ఆర్థిక భరోసా ను తెలుగుదేశం పార్టీ కల్పిస్తుందని తెలిపారు. 18 సంవత్సరాలు పై బడిన ప్రతీ ఒక్కరూ టిడిపి సభ్యత్వం తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో , మాజీ సర్పంచ్ దుంపల సత్యం , నీటి సంఘ ఉపాధ్యక్షులు పప్పల శ్రీనివాసరావు ,వైస్ ప్రెసిడెంట్ పప్పల అప్పలనాయుడు,మాజీ ఎంపీటీసీ పొన్నాడ గంగాధర్ , పొన్నాడ సూర్యనారాయణ, రిటైర్డ్ టీచర్ నీటి సంఘ సభ్యులు, మొదలవలస సూర్యనారాయణ, నీటిసంఘం సభ్యులు, పైడి లక్ష్మణమూర్తి , నీటి సంఘ సభ్యులు గురువుబెల్లి సన్యాసప్పుడు , పప్పల మధుసూదన్ రావు, పాత్రుని చిన్న బాబు , పప్పల అప్పలనాయుడు, మాజీ నీటి సంఘం సభ్యులు, మొదలవలస వల్లయ్య, పొన్నాడ రామకృష్ణ, పొన్నాడ శ్రీధర్,పేడాడ సూర్యరావు ,పప్పల సంజీవరావు, బొనిగిశేఖర్, పొన్నాడ రవికుమార్ పొన్నాడ సతీష్ కుమార్ , నాయకులు , కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.





# బివి శేషాద్రి మృతిని నిర్వహిస్తూ న్యాయవాదులు విధులు బహిష్కరణ

**గుంతకల్లు డిసెంబర్ 30 ప్రజా జ్యోతి ప్రతినిధి (ఆనందరాజు):** అనంతపురం నందు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో, సీఐ శాంతి లాల్ చాంబర్లో సీనియర్ న్యాయవాది బివి. శేషాద్రి అనుమానస్పదంగా మరణించడం పట్ల సోమవారం రాష్ట్ర,జిల్లా వ్యాప్తంగా నిరసన వ్యక్తం చేస్తూ న్యాయవాదులు విధులు బహిష్కరించారు. రాష్ట్ర,జిల్లా పిలుపుమేరకు సోమ వారం గుంతకల్లు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు న్యాయ వాదులు విధులు బహిష్కరించి,బివి శేషాద్రి అనుమానస్పదన పట్ల నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సదరు సీఐని సస్పెండ్ చేయాలని, దీనిపై పూర్తిగా విచారణ జరిపి తగిన చర్య తీసుకోవాలని ఎస్పీ ని న్యాయవాదులు డిమాండ్ తెలిశారు. న్యాయవాదుల ప్రొటెక్ట్ యాక్ట్ తీసుకురావాలని, న్యాయవాదులకు భద్రత లేకుండా పోయిందని,సందర్భంగా న్యాయవాదులు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గుంతకల్లు కోర్టు న్యాయవాదులు బిఎస్. కృష్ణారెడ్డి,భాస్కర్ గౌడ్, వి.నాగ రాజు,లక్ష్మన్న,ఆర్ బడే సాబ్,సత్యనారాయణ,గురు ప్రసాద్,జె సురేష్ కుమార్, శివరావు, చెన్నకేశవులు,హేమాద్రి,వెంకట్ నాయుడు, పత్తికొండ నాగరాజు, ఈదురు వలి, మద్దికేర వెంకటేశులు, లక్ష్మీనారాయణ,విద్యాసాగర్,రవీంద్ర కుమార్, తిమ్మప్ప పెంచలపాడు చంద్రశేఖర్, డి.సి శేఖర్,తాజు




ద్దీన్,తలారి సురేష్, జయరాం,మస్తాన్వలి జిపి.తిమ్మారెడ్డి, నరసింహారా వు శ్యామల,తదితరు న్యాయవాదులు పాల్గొని బహిష్కరించారు.

## మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలు




**పొందూరు,డిసెంబర్ 30 , ప్రజా జ్యోతి న్యూస్:** పొందూరు మండల కేంద్రంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధాన ఉపాద్యాయులు పాలి శెట్టి వెంకట రావు ఆధ్వర్యంలో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి 2 ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రూపు విభాగంలో తొమ్మిది పాఠశాల నుండి ప్రాజెక్టు ప్రదర్శించారు. వ్యక్తిగత విభాగంలో 16 ప్రాజెక్టులు ప్రదర్శించారు. వ్యక్తిగత విభాగంలో జి అంజలి కేజీబీవీ ప్రథమ స్థానం, డి భవాని శంకర్ జి హెచ్ ఎస్ పొందూరు ద్వితీయ స్థానం , బి అనురాధ జడ్పిహెచ్ఎస్ లోలుగు తృతీయ స్థానం దక్కించుకున్నారు. గ్రూపు విభాగంలో వీ నందిని జడ్పీహెచ్ఎస్ లోలుగు ప్రథమ , కే రోహిణి జెడ్పిహెచ్ఎస్ తోలాపి ద్వితీయ, జి నిహారిక కేజీబీవీ తృతీయ స్థానం దక్కించుకున్నారు. వీటిలో ప్రథమ స్థానం గెలిచినవారు జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలకు ఎంపికైనట్లు మండల విద్యాశాఖ అధికారి 2 పట్నాన రాజారావు తెలిపారు. నూతన ఆవిష్కరణలతో మెరుగైన ప్రదర్శనలు ఇవ్వాలని కోరారు.

## ప్రధాన రహదారిని విస్తరించి ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ కి ఎమ్మార్పీఎస్ నాయకులు వినతి



**గుంతకల్లు డిసెంబర్ 30 ప్రజా జ్యోతి ప్రతినిధి (ఆనందరాజు):** గుంతకల్లు పట్టణంలో ప్రధాన రహదారుల్లో ప్రజలకు చాలా అసౌకర్యంగా ఉన్నాయని రహదారులను విస్తరించి ప్రజలకు,వ్యాపారస్తులకు, వాహనదారులకు ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని సోమవారం ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు తలారి వెంకటేష్ మాదిగ ఆధ్వర్యంలో గుంతకల్ మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. వెంకటేష్ మాట్లాడుతూ పట్టణంలో ప్రముఖ వ్యాపార సంస్థలు కు మరియు ప్రముఖ.హాస్పిటల్స్ కు ఫంక్షన్ హాల్లో బ్యాంకులకు.ప్రముఖ ట్రాన్స్పోర్ట్ సమస్థలు.కేఫ్ రెస్టారెంట్లు.ఎవరికీ కూడా పార్కింగ్ స్థలాలు లేకున్నా. పాదాచారులకు కేటాయిం చిన ఫుట్పాత్ స్థలాలను ఆక్రమించి శాశ్వత వ్యాపార సముదాయాలు నిర్వహిస్తు న్న అక్రమ వ్యాపారులు. పై చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ సమస్యపై మరియు ఫుట్పాత్లను ఫుట్పాత్మలు ఉన్న స్థలాలను ఆక్రమించు కొని అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ సమస్య లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ని కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పట్టణ ఉపాధ్యక్షులు ఎంపీ. నాగరాజు మాదిగ,పట్టణ కార్యదర్శి తమస్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

## గుంతకల్లు ప్రధాన రహదారిలో అక్రమాలు తొలగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని గ్రీన్వెన్స్ లో కలెక్టర్ కు సిపిఐ నాయకులు జగదీష్ వినతి



**గుంతకల్లు డిసెంబర్ 30 ప్రజా జ్యోతి ప్రతినిధి (ఆనందరాజు):** గుంతకల్లు పట్టణంలోని ప్రధాన రహదారుల్లో రోడ్లు వెడల్పు లేక ట్రాఫిక్ సమస్యలు నెలకొందని,ప్రధాన రహదారుల్లో అక్రమ కట్టడాలను తొలగించి వాహనాలు నింపుకునేందు కు,పాదాచార్యులకు ట్రాఫిక్ సమస్యలు లేకుండా రోడ్లను వెడల్పు చెయ్యాలని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీన్ వెన్స్ లో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి జగదీష్ కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చారు.జగదీష్ మాట్లాడుతూ గుంతకల్లు పట్టణంలో చాలా సంవత్సరాల క్రితం రోడ్లు ఏర్పాటు చేశారు.ఇప్పుడు ట్రాఫిక్ పెరిగి చాలా ఇబ్బందు లు కలుగుతున్నాయి ముఖ్య కూడలి రహదారులు అక్రమాలకు గురై గురించి పోయినవి దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు కావున హనుమాన్ సర్కిల్,బీరప్ప గుడి సర్కిల్,పొట్టి శ్రీరాములు సర్కిల్,ఎన్టీఆర్ సర్కిల్, గాంధీ చౌక్ సర్కిల్ ప్రధాన రహదారులలో ఏమైనా అక్రమాలు ఉంటే వాటిని తొలగించి రహదారులను విశాలంగా చేయుటకు అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని తెలిపారు.

## గుంతకల్ పట్టణంలో రోడ్లు విశాలంగా చేయండి

ఈరోజు గ్రీవెన్స్ డే లో జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం ఇస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ డి జగదీష్



**గుంతకల్ టౌన్ ప్రజా జ్యోతి :** అనంతపురం జిల్లా గుంతకల్ పట్టణంలో రోడ్లు విశాలంగా లేవు చాలా సంవత్సరాలు క్రితం చిన్న రోడ్లు ఏర్పాటు చేశారు అందువలన ట్రాఫిక్ పెరిగి చాలా ఇబ్బందులు కలుగుతున్నది ముఖ్య కూడలి అక్రమాలకు గురై కుదించక పోయినవి దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, కావున గాంధీ చౌక్ ,ఎన్టీఆర్ సర్కిల్ ,పొట్టి శ్రీరాములు సర్కిల్ ,బీరప్ప గుడి సర్కిల్ ,హనుమాన్ సర్కిల్ ఇటువంటి సర్కిల్లో ఏవైనా ఆక్రమణలు ఉంటే వాటిని తొలగించి సర్కిల్ ను విశాలంగా చేయుటకు అధికారులు కు తగిన ఆదేశాలు ఇవ్వండి అని మాట్లాడం జరిగింది.

## బీసీలపై చంద్రబాబు నాయుడు కు ఉన్న చిత్తశుద్ధి వెలకట్టలేనిది.

ఎమ్మెల్యే ఎంజీఆర్

**బీసీ సామజిక వర్గానికి చెందిన వ్యక్తిని సిఎస్ గా నియమించడం హర్షనీయం**



**మెలియాపుట్టి ప్రజా జ్యోతి డిసెంబర్ 30:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నూతన ప్రధాన కార్యదర్శిగా బీసీ సామజిక వర్గానికి చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి కె.విజయానంద్ ని నియమించినందుకు ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు కి కృతజ్ఞతలు తెలియజేసిన పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు. రాష్ట్రంలో తొలిసారి బీసీని సి.ఎస్ గా నియమించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. బీసీ,ఎస్సీ,ఎస్టి, మైనారిటీలని తేడాలేకుండా అర్హతలనే ప్రమాణికంగా చేసుకుని ఉన్నత స్థానాన్ని కల్పించడంలో చంద్రబాబు ఎల్లప్పుడూ ముందుంటారని కొనియాడారు. గతంలో శ్రీకాకుళం జిల్లాకలెక్టర్ గా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించి, నేడు నూతన సిఎస్ గా నియమితులైన విజయానంద్ కి శుభాకాంక్షలు తెలియజేశారు.

## వావిలపల్లి హాస్టల్‌లో అసిస్టెంట్ కుక్ పోస్టులకు భర్తీలు



**పొందూరు ,డిసెంబర్ 30,ప్రజా జ్యోతి న్యూస్:** పొందూరు మండలం వావిలపల్లి పేట మోడల్ స్కూల్ హాస్టల్ లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ పోస్టులను భర్తీ చేయడం జరుగుతుందని మండల విద్యాశాఖ అధికారి జి రాజేంద్ర ప్రసాద్ పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులకు సంబంధించి జనవరి రెండవ తేదీ గురువారం నాడు తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# సిరియాఖండి లో నిర్మాణాలు పూర్తయిన ప్రారంభోత్సవానికి నోచుకోని
# సచివాలయం, వెల్నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రాలు..





**పాతపట్నం డిసెంబర్ 30(ప్రజా జ్యోతి న్యూస్..** ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల క్రితం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థతో ప్రజలకు మెరుగైన సేవలు అందించారు. ఆధారిత సేవల్లో ఒకప్పుడు దేశంలోనే అగ్ర స్థానంలో ఉన్న ఏపీలో ఇప్పుడు ఏ పని ఎవరు చేయాలనే గందరగోళం నెలకొంది. ప్రభుత్వ వ్యవస్థలో కొత్తగా చొరబడిన పాలనా యంత్రాంగాలతో కొత్త చిక్కులు తప్పడం లేదు. పాతపట్నం నియోజకవర్గంలోని మెలియాపుట్టి మండలంలో సచివాలయాలు ప్రారంభం కాకపోవడంతో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండడంతో ఆయా గ్రామ ప్రజలు నాన అవస్థలు పడుతున్నారు. అందులోని భాగంగా మెలియాపుట్టి మండలంలోని సిరియాఖండి గ్రామంలో సచివాలయ నిర్మాణాలు పూర్తయినప్పటికీ నేటికి కూడా కాంట్రాక్టర్లకి డబ్బులు చెల్లించకపోవడంతో ఇప్పటికీ ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. నూతన ప్రభుత్వం ఏర్పాటు కావడం అధికారులు బదిలి అయ్యి ఐదు మాసాల అయినప్పటికీ సచివాలయాలు ప్రారంభోత్సవానికి నోచుకోక కార్యాలయం మరుగున పడుతున్నాయి, పలువురు ఆసరాగా తీసుకుని మేకలను గొర్రెలను రైతు భరోసా కేంద్రంలో ఉంచుతూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం కావడం ప్రజాప్రతినిధులు కన్నెత్తి చూడకపోవడం దురదృష్టమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయం, వెల్నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రం వినియోగానికి నోచుకోక 60 లక్షల వరకు ప్రజాధనం వృధా కావడం ప్రజా ప్రతినిధులు దృష్టి సారించకపోవడం ఎన్నికల్లో పూర్తిగా ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులో తెస్తామని హామీలను ఇచ్చి నెరవేర్చకపోవడం దురదృష్టంగా భావిస్తున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులైన ఎంపీ, ఎమ్మెల్యే, అధికారులు బాధ్యతగా ప్రజా ధనాన్ని వృధా చేయకుండా అభివృద్ధికి సహకరించాలని గ్రామస్తులు కోరుతున్నారు..

# అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు - అమిత్ షా రాజీనామాకు
# సిపిఎం ఆధ్వర్యంలో మాలమహానాడు డిమాండ్.






**పోదూరు, డిసెంబర్ 30,ప్రజాజ్యోతి న్యూస్.** రాజ్యాంగాన్ని కాపాడాల్సిన ప్రభుత్వమే పార్లమెంట్ లో స్వయాన కేంద్ర హెూం మంత్రి అమిత్ షా రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని సిపిఎం మండల కన్వీనర్ కాకర వెంకటేశ్వర్లు మండిపడ్డారు. పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం అంబేద్కర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి తక్షణమే అమిత్ షా కేంద్ర హెూం మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ మాలమహానాడు పిలుపు మేరకు అమిత్ షా రాజీనామా కోరుతూ తాహసీల్దార్ కార్యాలయం లో డీటీ కి వినతిపత్రం అందజేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రపంచంలోనే భారత దేశం అత్యున్నత విలువలు కలిగిన ప్రజాస్వామ్య దేశంగా భారత దేశం ఉందని అన్నారు. ఈ స్వాతంత్ర్య భారత దేశంలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పై కేంద్ర హెూమ్ మంత్రి చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమన్నారు. మాలమహానాడు మండల గౌరవ అధ్యక్షులు బుడితి భీమారావు మాట్లాడుతూ ప్రపంచ దేశంలో అత్యున్నత రాజ్యాంగం కలిగిన దేశం భారత దేశం అన్నారు. దేశంలో అన్ని కులాలు, మతాలు అన్న దమ్ముళ్లా కలిసి ఉంటున్నామని తెలిపారు. అమిత్ షా వ్యాఖ్యలు భారత దేశాన్ని కించపరిచేలా మాట్లాడారని అన్నారు. పిల్లి ప్రసాద్ మాట్లాడుతూ బీజేపీ పార్టీ ఆలోచించుకోవాలని అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా పై తగు చర్యలు తీసుకోవాలన్నారు. భారత దేశానికి, జాతికి నిరసన తెలియజేయాలని ఈ నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. ఈకార్యక్రమంలో నేతలు బూరాబత్తుల వెంకట్రావు, మల్లుల గణపతి,బొంతు శంకరం,మాలమహానాడు కమిటీ సభ్యులు సరేళ్ళ సత్యనారాయణ, తాడిపర్తి కిరణ్, రవికుమార్, వై రమేష్, ఎం కృష్ణమూర్తి, దాసి అనిల్ కుమార్, ఆర్ శేషుబాబు, కే చైతన్య, కే శ్రీను, ఏ రాజేష్ పాల్గొన్నారు.

## గోపాలమిత్ర సంఘం నూతన అధ్యక్షుడిగా బెండ నానాజీ



**ప్రత్తిపాడు ప్రజాజ్యోతి రిపోర్టర్ శ్రీను** పశు సంవర్ధక శాఖ జిల్లా కార్యాలయంలో గోపాలమిత్ర సంఘం కాకినాడ జిల్లా సర్వ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బెండ నానాజీ మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలలో పాడి రైతులకు పశువుల పెంపకం వాటికి తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు టీకాలు విషయంలో అవగాహన కల్పిస్తూ రైతుల ఆదాయం పెంచడంలో కీలకంగా వ్యవహరిస్థారని వీరికి రాష్ట్ర ప్రభుత్వం 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులర్ చేయాలని అప్పటి వరకు కనీసవేతనం 26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు ఈ సమావేశంలో కాకినాడ జిల్లా అధ్యక్షులుగా బెండ నానాజీ ఉపాధ్యక్షులుగా కె సత్యనారాయణ ప్రధాన కార్యద ర్శిగా ఎస్ సత్యన్నారాయణ సహాయ కార్యదర్శిగా వై సత్యన్నారాయణ కోశాధికారిగా ఎన్నికయ్యారు కె.సిహెచ్ అప్పన్న,కమిటీ సభ్యులుగా ఎస్.వెంకటలక్ష్మి, బి.రాజబాబు, ఎస్.ప్రసాద్, బి.కాశీ విశ్వనాధం తదితరులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## మాజీ ఎమ్మెల్యే పర్వత జన్మదినం సందర్బంగా సేవా కార్యక్రమాలు



**ప్రత్తిపాడు ప్రజాజ్యోతి రిపోర్టర్ శ్రీను** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రత్తిపాడు పాదాలమ్మ ఆలయం వద్ద ఉన్న శారదా వృద్ధాశ్రమంలో మామిడి నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ తమ అభిమాన నాయకుడు పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని కోరారు. ఆయన జన్మదిన సందర్భంగా వృద్ధులకు దుప్పట్లు,పండ్లు పంపిణీ చేయటం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు

## గులుమూరు గ్రామంలో ఉచిత వైద్య మెగా శిబిరం



**హిరమండలం డిసెంబర్30 ప్రజా జ్యోతి న్యూస్..** హిరమండలం మండలం గులుమూరు గ్రామంలో ఏపీ శా క్స్ సహకారంతో జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సలహా మేరకు వైద్యులు మరియు సిబ్బంది సహకారంతో 148 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడం జరిగింది. దీనిలో భాగంగా హెచ్ఐవి పరీక్షలు 62మందికి చేయడం జరిగింది. దీంట్లో భాగంగా జిల్లా రిసోర్స్ పర్సన్ హనుమంతు నాగభూషణరావు మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్,టిబి మరియు సుఖ వ్యాధుల నివారణ గురించి అవగాహన కలిగి ఉండాలి ప్రతి ఒక్కరు తన యొక్క హెచ్ఐవి స్థితిని తెలుసుకోవాలి, పాల్గొన్నారు డాక్టర్ రోషిణి,గ్రామ సర్పంచ్ ఎస్.కోటేశ్వరరావు పంచాయితీ సెక్రటరీ కూర్మారావు ఫామ్ సిస్ట్ కాశీబాబు ఏఎన్ఎం లక్ష్మి,ఎం.ఎల్.హెచ్.పి.త్రివేణి హెల్త్ అసిస్టెంట్ సింహాచలం, జోనల్ సూపర్వైజర్ ఆదినారాయణ,సి.ఏల్.డబ్ల్యూ. లత,శ్రీనివాసరావు,దివ్య ఆశా వర్కర్స్ పాల్గొనడం జరిగింది.

## ముదునూరి ఇంట నూతన సంవత్సర వేడుకల ఏర్పాట్లు



**ప్రత్తిపాడు ప్రజాజ్యోతి రిపోర్టర్ శ్రీను** నూతన సంవత్సరంలోకి అడుగు పెట్టేందుకు ఇంకా కొన్ని గంటలే మిగిలున్నాయి ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు చెప్పారు ధర్మవరం ముదునూరి స్వగ్రామంలో తన నివాసం వద్ద నూతన సంవత్సర వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు సోమవారం ముదునూరి పార్టీ శ్రేణులతో 2025 నూతన సంవత్సర వేడుకల కు సంబంధించిన ప్రాంగణాలను పరిశీలించారు ధర్మవరం గ్రామంలో వైసీపీ శ్రేణులు ఇప్పటికే భారీ టెంట్లు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ నూతన సంవత్సరం రోజున కార్యకర్తలకు తన అభిమానులకు తన ఇంటి వద్ద అందుబాటులో ఉంటానని మురళి కృష్ణంరాజు తెలిపారు నూతన సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలు ఆశలు నెరవేరుతూ ఆకాంక్షించార జీవితం సంతోషాలతో నిండిపోవాలని ముదునూరి ఆకాంక్షించారు

## నూతన సంవత్సర వేడుకల్లో ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు.,....

### మనోహర్ వన్ టౌన్ సీఐ

**గుంతకల్ టౌన్ ప్రజా జ్యోతి:** ముందుగా గుంతకల్ పట్టణ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు నూతన సంవత్సర వేడుకల్లో ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గుంతకల్ వన్ టౌన్ సీఐ బి. మనోహర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనసంవత్సర వేడుకలు నిబంధనల మేరకే నిర్వహించుకోవాలన్నారు బహిరంగ ప్రదేశాల్లో కేక్ కోయడం, బాణసంచా పేల్చడం, గుంపులుగా చేరి అల్లరి చేయడం వంటి వాటికి అనుమతులులేవు,సాంప్రదాయ కార్యక్రమాలకు మాత్రమే ముందుగా అనుమతి తీసుకోవాలి.మద్యం దుకాణాలు, బార్‌లు, రెస్టారెంట్లు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి సంబరాలు చేసుకోవడం, ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు తీసేసి నడపడంపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.మద్యం తాగి వాహనాలు నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లు నిర్వహించి కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తాము. కావున గుంతకల్ పట్టణ ప్రజలందరూ తగిన జాగ్రత్తలు పాటించి ఎలాంటి అనివార్య సంఘటనలు జరగకుండా సంతోషంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని అన్నారు.

## లయన్స్ క్లబ్ దాతృత్వం

**- అగ్ని బాధితులకు ఆర్థిక సహాయం**

**- రూ. 10 వేలు , 20 కేజీల రైస్ అందజేత**




**పొందూరు , డిసెంబర్ 30,ప్రజా జ్యోతి న్యూస్:** పొందూరు లయన్స్ క్లబ్ సభ్యులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. మండలం కోటిపల్లి గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో నాలుగు పురిళ్లు అగ్నికి ఆహుతైయ్యాయి. ఈ విషయం తెలిసిన పొందూరు లయన్స్ క్లబ్ అగ్ని బాధితులకు సహాయం చేసేందుకు ముందుకొచ్చారు. ఈ మేరకు లయన్స్ క్లబ్ సభ్యులు కళ్యాణి ,ధర్నా రావు , డాక్టర్ వై మల్లిబాబు, టిడిపి మండల ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి , శ్రీనివాస రావు , చక్రపాణి అందరూ కలిసి రూ. 10 వేలు తో పాటు , 20 కేజీల రైస్ పాకెట్ అగ్ని బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసిన నీటి సంఘం అధ్యక్షులు



**గండేపల్లి ప్రజాజ్యోతి రిపోర్టర్ అరుణ** జగ్గంపేట గోకవరం డిసెంబర్ 30 జగ్గంపేట నియోజకవర్గం గోకవరం మండలం మల్లవరం బోపాల్ రాజ్ చెరువు నీటి సంఘం అధ్యక్షులుగా రాష్ట్ర టిడిపి కార్యదర్శి స్వర్గీయ సత్యం సుభాష్ చంద్రబోస్ పెద్ద కుమారుడు సత్యం శ్యాంసుందర్ ఎన్నికయ్యారు సోమవారం చెరువు నీటి సంఘం కమిటీ అంతా కలిసి జగ్గంపేట శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపఅధ్యక్షులు తిరుమల తిరుపతి పాలకవర్గ సభ్యులు జ్యోతుల నెహ్రూ ని మర్యాదపూర్వకంగా కలిసి వారిని ఘనంగా సత్కరించి ఆశీస్సులు తీసుకున్నారు రైతులకు సకాలంలో నీరు అందే విధంగా పనిచేసే పేరు తెచ్చుకోవాలని నెహ్రూ కోరారు ఈ కార్యక్రమంలో నీటి సంఘ ఉపాధ్యక్షులు గంటా వీరబాబు సభ్యులు కరణం గోవింద్ ఆది వీరబాబు బుదిరెడ్డి వెంకటస్వామి పడాల కాట్రాజు తెలుగుదేశం పార్టీ ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ యిడుదల అర్జునరావు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గొర్రెపల్లి శ్రీను ఉపసర్పంచ్ లంక శ్రీను టిడిపి యువ నాయకులు సత్యం రాజా పాల్గొన్నార మాజీ ఎంపీటీసీ సిరందాసు రాజు జనసేన పార్టీ అధ్యక్షులు జీవీ నాయుడు తదితరులు పాల్గొన్నారు

## కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి.సీపీఎం



**పోడూరు, డిసెంబర్ 30,ప్రజాజ్యోతి న్యూస్.** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను అవమానపరిచిన కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా తక్షణమే క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆచంట పెద్ద పేటలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలేసిఘనంగా నివాళులర్పించారు. అమిత్ షా రాజీనామా చేయాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పి మోహన్ రావు మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్ పై అమిత్ షా అహంకార పురిత, అవమానకరంగా చేసిన వ్యాఖ్యలను ప్రతి ఒక్కరు ఖండించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు . దేశానికి మనువాద, మతోన్మాద భావజాలం ప్రమాదకరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు బండి రంగారావు, తలుపురీరి బుల్లబ్బాయి, కుసుమే జయరాజు, సిర్రా నరసింహమూర్తి, వర్ధనపు కృష్ణమూర్తి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో రోడ్డుకు ముహూర్తం ఖరారు.





**ప్రస్తుతం 300 కోట్ల రూపాయలతో రోడ్డు పనులు పూర్తి కానున్నట్టు సమాచారం**

**జీలుగుమిల్లి డిసెంబర్ 30 (ప్రజాజ్యోతి న్యూస్ రిపోర్టర్)** జీలుగుమిల్లి ఆంధ్ర తెలంగాణ సరిహద్దు భాగంలో ఉన్న జీలుగుమిల్లి మండలానికి స్వర్ణ యుగం ప్రారంభమైందని చెప్పవచ్చును. పునరు విభజన తరువాత జీలుగుమిల్లి మండలం నియోజకవర్గం అయ్యే పరిస్థితి నెలకొంది. ఏది ఏమైనా ఈ రోడ్లు పూర్తయితే జీలుగుమిల్లి మండలం దశతిరుగునుంది.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న 365 బీబీ రోడ్డుకు గుర్తింపు పనులు దగ్గర పడ్డాయని తెలుస్తుంది. ఇప్పటికే కాంట్రాక్టర్ ముహూర్తం ఖరారు చేసి ప్రభుత్వాలుకూ చెప్పినట్లు తెలియ వచ్చింది. జీలుగుమిల్లి సెంటర్లోని జగదాంబ అమ్మవారి ఆలయం చుట్టూ 70 అడుగులతో రింగ్ రోడ్డు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు పూర్తయ్యాయి. ఒక ప్రక్కన బాధితులు నష్టపరిహారం కోసం అధికారుల చుట్టూ, రాజకీయ నాయకులు చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. పనులు మాత్రం వేగంగా జరుగుతున్నాయి. బికేం హైదరాబాద్ సంస్థ పనులను ఇప్పటికే ముమ్మరం చేసింది. జీలుగుమిల్లి నుండి పి అంకంపాలెం వరకు నాలుగు లైన్లు రోడ్డు, అటు తర్వాత డబల్ లైన్ రోడ్డు కు గుర్తింపులు పూర్తి కావునన్నాయి. జీలుగుమిల్లి నుండి పోలవరం వరకు ఈ రోడ్డు పూర్తయితే ఏజెన్సీ ప్రాంతంలో వ్యాపారంతో పాటు, పరిశ్రమలు వచ్చే అవకాశం పుష్కలంగా ఉంది. ఏది ఏమైనా జగదాంబ సెంటర్కు మహాదశ వచ్చినట్లు అవుతుంది. మండలంలోని పంచాయతీలు అభివృద్ధి వైపు అడుగులు పడనున్నాయి. అన్ని సజావుగా సాగి జీలుగుమిల్లి మండలం అభివృద్ధిలో ముందు ఉంటదని ఆశిద్దాం.

## వాటర్ బాటిల్స్ లో నీరు నింపి విక్రయించకూడదు - కమిషనర్



**బాపట్ల జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని మినరల్ వాటర్ ప్లాంట్స్ ను గుంటూరు నుండి వచ్చిన సీనియర్ వాటర్ ఎనలిస్ట్ వి రాజ రావు మునిసిపల్ కమిషనర్ జి రఘునాథ రెడ్డి తో కలిసి ఆకస్మిక తనిఖీలు చేశారు వాటర్ ప్లాంట్ల నుండి నీటి నమూనాలను సేకరించి ప్లాంట్ యజమానులకు పలు సూచనలు చేశారు పరిసరాలు ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు వాటర్ ప్లాంట్ నిర్వహణకు సంబంధించి సంబంధిత శాఖల అనుమతులు తప్పకుండా తీసుకోవాలని చెప్పారు వాటర్ నమూనా పరీక్షల అనంతరం అవకతవకలున్నచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు వాటర్ బాటిల్స్ లో నీరు నింపి విక్రయించకూడదని తెలియజేశారు ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇంజనీర్ కృష్ణా రెడ్డి మరియు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## నరసాయపాలెం మాస్టర్ అథ్లెట్స్ కు 5 బంగారు పతకాలు



**బాపట్ల జిల్లా ప్రజాజ్యోతి స్టాఫ్ రిపోర్టర్** బాపట్ల మండలం నరసాయపాలెం గ్రామానికి సంబంధించి క్రీడాకారులు రిటైర్డ్ పిడి కుంభా సాంబశివరావు మరియు సురేంద్ర ఈనెల 28 29న గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొన్నారు ఈ క్రీడలలో హాయ్ జంప్ షార్ట్ పుట్ పోల్వాల్ట్ కి సంబంధించి మూడు బంగారు పతకాలు మరియు సురేంద్ర టిడిపి లాంగ్జం లో రెండు బంగారు పథకాలు పోల్వాల్ట హై జంపులో రెండు వెండి పథకాలు సాధించారు వీరు జనవరిలో జరుగు కేరళ రాష్ట్రములో త్రిశూర్ నందు పోటీలకు అర్హత సాధించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఎమ్మెల్సీ కుంభ రవి బాబు ఐఆర్ఎస్ అధికారి కుంభా శివకృష్ణ ఐపిఎస్ అధికారి దేవరకొండ నాగరాజు గ్రామ సర్పంచి దాసి హైమావతి మాజీ సర్పంచి ముప్పలనేని నాగరాజు గట్టుపల్లి ఇజ్రాయిల్ దొప్పలపూడి పూర్ణ కుమారి మరియు జెట్టి దినేష్ ముప్ప లనేని రామారావు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వినీత గ్రామ పెద్దలు వీరిని అభినందించారు

# కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు - జిల్లా కలెక్టర్



**బాపట్ల జిల్లా ప్రజాజ్యోతి స్టాఫ్ రిపోర్టర్** రహదారులపై ప్రజలు సురక్షితంగా ప్రయాణించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు రహదారుల గుంతలు పూడ్చే కార్యక్రమంపై రోడ్లు భవనాలుశాఖ అధికారులు కాంట్రాక్టర్ల తో సోమవారం స్థానిక కలెక్టర్ చాంబర్లో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రధాన రహదారుల మరమ్మతులు గుంతలు పూడ్చే కార్యక్రమం గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు అధికారులు కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు ఇప్పటికే పనులు ప్రారంభం కానీ ఏజెన్సీలకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు జనవరి 15వ తేదీలోగా పనులు పూర్తి కాకపోతే నోటీసులు ఇవ్వాలని సంబంధిత అధికారులకు చెప్పారు కంకర తరలించే సమయంలో మైన్స్ అధికారులు పన్ను వసూలు చేస్తున్నారని తదుపరి ఆర్ అండ్ బి అధికారులకు అదే వాహనానికి పన్నులు చెల్లించాల్సి వస్తుందని కాంట్రాక్టర్లు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన కలెక్టర్ రాష్ట్ర ఉన్నతాధికారులతో ఫోన్ లో మాట్లాడారు సమస్యను తక్షణమే పరిష్కరిస్తున్న నేపథ్యంలో జనవరి 30వ తేదీ నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు అప్పటికి చేయకపోతే కాంట్రాక్టర్ల ఒప్పందాలు పూర్తిగా రద్దు చేయాలని స్పష్టం చేశారు పాత పద్ధతిలో పనిచేస్తే సహించేది లేదన్నారు బాపట్ల జిల్లాలోని రాష్ట్రీయ రహదారులపై 22 పనులు మంజూరు కాగా 159 కిలోమీటర్ల మేర పనులు చేపట్టాల్సి ఉందని తెలిపారు ఇందు కొరకు రూ 5.35 కోట్ల నిధులు వచ్చాయని చెప్పారు కేవలం 73 కిలోమీటర్ల వరకు 9 పనులు మాత్రమే పూర్తయ్యాయని సూచించారు జిల్లాలోని ప్రధాన రహదారులపై మొత్తం 584 కిలోమీటర్ల మేర మరమత్తులు చేపట్టాల్సి అండగా 101 పనులుగా విభజించినట్లు తెలిపారు ఇందు కొరకు రూ.27.92 కోట్లు నిధులు వచ్చాయన్నారు ఒప్పందాల గడువు సమీపిస్తున్నప్పటికీ ప్రస్తుతం 224 కిలోమీటర్ల మేర పనులు పూర్తి చేయడంపై ఆరా తీశారు నిధులు పుష్కలంగా ఇచ్చినప్పటికీ పనులు జరగక పోవడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు ఒప్పందాల మేరకు పనులు వేగంగా పూర్తి చేయాలని జాప్యం చేస్తే సహించేది లేదని చెప్పారు ప్రజల నుంచి అసంతృప్తి రాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు ఈ సమావేశంలో జిల్లా రహదారులు భవనాల శాఖ ఎస్ఈ వి శ్రీనివాసరావు డి ఈలు కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు

# 31 వ తారీకు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు - జిల్లా ఎస్పీ



**బాపట్ల జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ తెలిపారు ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయము నుండి ఎస్పీ మాట్లాడుతూ మద్యం సేవించి బహిరంగ ప్రదేశాలలో వాహనాలు నడుపుతూ ప్రజలకు అంతరాయం కలిగిస్తే ఉపేక్షించబమని చెప్పారు డిసెంబర్ 31 వ రాత్రి జరుపుకునే నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేందుకు జిల్లా ఎస్పీ సోమవారం ప్రజలకు పలు సూచనలు చేశారు జిల్లాలోని ప్రజలు నూతన సంవత్సర వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని చెప్పారు ద్విచక్ర వాహనాలలో ముగ్గురు కూర్చుని వాహనాల సైలెన్సర్లు తీసివేసి రణ గోణ ధ్వనులు సృష్టిస్తూ వాహనాలు నడిపితే వాటిని సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని తెలిపారు బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి గుంపులుగా తిరుగుతూ మహిళలను యువతులను వేధిస్తే చట్ట పరిధిలో కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు పరిమితికి మించిన డీజే బాక్స్ లు ఏర్పాటు చేసి బాణాసంచా కాలుస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూచించారు ప్రభుత్వం నిర్దేశించిన సమయం వరకు మాత్రమే మద్యం విక్రయాలు జరపాలని వాటిని ఉల్లంఘిస్తే ఆయా మద్యం దుకాణాలు బార్లపైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు ముఖ్యంగా యువతపై కేసులు నమోదైతే భవిష్యత్తులో ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాలలో చేరాలంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది కాబట్టి వీటిని గ్రహించాలని ఎస్పీ ఒక సందర్భంలో తెలిపారు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా డిసెంబర్ 31 రాత్రి పోలీసు అధికారులు పెట్రోలింగ్ నిర్వహిస్తారని చెప్పారు అనంతరం యువత చట్టాన్ని ఉల్లంఘించి నూతన సంవత్సరంలో నమోదైన కేసులతో అడుగుపెడతారు లేదా నూతన సంతోషంతో కొత్తగా ఎంచుకున్న ఆశయాలను సాధించాలనె లక్ష్యంతో అడుగుపెడతారో మీరే ఆలోచించుకోవాలని ఎస్పి తెలియజేశారు ప్రజలందరూ పోలీస్ శాఖకు సహకరించి ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలని ఎస్పీ తెలియజేశారు

## జీలుగుమిల్లి సిఐ వెంకటేశ్వరరావు నూతన సంవత్సరం సందర్భంగా సందేశం

**మద్యం సేవించి డ్రైవింగ్ చేయొద్దు !**



**జీలుగుమిల్లి.. డిసెంబర్ 30 ( ప్రజాజ్యోతి న్యూస్ రిపోర్టర్)** నూతన సంవత్సరం సందర్భంగా జీలుగుమిల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బొడ్డు. వెంకటేశ్వరరావు ప్రజలకు కీలక సూచనలు చేశారు. ప్రాణం అనేది అమూల్యమైనదని, డిసెంబర్ 31 రాత్రి మద్యం సేవించి రోడ్డు పై ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హితవు పలికారు. "మీ వెనక మీ కుటుంబం ఉంది, వారి గురించి ఆలోచించండి" అని సూచిస్తూ, పండగ వేళా బాధ్యతతో ప్రవర్తించాలన్నారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా సర్కిల్ పరిధిలో ప్రతి చోట డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రాణాలను రక్షించడమే ముఖ్య లక్ష్యమని, వేడుకలు భద్రతతో జరుపుకోవాలని ఆయన ప్రజలను కోరారు. ప్రజలకు,నాయకులు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు.

## బిజెపి ప్రత్తిపాడు మండల అధ్యక్షుడిగా ఊటా వీరబాబు



**ప్రత్తిపాడు ప్రజాజ్యోతి రిపోర్టర్ శ్రీను :** ప్రత్తిపాడు మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా ఊటా వీరబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు కాకినాడ జిల్లా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికకారిణి కామినేని జయశ్రీ కాకినాడ జిల్లా బిజెపి వైస్ ప్రెసిడెంట్ ఉమ్మిడి వెంకట్రావు ప్రతిపాడు మండల రిటర్నింగ్ అధికారి పతివాడ వెంకటేశ్వరరావు ఎన్నికల అబ్జర్వర్ బొలిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో ఊటా వీరబాబును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ఈ సందర్భంగా ఊటా వీరబాబు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో బూతు స్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని అలాగే భారతీయ జనతా పార్టీ కేంద్రంలో ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువఅయ్యేలా అన్ని విధాల ప్రయత్నం చేస్తానని ఆయన అన్నారు అనంతరం జిల్లా అధ్యక్షులు చిలుకూరి రామ్ కుమార్ కు సీనియర్ నాయకులు సింగిలిదేవి సత్తిరాజు కర్రి ధర్మరాజుకు కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ప్రతిపాడు నియోజకవర్గ నాయకులు పైల సుభాష్ చంద్రబోస్ ప్రతిపాడు మండల ఇన్చార్జ్ మట్టా మంగరాజు కందా వీరాస్వామి తదితర పార్టీ నాయకులు పాల్గొన్నార కార్యకర్తలు పాల్గొన్నారు


## జీలుగుమిల్లి మండల బిజెపి అధ్యక్షుడిగా గుడ్ల రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నిక





**జీలుగుమిల్లి..డిసెంబర్..30 ( ప్రజాజ్యోతి న్యూస్ రిపోర్టర్)** జీలుగుమిల్లి మండలంలో బీజేపీ మండల సమావేశం నిర్వహించి, నూతన మండల అధ్యక్షుడి ఎంపికను రాష్ట్ర మరియు జిల్లా పార్టీ ఆదేశాల మేరకు నిర్వహించారు. తాటియాకుల గూడెం గ్రామానికి చెందిన గుడ్ల రాంబాబు ను ఏకగ్రీవంగా మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చాత్రాతి ప్రసాద్ ప్రకటించారు. సమావేశంలో 50 శాతం బూత్ అధ్యక్షులు, ప్రస్తుత మండల అధ్యక్షులు కొండపల్లి ప్రసాద్, జిల్లా కార్యదర్శి చాత్రాతి ప్రసాద్, మండల ఆర్వో బొరగం వెంకటలక్ష్మి, క్రియాశీలక సభ్యులు పులగం వెంకట సుబ్బారెడ్డి, పైడిమర్ల కోటిరెడ్డి, నల్లమోతుల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. గుడ్ల రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని రాంబాబు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి మండలంలోని బిజెపి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

## ఎమ్మెల్యే సత్యప్రభ కృషితో రోడ్లకు మహర్దశ



**ప్రత్తిపాడు ప్రజాజ్యోతి రిపోర్టర్ శ్రీను** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే సత్యప్రభ ప్రత్యేక దృష్టి పెట్టారు.కూటమి ప్రభుత్వంతోనే రహదారుల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే తెలిపారు ప్రత్తిపాడు మండలంలో వివిధ గ్రామాలకు చెందిన రహదారులు పూర్తిగా ధ్వంసం కావడంతో నియోజకవర్గ శాసనసభ్యురాలు దెబ్బతిన్న రోడ్ల పునఃనిర్మాణంపై దృష్టి సారించారు.దెబ్బతిన్న రోడ్డు నిర్మాణాలకు అవసరమైన నిధులను మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే సత్యప్రభ సఫలీకృతమవుతున్నారు. మండలంలో సీసీ రోడ్లు,బీటీ రోడ్లు నిర్మాణాలకు అవసరమైన నాలుగు కోట్ల రూపాయలను సోమవారం ఆమె మంజూరు చేయించారు.ఉత్తరకంచి నుండి పెద్దిపాలెం వరకు 2.10 కిలోమీటర్ల సిసి రోడ్డు నిర్మాణానికి 1 కోటీ 50 లక్షల రూపాయలు, పెద్దిపాలెం నుండి గోకవరం వరకు సీసీ రోడ్డు 900 మీటర్ల మరియు బీటీ రోడ్ 1.5 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణాలకు 1 కోటి 30 లక్షల రూపాయలు,గోకవరం, వేములపాలెం నుండి రౌతుపాలెం వరకు బీటీ రోడ్డు 1 కిలోమీటర్ నిర్మాణానికి 40 లక్షల రూపాయలు,లంపకలోవ ఆర్ అండ్ బి నుండి రాయవరం వరకు బీటీ రోడ్డు 2.5 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణమునకు 80 లక్షలు రూపాయలు మంజూరు అయినట్లుగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఒక ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ త్వరలోనే రోడ్ల నిర్మాణం చేపడతామని చెప్పారు ఎమ్మెల్యే సత్య ప్రభకు సుబ్బారెడ్డి సాగర్ చైర్మన్ ఇళ్ల అప్పారావు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర యువత కార్యదర్శి లొండ లోవరాజు టి.రాయవరం సర్పంచ్ తటవర్తి సుబ్బారావు కృతజ్ఞతలు తెలియజేయడంతో పాటు ఆయా గ్రామాల ప్రజలు నాయకులు హర్షం వ్యక్తం చేశారు హర్షం వ్యక్తం చేశారు

# పెద్ద ఎత్తున గంజాయి స్వాధీనం



**హైదరాబాద్ :** నూతన ఏడాది వేడుకలకు సిద్ధమవుతున్ వేళ హైదరాబాద్ నగరంలోకి అక్రమంగా నిషేధిత మత్తు పదార్థాలు, మద్యం ప్రవేశించకుండా పోలీసులు నిఘా పెంచారు. నగరంలోకి ప్రవేశించే మార్గాల్లో విస్తృతంగా తనిఖీలు చేపడుతూ.. డ్రగ్స్, మద్యం తరలింపును నిరోధిస్తున్నారు. ఈ క్రమంలోనే రెండు వేరువేరు ఘటనల్లో గంజాయి చాక్లెట్లు, అక్రమ మద్యాన్ని తెలంగాణ పోలీసులు గుర్తించి, సీజ్ చేశారు. పోలీసుల కఠిన ఆంక్షలతో మత్తు పదార్థాలు సప్లై చేసే వాళ్లు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. ఇప్పటి వరకు సిగరేట్లు, పొడి సహా ఇతర రూపాల్లో తరలించిన గంజాయిని చిన్నారులు తినే చాక్లెట్ల రూపంలో తయారు చేసి బోర్డర్లు దాటిస్తున్నారు. అలా ఒరిస్సా నుంచి హైదరాబాద్ లోకి వస్తున్న చాక్లెట్ గంజాయిని తాజాగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒరిస్తా ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో హైదరాబాద్ కు గంజాయి చాక్లెట్లు తరలిస్తున్నారనే సమాచారం అందడంతో సరిహద్దుల్లో పోలీసులు నిఘా పెట్టారు. ఈ క్రమంలోనే కోదాడ రాంపూర్ క్రాస్ రోడ్ దగ్గర ఓ బస్సులోని ప్రయా ణికుడి వద్ద నిందితుడిని పోలీసులు గుర్తించారు. భువనేశ్వర్ నుంచి హైదరాబాద్ కు చాకెట్ల రూపంలో తరలిస్తున్న గంజాయిని గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల తనిఖీల్లో దొరికిపోకుండా, ఎవరికీ అనుమానం రాకుండా చిన్నపిల్లల చాక్లెట్ల మాదిరిగా చుట్టి ఉంచిన వెయ్యికి పైగా గంజాయి చాక్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని తరలిస్తున్న అనిల్ కుమార్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ గంజాయి చాక్లెట్లను ఒరిస్సా కార్మికులు ఎక్కువగా పని చేసే ప్రాంతాల్లో విక్రయించనున్నట్లు నిందితుడు తెలపగా, ఒక్కో చాక్లెట్ ను రూ.30 లకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిపారు. గంజాయి చాక్లెట్లు సరఫరా చేస్తున్న అనిల్ కుమార్ పై కేసు నమోదు చేసిన పోలీసులు.. అతని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించనున్నట్లు కోదాడ ఎక్సైజ్ సీఐ శంకర్ వెల్లడించారు. మరో ఘటనలో గోవా నుంచి హైదరాబాద్ కు తరలిస్తున్న అక్రమ మద్యం బాటిళ్లను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో.. ఎక్సైజ్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. గోవా నుంచి హైదరాబాద్ వస్తున్న వాస్కోడిగామా రైలులో అక్రమ మద్యం బాటిళ్లను తరలిస్తున్నట్లుగా తెలుసుకుని.. ఒకేసారి తనిఖీలు చేపట్టారు. శంషాబాద్ నుంచి సికింద్రాబాద్ వరకు తనిఖీలు నిర్వహించగా.. పలువురు వద్ద 43 మద్యం బాటిళ్లను గుర్తించారు. వీటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు.. వీటి విలువ రూ. 2 లక్షల మేర ఉంటుందని తెలిపారు. న్యూ ఇయర్ సెలబ్రేషన్లకు సిద్ధమవుతున్న వేళ నగరంలోకి అక్రమ మద్యం, నిషేధిత డ్రగ్స్ ప్రవేశించే అవకాశం ఉండడంతో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. వేడుకలకు ముందు నుంచే ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపడుతున్నారు. ఈ చర్యల కారణంగానే నగరంలోకి ప్రవేశిక ముందే అక్రమ మద్యం, గంజాయి చాక్లెట్లు సహా ఇతర మత్తు పదార్థాలను గుర్తించి స్వాధీనం చేసుకుంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో తెలంగాణాను డ్రగ్స్ రహితంగా మార్చాలని పోలీసులు భావిస్తున్నారు. తెలంగాణ వ్యాప్తంగా.. ముఖ్యంగా హైదరాబాద్ లో గంజాయి సహా మరే ఇతర నిషేధిత డ్రగ్స్ వినియోగించకుండా చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా క్షేత్రస్థాయి నుంచి పటిష్ట నిఘా ఏర్పాటు చేసిన పోలీసులు, అనుమానాస్పద ప్రాంతాల్లో నిత్యం సోదాలతో డ్రగ్స్ రవాణా, విక్రయం, వినియోగాన్ని పూర్తిస్థాయిలో కట్టడం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

## ఈ యేడాది పెరిగిన ఎమర్జేన్సీ కాల్స్

# అగ్ని మాపక దళ వార్షిక నివేదిక



**హైదరాబాద్ :** 15మీటర్స్ పైన ఉన్నవి అన్ని హై రైస్ బిల్డింగ్ కింద పరిగనిస్తాం. ప్రతి హై రైస్ బిల్డింగ్ లో శిక్షణ కలిగిన ఫైర్ సిబ్బంది వుంటారు. ప్రతి హై రైస్ బిల్డింగ్ లో ఫైర్ స్ప్రింక్లర్ ఉంటుంది.. పొగ రాగానే వెంటనే నీళ్లు చల్లి ఆర్పేలా సిస్టమ్ మెయింటైన్ చేస్తారని అగ్ని మాపక దళం డీజీపీ నాగిరెడ్డి వెల్లడించారు. రెండు గంటలపాటు ఫైర్ ఎక్కువ వ్యాపించకుండా అన్ని రకాల చర్యలు హై రైస్ బిల్డింగ్ లో ఉండేలా చర్యలు తీసుకుంటాం. హైదరాబాద్ 3500వరకు హై రైస్ బిల్డింగ్ వున్నాయి. 700వరకు ఎన్ఓసి లు ఇచ్చాము. కొన్ని ఇంకా నిర్మాణం లో వున్నాయి. 2024సంవత్సరంలో 7383 ఫైర్ కాల్స్ వచ్చాయని అన్నారు.

7093స్మాల్ ఫైర్, 180మీడియం ఫైర్ కాల్స్, 87సీరియస్ ఫైర్ ఆక్సిడెంట్ కాల్స్,24మేజర్ ఫైర్ కాల్స్ వచ్చాయి. 2023తో పోలిస్తే 2024లో ఫైర్ కాల్స్ 0.23%తగ్గాయి. రెస్క్యూ కాల్స్ లో భాగంగా 1767వరద సహాయక కాల్స్ రాగ, అగ్ని ప్రమాదాలు 495,లిఫ్ట్ రెస్క్యూ 40కాల్స్, ఇతర కాల్స్ 54, జంతువుల రక్షణ 103వరకు వచ్చాయి.. 2023తో పోలిస్తే ఈ సంవత్సరం లో 7.29శాతం రెస్క్యూ కాల్స్ పెరిగాయి. అత్యవసర ఫైర్ కాల్స్ లో భాగంగా డెడ్ బాడీ రికవరీ 435,మరియు జంతువు రికవరీ 6 కాల్స్ వచ్చాయి. వాహన ప్రమాదాలు 28,రోడ్ ప్రమాదాలు 25,కూలిన భవనాలు10,కూలిన చెట్లు 22,సెలర్స్ 27 ఫైర్ కాల్స్ వచ్చాయని అన్నారు.

2023తో పోలిస్తే ఈ సంవత్సరం లో ఎమర్జెన్సీ కాల్స్ 10.82శాతం పెరిగాయి. ఫైర్ సేఫ్టీ కై అనేక అవగాహనా కార్యక్రమలు చేస్తున్నాం.అందులో భాగంగా పలు ఆకస్మిక తనిఖీలు చేసామని అన్నారు. 42,772హాస్పిటల్ లో తనిఖీ మరియు అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేసాము.. 19581పరిశ్రమలలో ఫైర్ అవగాహనా కార్యక్రమాలు చేసాము.. విద్యసంస్థలలో 6370,రెసిడెన్సియల్ 6331,ఇతర అవగాహనా కార్యక్రమాలతో పాటు మొత్తం 15లక్షల వరకు తెలంగాణ వ్యాప్తంగా అవగాహనా కార్యక్రమాలు చేసాము. 2023తో పోలిస్తే ఈ సంవత్సరం అవగాహనా కార్యక్రమాలు 81.71శాతం పెరుగుదల నమోదు అయింది. ఫైర్ డిపార్ట్మెంట్ ద్వారా ప్రభుత్వనికి 34.79కోట్లు ఆదాయం వచ్చిందని వెల్లడించారు.

# రాములమ్మకు కలిసి రాని కాలం



**హైదరాబాద్ :** రాజకీయాల్లో రాణించలేని నేతలకు మనకు కొదవలేదు. అయితే అలా వచ్చి ఇలా రాజకీయాల నుంచి "తెర"మరుగైన వారు అనేక మంది ఉన్నారు. వారిలో లేడీ సూపర్ స్టార్ విజయశాంతి ఒకరు. సినీ రంగంలో ఒక వెలుగు వెలిగిన విజయశాంతి రాజకీయ రంగంలో మాత్రం పెద్దగా రాణించలేకపోయారు. కేవలం ఒకే ఒక్కసారి ఆమె పార్లమెంటు సభ్యురాలిగా గెలిచారు. ఆమె యాటిట్యూడ్ కూడా ఇందుకు కారణమని అనుకోవాలి. విజయశాంతిని ఏ పార్టీ ఓన్ చేసుకోకపోవడానికి కారణం కూడా అదేనంటారు. కేవలం ఎన్నికల సమయంలోనే ఆమె కనిపించడం, తర్వాత ఇంటికే పరిమితమవ్వడం దశాబ్దాలుగా జరుగుతున్నదే. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏదైనా పదవి వస్తుందని భావించినా విజయశాంతి గురించి పట్టించుకునే వారే పార్టీలో లేరన్నది వాస్తవం. విజయశాంతి దాదాపు అన్ని పార్టీలూ మారారు. తొలుత బీజేపీ నుంచి రాజకీయాల్లోకి వచ్చిన విజయశాంతి తర్వాత ఆ పార్టీకి రాజీనామా చేసి తెలంగాణలో సొంతంగా పార్టీ పెట్టారు. తల్లి తెలంగాణ పార్టీ పేరుతో ఆయన జనంలోకి వెళ్లారు. కానీ జనం ఆదరించలేదు. అయితే తెలంగాణ ప్రత్యేక ఉద్యమం జోరుగా సాగుతున్న సమయంలో ఆ పార్టీని అప్పటి టీఆర్ఎస్ లో విలీనం చేశారు. కేసీఆర్ ఆమెను ఆదరించి దగ్గరకు తీశారు. మెదక్ ఎంపీని చేశారు. అయితే కేసీఆర్ తో సఖ్యతగా ఉండలేకపోయారు. అదే అక్కడే ఉండి ఉంటే పదేళ్ల పాటు ఏదో ఒక పదవి విజయశాంతిని వరించేది. కానీ తన యాటిట్యూడ్ మూలంగానే ఆమె పార్టీని వదిలి బయటకు వచ్చేశారు. తర్వాత మళ్లీ కాంగ్రెస్ లో చేరారు. అక్కడ కూడా నిలకడగా ఉండలేదు. కనీసం గాంధీభవన్ కు రావడానికి కూడా విజయశాంతికి మనసొప్పలేదు. అయినా 2018 ఎన్నికల్లో విజయశాంతికి ప్రచార కమిటీ బాధ్యతలను అప్పగించారు. కానీ తర్వాత మళ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే పార్టీ మారారు. తిరిగి బీజేపీ చెంతకు చేరారు. కొన్నాళ్లు బీజేపీలో కొనసాగిన విజయశాంతి తర్వాత మరోసారి కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల సమయంలో ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ను అధికారంలోకి రానివ్వకూడదంటూ ఆమె బాగానే తిరిగారు. అయితే మొత్తం మీద 2023 ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. తనకు ఏదో ఒక అవకాశం వస్తుందని భావించినా ఇంత వరకూ ఆమెను పట్టించుకునే వారు లేరు.. అప్పుడప్పుడు సోషల్ మీడియాలో ట్వీట్ చేస్తూ నేనున్నానంటూ ఆమెచెబుతున్నా మెదక్ జిల్లా నేతలు కూడా విజయశాంతిని పట్టించుకోవడం లేదు. రాహుల్ గాంధీ వచ్చినా ఆమె కలవడానికి ఇష్టపడరు. అలాగే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనరు. కానీ పదవి కావాలంటారు. అందుకు ఎవరు మాత్రం అంగీకరిస్తారు? విజయశాంతికి రానున్న కాలంలో ఏ పదవి వచ్చే అవకాశం లేదు. అధికారంలోకి తాను ఉన్న పార్టీ వచ్చినా, ఆమెకు రాజకీయంగా ఉపయోగం లేదు. నేతలు కూడా ఆమెవల్ల ఉపయోగమేంటన్న నిర్ణయానికి వచ్చినట్లుంది. కాంగ్రెస్ లో ఇప్పటికే హేమాహేమీలు పదవుల కోసం వెయిటింగ్ లో ఉన్నారు. విజయశాంతికి మాత్రం ఎలాంటి పదవి దక్కే అవకాశం లేదన్నది మాత్రం తెలంగాణ రాజకీయాలు చూసిన వారికి ఎవరికైనా అర్థమవుతుంది.

## కానిస్టేబుల్‌కు గుండెపోటు...

**హైదరాబాద్ :** గత కొంత కాలంగా తెలంగాణ పోలీస్ శాఖలో సిబ్బంది వరుస ఆత్మహత్యలతో మృతి చెందుతున్న సంగతి తెలిసిందే. ఉమ్మడి మెదక్ జిల్లాలో రెండు వేర్వేరు ఘటనల్లో ఆదివారం ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు ఆత్మహత్య చేసుకుని మృతి చెందారు. విషం తాగి ఒకరు, ఉరేసుకుని మరొకరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అప్పుల బాధ తాళలేక కుటుంబంతో కలిసి ఏఆర్ కానిస్టేబుల్ బాలకృష్ణ ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబానికి విషం ఇచ్చి, తాను మాత్రం ఉరి వేసుకున్నాడు. దీంతో బాలకృష్ణ మృతి చెందాడు.. ఆయన కుటుంబం ఆసుపత్రిలో ప్రాణాలతో పోరాడుతుంది. ఇక కొల్చారం పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కాటూరి సాయికుమార్ (55) స్టేషన్ ఆవరణలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ రెండు ఘటనలు మరువక ముందే తాజాగా మరో సంఘటన చోటు చేసుకుంది. యూసుఫ్‌గూడ ఫస్ట్ బెటాలియన్ కానిస్టేబుల్ దోసపాటి బాలరాజు (45) గుండెపోటుతో మృతి చెందారు. 2012 బ్యాచ్‌కు చెందిన బాలరాజు బెటాలియన్‌లోని ఆర్మ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అథారిటీ విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో తన స్వస్థలమైన భువనగిరికి సెలవుపై వెళ్లాడు. అక్కడే ఇంటి వద్ద గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు స్థానిక దవాఖానకు తరలించి, ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నగరంలోని దవాఖానకు తరలిస్తుండగా దారి మధ్యలోనే మృతి చెందారు. ఈ మేరకు బెటాలియన్ అధికారులు తెలిపారు. బాలరాజు మృతితో బెటాలియన్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. 3 రోజుల కిందట కామారెడ్డి జిల్లాకు చెందిన ఎస్సై సాయికుమార్ కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. ఇలా రాష్ట్రంలో పోలీస్ శాఖలోని పలువురు అధికారులు ఒకరి తర్వాత ఒకరుగా ఆత్మహత్యలు చేసుకోవడం చర్చనీయాంశమవుతోంది.

## జనవరి 3 నుంచి ఫిబ్రవరి 15 వరకూ జరగనున్న నుమాయిష్

**హైదరాబాద్ :** ఏటా కన్నులపండుగగా సాగే 84వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన నుమాయిష్ జనవరి 3 నుంచి ఫిబ్రవరి 15 వరకూ జరగనున్నది. ఇందుకు గాను ఏర్పాట్లు పూర్తి చేసింది తెలంగాణ ప్రభుత్వం. దేశంలోనే అతిపెద్దదైన ఈ ఎగ్జిబిషన్ ప్రతి సంవత్సరం జనవరి 1న నాంపల్లి గ్రౌండ్‌లో వేడుకగా నిర్వహిస్తారు. కానీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి కారణంగా వారం రోజులు సంతాపదినాలుగా ప్రకటించడంతో ఈసారి జనవరి 3కి వాయిదా పడింది. జనవరి 3 నుంచి ఫిబ్రవరి 15 వరకూ జరగనున్న నుమాయిష్ సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేష్ గౌడ్‌లు హాజరుకానున్నట్లు సమాచారం.

## మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మనవడు చెస్ ఛాంపియన్

**హైదరాబాద్ :** మాజీ మంత్రి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి మనవడు పట్లోళ్ల ఇంద్రారెడ్డి ఇంటర్నేషనల్ రేటింగ్ చెస్ టోర్నమెంట్ లో అండర్-11 పురుషుల విభాగంలో ఛాంపియన్ గా నిలిచాడు. జూబ్లీహిల్స్ లోని ఏకాగ్ర చెస్ అకాడమీలో నిర్వహించిన సమావేశంలో ఛాంపియన్ షిప్ టోర్నమెంట్ కు సంబందించిన వివరాలను అకాడమీ సీఈఓ సందీప్ నాయుడు వెల్లడించారు. కాన్పూర్లో గతవారం క్రిష్ణ గోపాల్ కపూర్ మెమోరియల్ ఇంటర్నేషనల్ రేటింగ్ చెస్ టోర్నమెంట్ ను ఐదు రోజుల పాటు నిర్వహించారు. టోర్నమెంట్లో అకాడమీకి చెందిన పట్లోళ్ల ఇంద్రారెడ్డి, భరత్ కుమార్ రెడ్డి లు పాల్గొన్నారని, అండర్-11 పురుషుల విభాగంలో పట్లోళ్ల ఇంద్రారెడ్డి ఛాంపియన్ గా నిలిచాడని, ఓపెన్ కేటగిరీలో అన్ని గేమ్స్ విజేతగా నిలిచి భరత్ కుమార్ రెడ్డి లక్షరూపాల ప్రైజ్ ని గెలిచాడని తెలిపారు. పట్లోళ్ల ఇంద్రారెడ్డి ఫిడే రేటింగ్స్ తన పాయింట్స్ ని మెరుగుపరుచుకున్నాడని సందీప్ నాయుడు తెలిపారు. గ్రాండ్ మాస్టర్స్ అవ్వడమే తమ లక్ష్యమని విజేతలు పేర్కొన్నారు.

## అవసరం లేని వైద్యంతో ఆరోగ్యాలు పాడు చేసుకుంటున్నారు

**– డాక్టర్ పీసీ గుప్తా, వాస్కులర్ సొసైటీ వరల్డ్ ప్రెసిడెంట్**

**హైదరాబాద్ :** వ్యాధుల పట్ల సరైన అవగాహన లేని చాలామంది యూట్యూబ్ లో వీడియోలు చూసి తమకు లేని వ్యాధిని ఉందని నిర్ధారించుకొని అక్కరలేని వైద్యాలు చేయించుకొని ఆరోగ్యాలు పాడు చేసుకుంటున్నారని వాస్కులర్ సొసైటీ వరల్డ్ ప్రెసిడెంట్ డాక్టర్ పి.సి గుప్తా అన్నారు. కొండాపూర్ లో జపాన్ ఇకిగాయ్ సిద్ధాంతాలతో ఏర్పాటుచేసిన డయాబెటిక్ ఫుట్, వాస్కులర్ క్లినిక్ ను ఆయన అసోసియేషన్ ఆఫ్ ప్లాస్టిక్ సర్జన్ ఆఫ్ ఇండియా జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్ నితిన్ మోకల్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పిసి గుప్తా మాట్లాడుతూ సోషల్ మీడియాలో వస్తున్న అనేక వీడియోలు చూస్తూ చాలామంది మోసపోతున్నారని వాస్తవాలు ధ్రువీకరించుకాకుండా అక్కరలేని వైద్యాలకు వెళ్తున్నారని ఇది మంచి పరిణామం కాదని అన్నారు. డాక్టర్ నితిన్ మోకల్ మాట్లాడుతూ ప్రపంచంలో భారతదేశం డయాబెటిక్ హబ్ గా మారుతుండడం ఆందోళనకరంగా ఉందని, రోజురోజుకు అన్ని వయసుల్లో డయాబెటిక్ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారని ఇది ఆందోళన కలిగించే అంశం అని అన్నారు. ఆహారపు అలవాట్లను మార్చుకోవడంతోపాటు శారీరక వ్యాయామాలు చేయడం వల్ల డయాబెటిక్ నుంచి కాపాడుకోవచ్చునని అన్నారు. ఇకిగాయ్ వైద్యులు విశ్వనాథ్ ఆత్రేయపురపు, మణి కాంత్ కారుమూరి మాట్లాడుతూ జపాన్ లో ఎక్కువగా విశ్వసించే ఇకిగాయ్ సిద్ధాంతాలతో తమ వైద్య చికిత్సలు ఉంటాయని అన్నారు.

## ఏ పథకం చూసిన గందరగోళం

**రుణమాఫీ – రైతు భరోసా – భూమిలేని కూలీలకు సహాయం శూన్యం**

**టిఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం పరంజ్యోతి ఆరోపణ**

**వనపర్తి :** తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరకాలం గడిచినా కూడా ఏ ఒక్క పథకం కూడా అమలు చేయలేదని టిఆర్ఎస్ పార్టీ వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం పరంజ్యోతి ఆరోపించారు, ప్రభుత్వం అధికారంలోకి రావడానికి మాయ మాటలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను నమ్మించి సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను ముక్కు పిండి ముక్కు నేలకు రాపిస్తున్నాడని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు, ముఖ్యంగా గత టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎక్కడ చూసినా సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి రైతాంగానికి పుష్కలంగా సాగునీరు అందించడం వల్లనే వ్యవసాయం పండుగ అయిందని ఎక్కడ చూసినా వరి పంట రైతుల పండించి ప్రభుత్వానికి ఇచ్చిన కూడా సకాలంలో సన్న బియ్యం పంపిణీ చేయలేకపోతుందని అంతేకాక ఎన్నికలు ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల రూపాయల రుణమాఫీ ఇప్పటికి చేయలేదని కేవలం కొంతమందికి మాత్రమే పూర్తిచేసి సంపూర్ణంగా రుణమాఫీ చేసినట్లు చెప్పడం రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని అన్నారు, 2 లక్షల పైన అప్పు కలిగిన రైతులకు ఎప్పుడు రుణమాఫీ చేస్తారని ఆయన ప్రశ్నించారు, వీటితోపాటు రైతు భరోసా పథకం కూడా సంక్రాంతి పండుగకు అప్పుడు ఇప్పుడు అంటూ కాలం గడపడం తప్ప సంక్రాంతి పండుగకు కూడా రైతు భరోసా నిధులు ఈ ప్రభుత్వం ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదని శాటిలైట్ ఉపగ్రహాల ద్వారా రైతుల చరిత్రను కష్టానికి ఈ ప్రభుత్వం చూడడం బాధాకరమని ఆయన అన్నారు, ఉపగ్రహాల ద్వారా వ్యవసాయం చేసిన రైతులను గుర్తిస్తామని ప్రభుత్వం చెప్పడం సిగ్గుచేటని అన్నారు, అంతేకాక భూమిలేని నిరుపేద కూలీలకు డిసెంబర్ 28న 6000 రూపాయలు జమ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఎందుకు జమ చేయలేదని నిరుపేద భూమిలేని కూలీలను ఈ ప్రభుత్వం ఇప్పటికే గుర్తించలేదని అలాంటి ప్రభుత్వం మళ్లీ మోసం చేయడానికి కుట్ర చేస్తుందని అన్నారు, దీనితోపాటు ఉచిత ఆరు గ్యారెంటీ పథకాలను కూడా అమలు చేయలేదని, ఎక్కడ చూసినా గ్రామాలలో పట్టణాలలో అభివృద్ధి కుంటుపడిపోతుందని నిధులు మంజూరు చేయక గ్రామాలలో గ్రామపంచాయతీ కార్మికులు రోడ్లపై కి వచ్చే ఆందోళన చేస్తున్నారని ఆయన ఆరోపించారు, ఈ విధంగా తెలంగాణ రాష్ట్రంలో ఈ ప్రభుత్వం ఏ పథకం కూడా అమలు చేయకుండా సమీక్షలు సమావేశాల పేరుతో కాలయాపన చేయడం తప్ప చెప్పిన మాట ప్రకారం ఏ ఒక్క రోజు కూడా ఏ పథకం కూడా ఇప్పటికి అమలు కాలేదని అన్నారు, డిసెంబర్ 9 సోనియాగాంధీ జన్మదినం నాటికి అన్ని పథకాలు అమలు చేస్తామని చెప్పి ఒకటి కూడా అమలు చేయలేదని ప్రజలు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు. పత్రికా విలేకరుల సమావేశంలోతెలిపారు

## బిజినెస్

# బీమా సేవలు బాగోలేవా..

## అయితే పోర్టబిలిటీతో మరో పాలసీ తీసుకోండిలా..




బీమాతో వచ్చే భరోసానే వేరు. ప్రధానంగా ఓ మంచి ఆరోగ్య బీమా పాలసీ.. అత్యవసర సమయాల్లో కొండంత అండగా నిలుస్తుంది. అయితే అదే పాలసీ.. సరైన కవరేజీ ఇవ్వకున్నా, సదరు బీమా సంస్థ సేవలు అసంతృప్తికరంగా ఉన్నా అనవసరపు భారమే అవుతుంది. అందుకే మన అంచనాలకు తగువిధంగా లేని ఆరోగ్య బీమా పాలసీలను పోర్టబిలిటీ ద్వారా మార్చుకునే సౌలభ్యం ఇప్పుడున్నది. అది ఎలాగో మీకు తెలుసా?

**ఆరోగ్య బీమా పోర్టబిలిటీ అంటే?**

ఆరోగ్య బీమా పోర్టబిలిటీ.. పాలసీదారులకు తమ ప్రస్తుత హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని బీమా ప్రయోజనాలు ఏ రకంగా దెబ్బతినకుండా మరో కొత్త ఇన్సూరర్‌కు మార్చుకునేలా సహాయపడుతుంది. నో-క్లెయిం బోనస్, వెయిటింగ్ పీరియడ్ క్రెడిట్, ఇతర లాభాలను యథతథంగా ఉండేలా చేస్తుంది. ఉదాహరణకు మీకు ఓ రూ.10 లక్షల ఆరోగ్య బీమా ఉన్నది. ఎన్నో ఏండ్లుగా దీనికి ప్రీమియంలు చెల్లిస్తూనే ఉన్నారు. క్రమేణా ఆ ప్రీమియంలు పెరుగుతున్నా.. మీకు మీ బీమా సంస్థ క్లెయింలను సెటిల్మెంట్ చేస్తున్న తీరు మాత్రం నచ్చడం లేదు. ఈ సమయంలోనే రూ.15 లక్షల కవరేజీతో మరో బీమా సంస్థలో ఓ పాలసీ మీ దృష్టికొచ్చింది. పైగా దీనికి ఇప్పుడున్న ప్రీమియంల కంటే తక్కువే. దాంతో కొత్త పాలసీకి మారాలనుకున్నారు. అప్పుడు పోర్టబిలిటీ సదుపాయాన్ని ఎంచుకోవచ్చు. దీనివల్ల మీ బీమా కవరేజీ రూ.10 లక్షల నుంచి 15 లక్షలకు పెరుగుతుంది. పాత పాలసీలో ఏవైనా నో-క్లెయిం బోనస్‌లున్నా అవీ వర్తిస్తాయి. అలాగే ప్రీమియంలూ తగ్గుతాయి. నెట్‌వర్క్ హాస్పిటల్స్, మెటర్నిటీ లేదా తీవ్ర అనారోగ్య సమస్యల కవరేజీ కూడా బాగుంటుంది.

గుర్తుంచుకోండి..

ప్రస్తుత పాలసీ గడువు ముగియడానికి కనీసం 45 రోజుల ముందుగానే మీరు కోరుకున్న కొత్త సంస్థకు బీమా పోర్టబిలిటీ విజ్ఞప్తిని చేసుకోవడం మంచిది.

పోర్టబిలిటీ ద్వారా ఆన్‌లైన్‌లో ఆరోగ్య బీమాను తీసుకోవాలనుకుంటే ప్రీమియం రేట్లు, కవరేజీ, నెట్‌వర్క్ హాస్పిటల్స్, క్లెయిం సెటిల్మెంట్ రేషియో వంటివి వివిధ సంస్థల్లో ఎలా ఉన్నాయో క్షుణ్ణంగా పరిశీలించండి. ఇందుకోసం ఆయా సంస్థల వెబ్‌సైట్లు, మొబైల్ యాప్స్‌ను వాడుకోండి.

పోర్టబిలిటీ ఫారంలో మీ ఆరోగ్య సమస్యల వివరాలు, ప్రస్తుత పాలసీ, గత క్లెయింలు తదితర సమాచారాన్ని దాచకుండా ఇవ్వండి.

సంప్రదాయ పద్ధతిలో మీ ప్రస్తుత బీమా పాలసీని ఇతర సంస్థల్లోకి మార్చుకోవాలనుకుంటే ఆయా కంపెనీల ఆఫీసులను సంప్రదించడం ఉత్తమం.

## బ్యాంకింగ్ ఆటో స్టాక్స్ ఎఫెక్ట్..
## నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు



అంతర్జాతీయ బలహీన సంకేతాల నేపథ్యంలో సోమవారం దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. బీఎస్‌ఈ -30 ఇండెక్స్ సెన్సెక్స్ 450.94 పాయింట్లు పతనమై 78,248.13 పాయింట్ల వద్ద స్థిర పడింది. అంతర్గత ట్రేడింగ్‌లో 79,092.70 పాయింట్ల గరిష్ట స్థాయి నుంచి 78,077.13 పాయింట్ల కనిష్ట స్థాయి మధ్య తచ్చాడింది. మరోవైపు, ఎన్ఎస్ఈ-50 సూచీ నిఫ్టీ 168.50 పాయింట్లు నష్టంతో 23,644.90 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో నిఫ్టీ 23,915.35 పాయింట్ల గరిష్ట స్థాయి నుంచి 23,618.90 పాయింట్ల మధ్య ట్రేడయింది. బ్యాంకింగ్, ఆటో స్టాక్స్ అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. ఐసీఐసీఐ బ్యాంకు, హెచ్డీఎఫ్సీ బ్యాంకు స్టాక్స్‌తో సూచీలు పతనం అయ్యాయి. బీఎస్ఈ-30 ఇండెక్స్ సెన్సెక్స్‌లో టాటా మోటార్స్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్, భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) షేర్లు పతనం అయ్యాయి. మరోవైపు, జోమాటో, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, సన్ ఫార్మా, ఇండస్ఇండ్ బ్యాంక్ షేర్లు లబ్ధి పొందాయి. ఫారెక్స్ మార్కెట్లో అమెరికా డాలర్‌పై రూపాయి మారకం విలువ నాలుగు పైసలు నష్టంతో రూ.85.52 వద్ద స్థిర పడింది. మరోవైపు, అంతర్జాతీయంగా క్రూడాయిల్ బ్యారెల్ 73.98 డాలర్లు, ఔన్స్ బంగారం 2625 డాలర్లు పలికింది. బేర్' చూపులతో ఎన్ఎస్ఈ-50లోని 50 స్టాక్స్ లో 38 నష్టాల్లోనే ముగిశాయి. భారత్ ఎలక్ట్రానిక్స్, హిందాల్కో, టాటా మోటార్స్, ట్రెంట్, విప్రో తదితర సంస్థలు 2.32 శాతం వరకూ నష్టపోయాయి. మరోవైపు అదానీ ఎంటర్‌ప్రైజెస్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, శ్రీరాం ఫైనాన్స్, ఇండస్ఇండ్ బ్యాంక్ సహా 11 స్టాక్స్ 7.26 శాతం వరకూ లాభ పడ్డాయి. బ్రాడర్ మార్కెట్లలో నిఫ్టీ మిడ్ క్యాప్ 100 ఇండెక్స్ 0.37 శాతం లబ్ధి పొందగా, నిఫ్టీ స్మాల్ క్యాప్-100 ఇండెక్స్ 0.62 శాతం పతనమైంది. వివిధ సెక్టార్ల ఇండెక్సుల్లో మిశ్రమ ధోరణి కనిపించింది. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంకు, నిఫ్టీ ఆటో, నిఫ్టీ ఫైనాన్సియల్స్, నిఫ్టీ మీడియా, నిఫ్టీ మెటల్స్, నిఫ్టీ రియాల్టీ తదితర ఇండెక్స్‌లు 1.87 శాతం వరకూ నష్టపోగా, నిఫ్టీ ఎఫ్ఎంసీజీ, నిఫ్టీ ఐటీ, నిఫ్టీ ఫార్మా, నిఫ్టీ హెల్త్ కేర్, నిఫ్టీ టెలికం ఇండెక్స్‌లు 1.62 శాతం వరకూ లాభ పడ్డాయి.

# ఇంటర్ ఫెయిల్.. 7 రోజుల్లో రూ.336 కోట్లు



విజయానికి కృషి, సహనం అవసరం. ఈ రెండూ కలిస్తేనే మీరు విజయ శిఖరాలను చేరుకుంటారు. మన దేశంలో ఇప్పటి వరకు చాలా మంది కష్టపడి, సహనంతో, తెలివితేటలతో విజయాలు సాధించారు. అందుకే వారికి పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. అలాంటి ఒక వ్యక్తి గురించి తెలుసుకుందాం. 12వ తరగతిలో ఫెయిలైనా కోట్లాది వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నాడు. ఆ వ్యాపారి పేరు గిరీష్ మాతృభూతం . గిరీష్ మాతృభూతం 12వ తరగతి ఉత్తీర్ణత సాధించకపోయినా నేడు కోట్లాది రూపాయలకు యజమాని. గిరీష్ తన 12వ తరగతిలో ఫెయిల్ అతని కుటుంబం, స్నేహితులు అతన్ని హేళను చేశారట. అందరు కూడా ఒక విధంగా చూసేవారట. నువ్వు ఫెయిల్ అయ్యావు కాబట్టి ఇప్పుడు రిక్షా నడుపుకోవాల్సి ఉంటుంది.. నువ్వు ఇంకేమీ చేయలేవు' అని ఎంతో మంది అవమానించారట. కానీ గిరీష్ పట్టు వదలలేదు. తనను తాను నమ్ముకుని ముందుకు సాగాడు.

ఎడతెగని ప్రయత్నాల తర్వాత గిరీష్‌కి హెచ్‌సిఎల్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. దీని తరువాత అతను సాఫ్ట్‌వేర్ కంపెనీ జోహోలో లీడ్ ఇంజనీర్‌గా పనిచేయడం ప్రారంభించాడు. ఐటీ సెక్టార్‌లో పనిచేయడం వల్ల ఈ రంగంలో ఎన్నో విషయాలను తెలుసుకోగలిగాడు. ఈ అనుభవంతో 2010లో గిరీష్ తన సొంత కంపెనీని ప్రారంభించారు. దానిపేరే 'ఫ్రెష్‌వర్క్స్'. ఫ్రెష్‌వర్క్స్ అనేది %ట% సొల్యూషన్స్ అందించే సంస్థ. కంపెనీ ప్రస్తుత విలువ రూ.53000 కోట్లు. 2010 నుంచి 2018 వరకు ఎనిమిదేళ్ల కాలంలో గిరీష్ కంపెనీ భారీ లాభాలను ఆర్జించింది. 2018 నాటికి కంపెనీకి 125 దేశాలలో 100,000 కంటే ఎక్కువ మంది కస్టమర్‌లు ఉన్నారు. ప్రస్తుతం ఫ్రెష్‌వర్క్స్‌లో గిరీష్‌కు 5.229 శాతం వాటా ఉంది. ఆయన మొత్తం ఆస్తులు దాదాపు రూ.2,369 కోట్లు.

గిరీష్ గత వారంలో ఫ్రెష్‌వర్క్స్ షేర్లను విక్రయించారు. అతను 7 రోజుల్లో మొత్తం %వి%39.6 మిలియన్ షేర్లను విక్రయించాడు. దీని ప్రకారం, అతను ఒక వారంలో రూ.336 కోట్లకు పైగా సంపాదించాడు. దీనితో పాటు, పరిశ్రమలో ప్రముఖ పేరుగా మారిన ఫ్రెష్‌వర్క్స్‌తో గిరీష్ (సాఫ్ట్‌వేర్‌గా సర్వీస్) వ్యాపారంలోకి ప్రవేశించారు.

వ్యాపారం అంటే ఏమిటి?

కంపెనీలు తమ వినియోగదారులకు ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్ పరిష్కారాలను అందిస్తాయి. సాఫ్ట్‌వేర్‌ను కొనుగోలు చేసి ఇన్‌స్టాల్ చేయడానికి బదులుగా, కస్టమర్‌లు సొల్యూషన్‌ని ఉపయోగించడానికి సబ్‌స్క్రయిబ్ చేస్తారు. ఇది అనేక రకాల సౌకర్యాలను అందిస్తుంది. ఇది వారి వ్యాపారాన్ని పెంచుకోవడం సులభం చేస్తుంది.

## స్పోర్ట్స్

# నాలుగో టెస్ట్‌లో ఓటమి

## సంక్లిష్టంగా మారిన టీమిండియా ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్ ఆశలు




బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో జరిగిన నాలుగో టెస్ట్‌లో భారత జట్టు 184 పరుగుల తేడాతో ఘోర పరాజయం పాలైంది. ఈ ఓటమితో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరాలన్న భారత జట్టు అవకాశాలపై దెబ్బ కొట్టింది. ఇప్పటికీ ఫైనల్ ఆశలు ఇంకా సజీవంగానే ఉన్నా.. అంత తేలిగ్గా మాత్రం కుదరదు. మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ లో ఓటమి తర్వాత పాయింట్ల పట్టికలో భారతదేశం మూడో స్థానంలో ఉండగా.. ఆస్ట్రేలియా రెండో స్థానంలో ఉన్నది. దక్షిణాఫ్రికా జట్టు పాకిస్థాన్‌ను ఓడించి ఫైనల్‌కు అర్హత సాధించింది. ప్రస్తుతం కేవలం రెండోస్థానం కోసం మాత్రమే పోరు కొనసాగనున్నది. ప్రస్తుతం ఫైనల్‌కు చేరేందుక ఆస్ట్రేలియా జట్టుకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వరుసగా రెండుసార్లు ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్ ఆడిన టీమిండియాకు మూడోసారి ఫైనల్ ఆడే అవకాశాలు తక్కువగానే ఉన్నాయి. మెల్‌బోర్న్ టెస్టులో 340 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 155 పరుగులకు కుప్పకూలింది. భారత బ్యాటర్లు మూడు సెషన్లలో ఆసిస్ బౌలర్లను దీటుగా ఎదుర్కోలేకపోయారు. దాదాపు 13 ఏళ్ల తర్వాత మెల్‌బోర్న్‌లో టీమిండియా టెస్టులో ఓడిపోయింది. ఇంతకు ముందు 2011లో చివరిసారిగా ఓడింది. ఈ విజయంతో ఐదు టెస్టుల సిరీస్‌లో ఆస్ట్రేలియా 2-1 ఆధిక్యంలో నిలిచింది. చివరి టెస్ట్ జనవరి 3 నుంచి సిడ్నీ వేదికగా జరుగనున్నది. ఆస్ట్రేలియా పర్యటనకు ముందు టీమిండియా.. న్యూజిలాండ్‌తో స్వదేశంలో టెస్ట్ సిరీస్ ఆడగా.. ఓటమిపాలైంది. పెర్త్ టెస్టులో ఆస్ట్రేలియాను ఓడించిన భారత్, అడిలైడ్ టెస్టులో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. బ్రిస్బేన్ టెస్ట్ డ్రాగా ముగియగా.. మెల్‌బోర్న్ టెస్టులో ఓటమితో భారత్ 1-2 తేడాతో వెనుకంజలో ఉన్నది. ఈ క్రమంలో భారత్ ఇతర జట్ల ఫలితాలపైనే ఆధారపడాల్సి పరిస్థితి ఎదుర్కొంది.

సిడ్నీలో జరిగే టెస్టులో తప్పనిసరిగా విజయం సాధించాల్సిందే. మ్యాచ్‌ను డ్రా చేసుకున్నా.. ఓడిపోయినా ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్ రేసు నుంచి తప్పుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. రోహిత్ కెప్టెన్సీలో గత రెండునెలల్లో ఆడిన ఆరు టెస్టుల్లో టీమిండియాకు ఇది ఐదో టెస్ట్ ఓటమి. న్యూజిలాండ్‌పై వైట్‌వాష్‌కు గురవగా.. అడిలైడ్, మెల్‌బోర్న్ టెస్టుల్లోనూ ఓటమిపాలైంది. ఫైనల్ భారత్ ఆశలు సజీవంగా ఉండాలంటే సిడ్నీ టెస్టులో ఎలాగైనా గెలవాల్సిందే. ఐదో టెస్టులో భారత్ గెలిస్తే సిరీస్ 2-2తో సమం అవుతుంది. ఈ సిరీస్ తర్వాత ఆస్ట్రేలియా జట్టు.. శ్రీలంకతో రెండు టెస్టులు ఆడుతుంది. ఈ సిరీస్‌లో ఆసిస్‌ను శ్రీలంక ఓడిస్తే.. కంగారు జట్టుకు ఇబ్బందికరంగా మారింది. బోర్డర్ ట్రోఫీని డ్రా చేసుకుంటే.. భారత్ 55.26 పాయింట్లతో ఉంటే.. శ్రీలంకపై ఓటమితో ఆస్ట్రేలియా పాయింట్లు 54.26గా మారుతాయి. అయితే, ఆస్ట్రేలియా.. శ్రీలంకతో టెస్టు సిరీస్‌ను డ్రాగా ముగిస్తే 56.48 పాయింట్లతో ఆస్ట్రేలియా ఫైనల్ చేరుకని భారత్ రేసు నుంచి తప్పుకుంటుంది.

## బాక్సింగ్ డే టెస్టు రికార్డు బ్రేక్..
## మ్యాచ్‌ను వీక్షించిన
## 3.73 లక్షల మంది ప్రేక్షకులు




మెల్‌బోర్న్: మెల్‌బోర్న్ క్రికెట్ మైదానంలో కొత్త రికార్డు నమోదు అయ్యింది. అత్యధిక సంఖ్యలో ఆస్ట్రేలియా, భారత్ మధ్య జరిగిన టెస్టు మ్యాచ్‌ను ప్రేక్షకులు వీక్షించారు. సుమారు 3,73,691 మంది మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించినట్లు రికార్డు నమోదైంది. బ్రాడ్‌మ్యాన్ కాలం నాటి రికార్డును ప్రేక్షకులు బ్రేక్ చేసినట్లు చెబుతున్నారు. ఎంసీజీలో ఇంత సంఖ్యలో ప్రేక్షకులు హాజరుకావడం ఇదే మొదటిసారి. ఇవాళ ఫైనల్ రోజు అత్యధికంగా 74,362 మంది ప్రేక్షకులు ప్రత్యక్షంగా మ్యాచ్‌ను వీక్షించారు. దిగ్గజ బ్యాటర్ డాన్ బ్రాడ్‌మ్యాన్ కాలంలో కూడా ఈ స్థాయిలో ప్రేక్షకులు ఎంసీజీ చేరుకోలేదని రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. మొత్తం అయిదు రోజుల్లో 373,691 మంది హాజరైనట్లు ఎంసీజీ అధికారులు తేల్చారు. ప్రతి రోజు రికార్డు స్థాయిలో ప్రేక్షకులు హాజరయ్యారు. ఆసక్తికరంగా సాగిన ఫైనల్ రోజు.. భారత్ చివరి సెషన్‌లో తడబడింది. ఆ సెషన్‌లో ఏడు వికెట్లును కోల్పోయింది. దీంతో ఇండియా 184 రన్స్ తేడాతో బాక్సింగ్ డే టెస్టులో ఓటమి చవిచూసింది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియా 2-1 తేడాతో ఆధిక్యంలో ఉన్నది. జనవరి 3వ తేదీ నుంచి అయిదవ టెస్టు మ్యాచ్ జరగనున్నది. 87 ఏళ్ల క్రితం బ్రాడ్‌మాన్ ఆడుతున్న రోజుల్లో భారీ సంఖ్యలో ఎంసీజీకి ప్రేక్షకులు వచ్చారు. 1937లో ఇంగ్లండ్‌తో ఆరు రోజుల పాటు జరిగిన టెస్టు మ్యాచ్‌ను రికార్డు స్థాయిలో వీక్షించారు. ఆ మ్యాచ్‌ను సుమారు 350534 మంది వీక్షించారు. ఇప్పుడు ఆ రికార్డును భారత్, ఆసీస్ మ్యాచ్ బ్రేక్ చేసింది.

# మానసిక వేదన మిగిల్చింది.. ఓటమిపై రోహిత్ శర్మ




మెల్‌బోర్న్: మెల్‌బోర్న్‌లో జరిగిన టెస్టులో ఇండియా దారుణంగా ఓడింది. 184 రన్స్ తేడాతో ఆస్ట్రేలియా ఆ టెస్టులో విజయం సాధించింది. ఆ మ్యాచ్ ముగిసిన తర్వాత మీడియాతో కెప్టెన్ రోహిత్ శర్మ మట్లాడాడు. బాక్సింగ్ డే టెస్టులో ఓటమి మానసిక ఆందోళన కలిగించిందన్నాడు. అనుకున్నది చేయలేనప్పుడు మానసిక సంఘర్షణ ఉంటుందని రోహిత్ తెలిపాడు. ఈ సిరీస్‌లో రోహిత్ కూడా సరిగా ఆడలేకపోవడంతో అతనిపై కూడా విమర్శలు అధికమయ్యాయి. ఆరు ఇన్నింగ్స్‌లో అతను కేవలం 31 రన్స్ మాత్రమే చేశాడు. ఓటమి డిస్టర్బింగ్‌గా ఉందని, వ్యక్తిగత లోపాలపై దృష్టి పెట్టాలన్నాడు. బాక్సింగ్ డే టెస్టు నిరాశపరిచిందని, మ్యాచ్‌లు గెలిచేందుకు మార్గాలు ఉంటాయని, కానీ ఆ మార్గాలను అన్వేషించలేకపోయామని రోహిత్ పేర్కొన్నాడు. చివర వరకు పోరాడాలని నిశ్చయించామని, కానీ దురదృష్టవశాత్తు అలా చేయలేకపోయినట్లు చెప్పాడు. సెకండ్ ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా ఓ దశలో 90 రన్స్‌కే ఆరు వికెట్లను కోల్పోయింది. కానీ ఆ తర్వాత చివరి వికెట్‌కు భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పిన ఆస్ట్రేలియా.. భారీ ఆధిక్యాన్ని కూడా నమోదు చేసింది. ఆ పరిస్థితులను సరిగా వినియోగించుకోలేకపోయినట్లు రోహిత్ తెలిపాడు. విపత్కర పరిస్థితుల్లో చాలా పటిష్టమైన ఆటను ఆడాలన్న ఉద్దేశంతో ఉన్నామని, కానీ అనుకున్న రీతిలో రాణించలేకపోయామన్నాడు. రూమ్‌కు వెళ్లిన తర్వాత ఎలా ఓ జట్టుగా పోరాడాలన్న ఆలోచన చేసినట్లు రోహిత్ చెప్పాడు. మా దగ్గర ఉన్నవన్నీ మేం ప్రయోగించాం, వాళ్లు కూడా తీవ్రంగా పోరాడారు, ఆ చివరి వికెట్ భాగస్వామ్యం మొత్తం మ్యాచ్‌ను మార్చేసిందన్నాడు.

## ఇది పిచ్చి ఆకు అనుకుంటే మీరు తింగరోళ్లే..

# లివర్ కడిగినట్లే క్లీన్



ఈ రోజు మంచి ఔషధ గుణాలు ఓ మొక్క గురించి తెలుసుకుందాం. గలిజేరు పల్లెటూర్లలో ఉండేవారికి తెలుసు. పట్నాల్లో పెరిగినవారికి మాత్రం దీని గురించి అవగాహన ఉండదు. గలిజేరు పొలం గట్ల వెంబటి.. రోడ్ల పక్కన తీగలా పాకుతుంది. రెయినీ సీజన్‌లో మంచి ఇళ్ల మధ్య కూడా పెరుగుతుంది. గ్రామల్లో దీన్ని ఆకుకూర మాదిరిగా వండుకుని తింటారు. ఇందులో కూడా ఎర్ర గలిజేరు, తెల్ల గలిజేరు.. రెండు రకాలున్నాయి. ఆయుర్వేదం, ఇంటి వైద్యంలో ఈ మొక్కను విరివిగా ఉపయోగిస్తారు. ఈ ఆకుకూర తినడం ఏమేం ప్రయోజనాలు ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం.. కిడ్నీ సమస్యలు ఖతం : ప్రస్తుతం కిడ్నీ సమస్యలతో చాలామంది సతమతం అవుతున్నారు. అలాంటివారు దీన్ని డైట్‌లో యాడ్ చేసుకుంటే సూపర్ బెనిఫిట్స్ ఉంటాయి. ఈ ఆకు కిడ్నీలను శుభ్రంగా, ఆరోగ్యంగా ఉండేలా చూస్తుంది. కిడ్నీల పనితీరు కూడా మెరుగ్గా ఉండేలా చూస్తుంది. గలిజేరులో ఉండే యాంటీఆక్సిడెంట్లు పుష్కలం. ఇతర పోషకాలు యూరిన్ ప్రవాహాన్ని పెంచి కిడ్నీల్లో రాళ్లను బయటకు పంపడంతో బాగా హెల్ప్ చేస్తాయి. అలాగే ఒంటికి పట్టని నీరును తగ్గిస్తుంది ఈ మొక్క. అలాగే మూత్రనాళ ఇన్ఫెక్షన్స్ కూడా గలిజేరు చెక్ పెడుతుంది.

**లివర్‌కు ఎంతో మేలు :** గలిజేరులో యాంటీఆక్సిడెంట్లు బాగా ఉంటాయి. అలాగే.. ఇతర మినరల్స్ సైతం ఉంటాయి. దీన్ని తినడం ద్వారా లివర్ చాలా ఆరోగ్యంగా ఉంటుంది. ఫ్యాటీ లివర్ సమస్య ఎదుర్కొనుందుకు సాయపడుతుంది.

**ఎముకల పటుత్వం :** ఈ ఆకుకూరలో కాల్షియం మస్త్ ఉంటుంది. దీన్ని తినడం ద్వారా బోన్స్ బలంగా తయారవుతాయి. కీళ్లనొప్పులు, ఆర్థరైటిస్, కాళ్ల వాపు లక్షణాలను తగ్గించడంలో ఇది చాలా బాగా ఉపయోగపడుతుంది అదేవిధంగా గలిజేరు ఆకుల్లో డయాబెటిస్?ను కంట్రోల్ చేసే గుణం ఉందట.

**చక్కని జీర్ణక్రియ :** ఈ ఆకుకూరలో తింటే జీర్ణ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయంటున్నారు ఆయుర్వేద వైద్యులు. దీన్ని తినడం ద్వారా కడుపు ఉబ్బరం, అజీర్తి మలబద్ధకం సమస్యల నుంచి ఉపశమనం ఉంటుందంటున్నారు. అలాగే ఒబెసిటీని నియంత్రించడానికి ఇందులోని పోషకాలు సాయపడతాయని చెబుతున్నారు.

దీన్ని కూర వండుకుని తినొచ్చు. పప్పులో వేసుకోవచ్చు. కషాయం మాదిరిగా తీసుకోవచ్చు. లేదా ఆకులను ఎండబెట్టి పొడి చేసుకుని.. హాట్ వాటర్‌లో కలిపి తాగొచ్చు.


## తొక్కేకదాని తీసి పారేస్తున్నారా?
## దీని రహస్యం తెలిస్తే భద్రంగా దాచేస్తారు



శీతాకాలంలో నారింజ పండ్లు పుష్కలంగా అందుబాటులోకి వస్తాయి. చాలా మంది జలుబు, దగ్గు వస్తుందని వీటికి దూరంగా ఉంటారు. విటమిన్ సి పుష్కలంగా ఉండే ఈ పండు తినడం చాలా మంచిదంటున్నారు ఆరోగ్య నిపుణులు. నారింజ పండ్లే కాదు, దాని గింజలు, తొక్క కూడా ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందట. ముఖ్యంగా నారింజ తొక్క (ఆరెంజ్ పీల్) శరీరానికి ఎలాంటి మేలు చేస్తుందో ఈ కింద తెలుసుకుందాం..

ఆరెంజ్ పీల్స్ లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఆరెంజ్ తొక్క చర్మం, శ్వాసకోశ సమస్యలను తొలగించడానికి సహాయపడుతుంది. చలికాలంలో నారింజ పండ్లను ఇంటికి తెచ్చుకుంటే, వాటి పై తొక్కను మర్చిపోకుండా తినాలంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఇది శరీరానికి ఎన్నో ప్రయోజనాలు కలుగజేస్తుందట. నారింజలో విటమిన్ సితోపాటు వివిధ పోషకాలు ఉంటాయి. నారింజ తొక్కలో ఉండే మినరల్స్ ఆరోగ్యానికి చాలా అవసరం. దీని తొక్కలో విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. దీన్ని తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఒత్తిడి తగ్గుతుంది. ఆందోళన మాయమవుతుంది. మూడ్ బాగుంటుంది. హ్యాంగోవర్‌ను తగ్గిస్తుంది. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరిచి, చర్మం మెరిసేలా చేస్తుంది. నారింజ తొక్కలో ఫైబర్, విటమిన్ సి, ఫోలేట్, విటమిన్ బి6, కాల్షియం వంటి ఆరోగ్యానికి అవసరమైన పోషకాలు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి సహాయపడతాయి. ఆరెంజ్ పీల్స్ లో పాలీఫెనాల్స్ అనే యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇందులో క్యాన్సర్ నిరోధక గుణాలు కూడా ఉన్నాయి. లిమోనెన్ వంటి రసాయన సమ్మేళనాలు నిండుగా ఉంటుంది. ఈ పదార్థాలు క్యాన్సర్‌ను నిరోధించగలవు. నారింజ తొక్క క్యాన్సర్‌తో పోరాడటంలో బలేగా ఉపయోగపడుతుంది. అయితే నారింజ తొక్కను ఎలా తింటారనేది అసలు ప్రశ్న.. దీన్ని నేరుగా తినడం శరీరానికి అంత మంచిది కాదు. నారింజ తొక్క రుచికి చేదుగా ఉంటుంది. ఇలా కాకుండా నేరుగా తినడానికి బదులు నారింజ తొక్కను వేడి నీటిలో వేసి బాగా కడగాలి. ఆ తర్వాత నారింజ తొక్కలను చిన్న ముక్కలుగా కట్‌చేసి సలాడ్‌లు, శాండ్‌విచ్‌లు, స్మూతీస్ వంటి మొదలైన వాటితో కలిపి నేరుగా తినవచ్చు. అంతేకాకుండా, నారింజ తొక్క పొడితో టీ తయారు చేసుకుని తాగవచ్చు. ఆరెంజ్ పీల్ జెల్లీని కూడా తయారు చేసి తినవచ్చు.

## రక్తహీనత సమస్య ఉందా..
## అయితే వీటిని తింటే రక్తం అధికంగా తయారవుతుంది!



మన శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే అన్ని రకాల విటమిన్లు, మినరల్స్‌తోపాటు ఇతర పోషకాలు కూడా మనకు లభించాలి. అప్పుడే ఎలాంటి రోగం రాకుండా ఉంటాం. ముఖ్యంగా కొన్ని రకాల విటమిన్లు లేదా మినరల్స్ వల్ల పలు లోపాలు ఏర్పడుతుంటాయి. దీంతో అనారోగ్య సమస్యలు వస్తుంటాయి. అలాంటి వాటిల్లో రక్తహీనత కూడా ఒకటి. రక్తహీనత సాధారణంగా ఐరన్ లోపం వల్ల తలెత్తే సమస్య. ఇది అత్యంత సహజసిద్ధమైంది. చాలా మందికి రక్తహీనత వస్తూనే ఉంటుంది. ఇక స్త్రీలలో అయితే రక్తహీనత వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అయితే రక్తం తయారు అయ్యేందుకు ఐరన్ ఎంతో ముఖ్య పాత్ర పోషిస్తుంది. కనుక ఐరన్ ఉండే ఆహారాలను తినాల్సి ఉంటుంది. ఐరన్ లోపిస్తే రక్త కణాలు తయారు కావు. దీంతో రక్తహీనత సమస్య వస్తుంది. అయితే ఏయే ఆహారాలను తీసుకోవడం వల్ల ఐరన్ లోపం సమస్యను అధిగమించవచ్చో ఇప్పుడు తెలుసుకుందాం.

**విటమిన్ బి12..**

పాలు, పాల ఉత్పత్తులలో విటమిన్ బి12 ఉంటుంది. అలాగే బ్రౌన్ రైస్, పుట్ట గొడుగుల్లో, మటన్, చికెన్, ప్రాన్స్, చేపలు, కోడిగుడ్లలోనూ విటమిన్ బి12 ఉంటుంది. ఇది ఎర్ర రక్త కణాలు తయారు అయ్యేందుకు సహాయ పడుతుంది. కనుక విటమిన్ బి12 అందేలా చూసుకోవాలి. అంటే.. ఆయా ఆహారాలను తరచూ తింటుండాలి. దీంతో ఎర్ర రక్త కణాలు తయారు అవుతాయి. అలాగే వీటిల్లో ఐరన్ కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇది శరీరంలో రక్తం పరిమాణాన్ని పెంచుతుంది. దీంతో రక్తహీనత సమస్య నుంచి బయట పడవచ్చు. ఇక పాలకూరలో ఐరన్ అధికంగా ఉంటుంది. కనుక రోజూ ఆహారంలో పాలకూరను చేర్చుకోవాలి. దీంతో జ్యూస్ తయారు చేసి తాగితే రక్తం తయారవుతుంది. రక్తహీనత నుంచి బయట పడవచ్చు. పాలకూరను తినడం వల్ల విటమిన్ కె కూడా లభిస్తుంది. ఇది రక్తం త్వరగా గడ్డకట్టేలా చేస్తుంది. దీంతో గాయాలు అయినప్పుడు తీవ్ర రక్త స్రావం జరగకుండా ఆపవచ్చు.

**బీట్‌రూట్ జ్యూస్..**

బీట్‌రూట్ జ్యూస్‌ను రోజూ ఉదయం పరగడుపునే తీసుకోవడం వల్ల కూడా శరీరానికి ఐరన్ సమృద్ధిగా లభిస్తుంది. బీట్‌రూట్ మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇది రక్తాన్ని తయారు చేయడంతోపాటు శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ నియంత్రణలోకి వస్తుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. కొలెస్ట్రాల్, షుగర్ లెవల్స్ సైతం తగ్గుతాయి. కనుక బీట్‌రూట్‌ను రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాలి. అలాగే దానిమ్మ పండ్ల రసం కూడా అద్భుతంగా పనిచేస్తుంది. రోజుకు ఒక దానిమ్మ పండును తినవచ్చు. లేదా ఒక గ్లాస్ దానిమ్మ పండ్ల జ్యూస్ తాగవచ్చు. ఇందులోనూ ఐరన్ సమృద్ధిగానే ఉంటుంది. ఇది ఎర్ర రక్త కణాలు తయారయ్యేందుకు దోహదం చేస్తుంది. కనుక రక్తం తక్కువగా ఉన్నవారు దానిమ్మ పండ్లను తింటుండాలి. లేదా జ్యూస్ అయినా తాగవచ్చు.

**కరివేపాకు..**

రోజూ ఉదయాన్నే పరగడుపునే గుప్పెడు కరివేపాకులను తింటుండాలి. వీటిని నేరుగా తినడం ఇష్టంలేనివారు వీటి పొడిని మజ్జిగలో కలిపి కూడా తాగవచ్చు. ఇలా తాగినా కూడా ఐరన్ లభిస్తుంది. దీంతో రక్తం తయారవుతుంది. రక్తహీనత తగ్గుతుంది. అలాగే ఆహారంలో భాగంగా తోటకూర, గోంగూర, చుక్కకూర వంటి ఆకుకూరలను తింటుండాలి. ఇవి కూడా ఐరన్‌ను కలిగి ఉంటాయి. దీంతో రక్తం తయారవుతుంది. రక్తం తయారయ్యేందుకు టమాటాలు కూడా ఎంతగానో పనిచేస్తాయి. రోజూ టమాటా జ్యూస్ తాగవచ్చు. వీటిల్లో లైకోపీన్ అనే యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీంతో వ్యాధులు, ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది. రోజుకు ఒక యాపిల్‌ను తింటున్నా కూడా ఎర్ర రక్త కణాలు తయారు అయ్యేలా చేయవచ్చు. దీంతో రక్తహీనత సమస్య నుంచి బయట పడవచ్చు. ఇలా పలు ఆహారాలను తింటే ఐరన్ లోపం సమస్యను అధిగమించవచ్చు. దీంతో రక్త హీనత తగ్గుతుంది.

## రోజూ చిన్న ఎండు కొబ్బరి ముక్కను తింటే ఏం జరుగుతుందో తెలుసా..?

కొబ్బరికాయలను దేవుడికి భక్తితో సమర్పిస్తుంటారు. అయితే కొబ్బరికాయలను కొట్టిన తరువాత చాలా మంది కొబ్బరిచిప్పలను ఎండబెడుతుంటారు. అనంతరం అందులోని కొబ్బరిని వంటల్లో వాడుతుంటారు. ఇక మార్కెట్‌లో మనకు ఎండు కొబ్బరి కూడా లభిస్తుంది. వీటిని కూడా మనం వాడుతుంటాం. చాలా మంది ఎండు కొబ్బరిని మసాలా వంటకాలు లేదా స్వీట్ల తయారీలో ఉపయోగిస్తారు. అయితే వాస్తవానికి ఎండు కొబ్బరి ఎన్నో పోషకాలను కలిగి ఉంటుంది. దీన్ని రోజూ తినడం వల్ల మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వైద్యులు చెబుతున్నారు. రోజూ చిన్న ఎండు కొబ్బరి ముక్కను తిన్నా చాలు ఎంతో ప్రయోజనం ఉంటుందని వారు అంటున్నారు. రోజూ ఎండు కొబ్బరిని తినడం వల్ల ఏం జరుగుతుందో ఇప్పుడు తెలుసుకుందాం.

**షుగర్ లెవల్స్..**

రోజూ చిన్న ఎండు కొబ్బరి ముక్కను తింటుంటే షుగర్ లెవల్స్ కంట్రోల్ అవుతాయి. ఎండు కొబ్బరిలో ఉండే సమ్మేళనాలు మనం తిన్న ఆహారాన్ని సులభంగా జీర్ణం చేస్తాయి. దీని వల్ల మనం తిన్న ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సులభంగా శోషించుకుంటుంది. ఫలితంగా షుగర్ లెవల్స్ కంట్రోల్ అవుతాయి. అలాగే ఎండు కొబ్బరిని తింటే జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడి శుభ్రంగా మారుతుంది. ముఖ్యంగా గ్యాస్, మలబద్దకం, అసిడిటీ. కడుపు ఉబ్బరం, పొట్టలో అసౌకర్యం వంటి సమస్యలు ఉండవు. అలాగే వికారంగా ఉండడం, వాంతికి వచ్చినట్లు ఉండడం వంటి సమస్యలు ఉన్నవారు ఎండు కొబ్బరిని తింటుంటే ఫలితం ఉంటుంది.

**రోగ నిరోధక శక్తి..**

ఎండు కొబ్బరిలో యాంటీ వైరల్, యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. అందువల్ల దీన్ని తిన్నే మనకు బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్ నుంచి రక్షణ లభిస్తుంది. దీంతో ఇన్‌ఫెక్షన్లు సైతం తగ్గుతాయి. అలాగే శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఎండు కొబ్బరిని తినడం వల్ల శరీరంలో ఉండే కొవ్వు కరుగుతుంది. దీని వల్ల అధిక బరువు తగ్గుతారు. ఎండు కొబ్బరిని తినడం వల్ల ఆకలి నియంత్రణలో ఉంటుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. కడుపు నిండిన భావన కలుగుతుంది. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఫలితంగా ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. ఎండు కొబ్బరిని రోజూ కొద్దిగా తిన్నా చాలు మూత్రాశయ ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. మూత్రం సాఫీగా జారీ అవుతుంది.

**గుండె ఆరోగ్యానికి..**

ఎండు కొబ్బరిని తింటే శరీరంలోని ఎల్‌డీఎల్ (చెడు కొలెస్ట్రాల్) తగ్గుతుంది. హెచ్‌డీఎల్ (మంచి కొలెస్ట్రాల్) పెరుగుతుంది. దీంతో రక్తనాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. ఫలితంగా గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా కాపాడుకోవచ్చు. ఇక ఎండు కొబ్బరిని తింటే క్యాల్షియం, మాంగనీస్ సమృద్ధిగా లభిస్తాయి. ఇవి ఎముకలను దృఢంగా, ఆరోగ్యంగా ఉంచుతాయి. ముఖ్యంగా వృద్ధాప్యంలో వచ్చే ఆస్టియో పోరసిస్ సమస్య రాకుండా అడ్డుకోవచ్చు. అలాగే ఆర్థరైటిస్ నొప్పులు ఉన్నవారికి మేలు జరుగుతుంది. కీళ్ల నొప్పులు, వాపులు తగ్గుతాయి. ఇలా ఎండు కొబ్బరిని రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే ఎన్నో ప్రయోజనాలను పొందవచ్చు. అయితే దీన్ని మరీ ఎక్కువగా తినకూడదు. రోజూ చిన్న ముక్కను తింటే చాలు, అనేక లాభాలను పొందవచ్చు.



# ఆమెతో పనిచేస్తే.. మాయలో పడిపోవాల్సిందే..



## అలియాపై జిగ్రా దర్శకుడి ఇంట్రెస్టింగ్ కామెంట్స్

‘అలియాభట్ ఓ మాయ.. ఒక్కసారి ఆమెతో పనిచేస్తే ఆ మాయలో ఎవరైనా పడిపోవాల్సిందే. ఆమె ఆరా మనల్ని కూడా కమ్మేస్తుంది.’ అంటున్నారు దర్శకుడు వాసన్‌బాల. ఇటీవలే అలియాతో ఆయన ‘జిగ్రా’ సినిమా తెరకెక్కించారు. ఫలితం ఆశించిన స్థాయిలో లేకపోయినా.. అలియాతో పనిచేశానన్న తృప్తి మాత్రం ‘జిగ్రా’ వల్ల లభించిందని ఆయన అన్నారు. ‘ ‘జిగ్రా’ సీరియస్ సబ్జెక్ట్. ఆ కథలో కామెడీ లేదు. కానీ సెట్ అంతా ఎప్పుడు కామెడీగా ఉండేది. కారణం అలియాభట్. తను నవ్వుతూ అందర్నీ నవ్విస్తూ ఓ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని క్రియేట్ చేయడం అలియా స్పెషాలిటీ. ఆమెతో ఒక్కసారి పనిచేశాక.. మళ్లీ ఇంకొకరితో పనిచేయడం చాలా కష్టం. ఎందుకంటే తనే గుర్తుకొస్తుంటుంది..’ అంటూ మాట్లాడారు వాసన్‌బాలా. దీనిబట్టి అలియా మాయ ఏ రేంజ్‌లో ఉంటుందో అర్థంచేసుకోవచ్చు.



# ‘గేమ్ ఛేంజర్’ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు చీఫ్ గెస్ట్‌గా ఏపీ డిప్యూటీ సీఎం!

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తేజ్ దిగ్గజ దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న తాజా చిత్రం గేమ్ ఛేంజర్. ఈ సినిమాను అగ్ర నిర్మాత దిల్ రాజు నిర్మిస్తుండగా.. థమన్ సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. రామ్ చరణ్ - శంకర్ - దిల్ రాజు కాంబినేషన్‌లో ఈ సినిమా వస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. అయితే ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా.. ప్రీ రిలీజ్ వేడుకను ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించబోతున్న విషయం తెలిసిందే. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను టీం ఇన్‌వైట్ చేయనున్నట్లు గత కొన్ని రోజులుగా వార్తలు చక్కర్లు కొట్టాయి. అయితే ఇదే విషయంపై నిర్మాత దిల్ రాజు నేడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో మంగళగిరి జనసేన కార్యాలయంలో భేటీ అయ్యాడు. దిల్ రాజు గేమ్ ఛేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి చీఫ్ గెస్ట్‌గా పవన్ రావాలని దిల్ రాజు కోరడంతో జనసేనాని ఒకే చెప్పినట్లు తెలుస్తుంది. ఇక ఈ ప్రీ రిలీజ్ వేడుకను జనవరి 04న రాజమండ్రిలో నిర్వహించబోతున్నట్లు సమాచారం.




# చెంచుల యువరాణిగా ప్రీతి ముకుందన్.. ‘కన్నప్ప’ నుంచి ఫస్ట్ లుక్ రిలీజ్

ఒకవైపు ఫ్యామిలీ గొడవలతో సతమవుతున్న మంచు ఫ్యామిలీ.. మరోవైపు తమ కలల ప్రాజెక్ట్ కన్నప్పను పూర్తి చేసే పనిలో పడింది. మంచు కుటుంబం నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కన్నప్ప దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తుండగా.. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్నాడు.

హిస్టారికల్ కం మైథాలజీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ మూవీ నుంచి మంచు మోహన్ బాబు, మంచు విష్ణులతో పాటు పలువురు అగ్ర కథానాయకుల ఫస్ట్ లుక్‌లను పంచుకున్న చిత్రబృందం తాజాగా ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్న ప్రీతి ముకుందన్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. ఈ సినిమాలో ప్రీతి కన్నప్ప ఇష్టసఖి, చెంచుల యువరాణి నెమలి పాత్రలో నటిస్తుంది. ”అందంలో సహజం.. తెగింపులో సాహసం.. ప్రేమలో అసాధారణం.. భక్తిలో పారవశ్యం.. కన్నప్పకి సర్వస్వం చెంచుల యువరాణి నెమలి అంటూ” ప్రీతి ముకుందన్ ఫస్ట్‌లుక్‌ను పంచుకుంది

# ముస్లిం నుంచి క్రైస్తవ మతాన్నికి మారడానికి కారణం ఇదే



రెజీనా కసాండ్రా.. ఈ అమ్మడి గురించి ప్రత్యేకంగాపరిచయం చేయాల్సిన అవసరం లేదు. రెజీనా పుటింది ముస్లిం కుటుంబంలో కానీ ఆతర్వాత క్రైస్తవ మతాన్ని స్వీకరించింది. తాజాగా రెజీనా కసాండ్రా ముస్లిం కుటుంబంలో పుట్టి క్రైస్తవ మతాన్ని స్వీకరించడానికి గల కారణాన్ని వెల్లడించింది. నటి రెజీనా కసాండ్రా 1990 డిసెంబర్ 13న చెన్నైలో జన్మించింది. 9 సంవత్సరాల వయస్సులో, ఆమె పిల్లల టీవీ ఛానెల్ లో యాంకర్‌గా తన కెరీర్ ప్రారంభించింది. ఆమె ముద్దుముద్దు మాటలు అభిమానుల దృష్టిని ఆకర్షించాయి. 14 సంవత్సరాల వయస్సులో, నటి రెజీనా కసాండ్రా నటుడు ప్రసన్న, లైలా జంటగా నటించిన తమిళ చిత్రం ‘కంద నాన్ మూ’లో లైలా చెల్లెలుగా నటించింది.ఆ తర్వాత 2012లో తెలుగులో ‘శివ మనసుల శ్రుతి’ సినిమాతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది రెజీనా కసాండ్రా. ఈ చిత్రంలో తన నటనకు సైమా ఉత్తమ తొలి నటి అవార్డును గెలుచుకుంది. 2019లో ‘ఏక్ లత్కీ కో దేకా దో’ సినిమాతో హిందీలో అడుగు పెట్టింది. ఇలా తమిళ్, తెలుగు, హిందీ భాషల్లో సినిమాలు చేసింది. తమిళంలో పెద్దగా విజయం సాధించకపోయినా తెలుగులో మంచి క్రేజ్ తెచ్చుకుంది ఈ ముద్దుగుమ్మ. నటి రెజీనా కసాండ్రా ప్రస్తుతం మిజ్ తిరుమేని దర్శకత్వంలో ఓ సినిమా చేస్తుంది. ఈ చిత్రంలో అజిత్ కుమార్ హీరోగా నటిస్తున్నాడు. ఈ చిత్రం పొంగల్ పండుగకు ముందు 2025 జనవరిలో విడుదల కానుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో నటి రెజీనా ముస్లింగా పుట్టిన తర్వాత క్రిస్టియన్‌గా ఎందుకు మారిందని చెప్పుకొచ్చింది. ఇది ఇంటర్నెట్‌లో వైరల్ అవుతోంది. మా నాన్న ముస్లిం, అమ్మ క్రిస్టియన్. వీరిద్దరూ ప్రేమ వివాహం చేసుకున్నారు. అలా పుట్టినప్పటి నుంచి 6 ఏళ్ల వరకు ముస్లిం అమ్మాయిగానే పెరిగాను. ఆ తర్వాత మా తల్లిదండ్రులు విడాకులు తీసుకుని విడిపోవడంతో నేను మా అమ్మ దగ్గరే ఉండాల్సి వచ్చింది. మా అమ్మకు ఇస్లాం గురించి ఏమీ తెలియదు. కాబట్టి ఆమె నన్ను క్రైస్తవ మతాన్ని అనుసరించమని అడిగాడు. ఆ తర్వాతే నేను చర్చిలో బాప్టిజం పొంది క్రైస్తవ మతంలోకి మారానని ఆ ఇంటర్వ్యూలో తెలిపింది రెజీనా.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com